



www.vishvambhara.com
తెలుగు దినపత్రిక

# విశ్వంభర

అక్షరం సాక్షిగా..

శుక్రవారం
05-07-2024

సంపుటి : 01 । సంచిక : 62 । పేజీలు : 12 । వెల : 5/-  తెలంగాణ / ఆంధ్రప్రదేశ్

V3 NEWS



## నిఘా విభాగాలకు నిధులివ్వండి

- అమిత్ షాను కోరిన సీఎం రేవంత్
- టెక్నాలజీ పరికరాల కోసం నిధులు కావాలన్న రేవంత్
- 29 మంది అదనపు ఐపీఎస్ లను కేటాయించాలంటూ వినతి
- ఆయన వెంట డిప్యూటీ సీఎం

6



## పార్టీ ఫిరాయింపులపై ఉన్న శ్రద్ధ రైతులపై లేదు

- రైతుల ఆత్మహత్యలు నిత్యకృత్యమయ్యాయి
- పురుగుల మందే రైతన్నలకు పెరుగన్నం అయ్యే
- బీఆర్ఎస్ మాజీ మంత్రి హరీష్ రావు ఫైర్

**విశ్వంభర, హైదరాబాద్ :** తెలంగాణలో రైతుల ఆత్మహత్యలు నిత్యకృత్యమయ్యాయని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నా ప్రభుత్వం పట్టించుకోలేదని మండిపడ్డారు. రైతుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకపోవడం బాధాకరం అని అన్నారు. ప్రభుత్వానికి పార్టీ ఫిరాయింపులపై ఉన్న శ్రద్ధ రైతులపై లేదని విమర్శించారు. రాష్ట్రంలో రైతుల ఆత్మహత్యలు, ఆత్మహత్యాయత్నాలు నిత్యకృత్యం అయినా కాంగ్రెస్ ప్రభుత్వానికి చీమకుట్టినట్లైనా లేకపోవడం దుర్మార్గం. ఖమ్మం జిల్లాలో మొన్న ఒక రైతు పురుగుల మందు తాగి ప్రాణాలు వదిలితే, తన సమస్యకు మిగతా2లో...

రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడటంలో

## రాహుల్ గాంధీ విఫలం

- బీఆర్ఎస్ పార్టీలో గెలిచిన వారిని కాంగ్రెస్‌లో ఎలా చేర్చుకుంటారు?
- పార్టీ ఫిరాయింపులపైన రాహుల్ గాంధీ మాటల్ని దేశం నమ్మదు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్




**విశ్వంభర, హైదరాబాద్ :**

రాజ్యాంగం గురించి పదేపదే మాట్లాడి రాహుల్ గాంధీ రాజ్యాంగ స్ఫూర్తిని నిలబెట్టడంలో విఫలమయ్యారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. రాజ్యాంగంలోని పదవ షెడ్యూల్ కి కట్టుబడి ఉన్నామని చెప్తున్న రాహుల్ గాంధీ, ఒకవైపు ఇతర పార్టీలలో గెలిచిన వారిని కాంగ్రెస్లో చేర్చుకుంటూ రాజ్యాంగ స్ఫూర్తిని తుంగలో తొక్కుతున్నారన్నారు. బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలను తాము ఇచ్చిన న్యాయపత్ర (మేనిఫెస్టోకి) విరుద్ధంగా పార్టీలో చేర్చుకుంటూనే, ఫిరాయింపులను అరికడతామంటూ చెబుతున్న రాహుల్ గాంధీ మాటల్ని దేశం ఎలా నమ్ముతుందని కేటీఆర్ అన్నారు. రాహుల్ గాంధీకి తాము హామీ ఇచ్చిన పార్టీల ఫిరాయింపులను నిరోధిస్తాం అన్న మానిఫెస్టో అంశం పైన చిత్తశుద్ధి ఉంటే కాంగ్రెస్ పార్టీలో చేరిన బిఆర్ఎస్ ఎమ్మెల్యేల చేత రాజీనామా మిగతా2లో...



మాజీ ముఖ్యమంత్రి రోశయ్య జయంతి సందర్భంగా.. ఢిల్లీలో ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్, ఇతర నేతలు.



# అర్ధరాత్రి గులాబీకి గుడ్ బై

### హస్తం గూటికి ఆరుగురు ఎమ్మెల్సీలు

- రేవంత్ రెడ్డి నివాసంలో కాంగ్రెస్ పార్టీలో చేరిక
- కండువా కప్పి ఆహ్వానించిన దీపాదాస్ మున్షీ
- సీఎం ఢిల్లీ నుంచి వచ్చే వరకు వెయిటింగ్
- తెల్లారితే అమావాస్య ఉందని ఆగమేఘాల మీద చేరిక
- శాసన మండలిలో 12 మందికి చేరిన కాంగ్రెస్ సభ్యుల సంఖ్య

2

“ బీఆర్ఎస్ పార్టీకి బిగ్ షాక్ తగిలింది. ఆ పార్టీకి చెందిన ఆరుగురు ఎమ్మెల్సీలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఇప్పటికే వరుసబెట్టి హస్తం పార్టీలోకి వెళ్తున్న గులాబీ ఎమ్మెల్యేలకు తోడు గురువారం అర్ధరాత్రి ఆరుగురు ఎమ్మెల్సీలు కాంగ్రెస్ కండువా కప్పకున్నారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఎమ్మెల్సీలు దండే విటల్, భాను ప్రసాద్, బుగ్గారపు దయానంద్, ప్రభాకర్ రావు, ఎగ్గే మల్లేశం, బసవరాజు సారయ్య రాత్రి 11 గంటల సమయంలో సీఎం రేవంత్ రెడ్డి నివాసానికి చేరుకున్నారు. సీఎం ఢిల్లీ నుంచి తిరిగి వస్తున్న నేపథ్యంలో ఆయన వచ్చే వరకు సుమారు 2 గంటలపాటు వేచి ఉన్నారు. ఆయన వచ్చిన కొద్దిసేపు చర్చలు జరిపారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఇన్ చార్జ్ దీపాదాస్ మున్షీ ఆరుగురు ఎమ్మెల్సీలకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. తెల్లారితే అమావాస్య ప్రారంభం అవుతున్న కారణంగా రాత్రికి రాత్రే పార్టీ మారిపోయి ఎమ్మెల్సీలు సంచలనం సృష్టించారు. చేరికల సమయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్ రావు ఉన్నారు.

## ఆర్థిక క్రమశిక్షణకు పెట్టింది పేరు కొణిజేటి రోశయ్య

- 16 సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టిన ఆర్థిక మేధావి
- రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు
- రవీంద్రభారతిలో ఘనంగా మాజీ సీఎం రోశయ్య 91వ జయంతి



2

చంద్రబాబు, రేవంత్ భేటీకి

## కాంగ్రెస్ పర్మిషన్ ఇచ్చిందా?

- ఇద్దరి ముఖ్యమంత్రుల సమావేశం ఏ క్షణమైనా రద్దు కావచ్చు
- ఇద్దరు ముఖ్యమంత్రులు కలవాలని తాము కోరుకుంటున్నాం
- బీజేపీ నేత ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ సంచలన వ్యాఖ్యలు



4

## కేకేకు రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక సలహాదారుగా క్యాబినెట్ ర్యాంకు

2

మరిన్ని తాజా వార్తల కోసం స్కాన్ చేయండి



## నేటి చికెన్ ధరలు

| ఫామ్ ధర | రిటైల్ |
|---|---|
| ₹ 112 | ₹ 134 |
| స్కిన్ | స్కిన్‌లెస్ |
| ₹ 194 | ₹ 221 |

## దేశంలో మరో ఉద్యమం చేద్దామనుకున్న

రైతుల కోసం దేశ వ్యాప్తంగా పోరాడుదామనుకున్న



- ఓడిపోవడంతో ఆగిపోయా
- బీఆర్ ఎస్ ఓడిపోతే మహారాష్ట్ర రైతులు బాధపడ్డరు
- చాలా రాష్ట్రాల రైతుల ఆశలు ఆవిరైపోయినై
- కార్యకర్తల సమావేశంలో మాజీ సీఎం కేసీఆర్

**విశ్వంభర, హైదరాబాద్ :**

ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటైన తెలంగాణ అనతికాలంలోనే దేశానికి ఆదర్శంగా పాలనను అందించిందని బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు అన్నారు. విద్యుత్, సాగునీరు, వ్యవసాయ తదితర రంగాల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యాచరణ దేశ చరిత్రలోనే ముందెన్నడూ లేని విధంగా కొనసాగిందని పేర్కొన్నారు. తెలంగాణ వ్యవసాయ ప్రగతిని చూసి మహారాష్ట్రవంటి పక్క రాష్ట్రాల ప్రజలు తమకూ కేసీఆర్ పాలన కావాలని కోరుకున్నారని తెలిపారు. ఖమ్మం, మహబూబాబాద్, వేములవాడ, మిగతా2లో...

## ఆర్టీసీకి కాంగ్రెస్ ఒక్క రూపాయి ఇవ్వలేదు

- నెలకు రూ.15 కోట్ల చొప్పున నష్టం
- ఆరు నెలల్లో 2500 కోట్లు నష్టం
- ఉచిత బస్సు పథకం డబ్బులు వెంటనే చెల్లించాలి
- టీజీఎస్ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీ. శ్రీనివాస్ రావు



2

## కాంగ్రెస్‌లో ఆధిపత్య పోరు

2

## ఆ మాజీ మంత్రి ఏమయ్యారు?

- బీఆర్ఎస్‌కు దూరమైనట్టేనా..?
- అంటీముట్టనటున్న గంగుల
- ఇంటికే పరిమితమైన కమలాకర్
- సీఎంతో సన్నిహిత సంబంధాలు



2

బొగ్గు బ్లాకులు సింగరేణికే

## కేటాయించాలి

హైదరాబాద్‌కు ఐటీఐఆర్‌ను పునరుద్ధరించాలి..

- తెలంగాణకు 25 లక్షల ఇళ్లు మంజూరు చేయండి..
- రక్షణ శాఖ భూముల 2,450 ఎకరాలు కేటాయించండి.
- విభజన చట్టంలో పేర్కొన్న అంశాలను నెరవేర్చాలి..
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి



**విశ్వంభరా ఢిల్లీ:** సింగరేణి పరిధిలోని బొగ్గు గనులను సింగరేణికే కేటాయించాలని, ప్రస్తుతం వేలంలో పెట్టిన శ్రావణపల్లి బొగ్గు బ్లాక్‌ను వేలం జాబితా నుంచి తొలగించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. మిగతా2లో...



## ఆర్థిక క్రమశిక్షణకు పెట్టింది పేరు కొణిజేటి రోశయ్య

**విశ్వంభర, హైదరాబాద్ :** 16 సార్లు బడ్జెట్ ప్రవేశ పెట్టిన ఆర్థిక నిపుణులు ,ఆర్థిక మేధావి మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య అని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. నాటి ఉమ్మడి రాష్ట్రంలో ఆర్థికపరమైన అంశాలను ప్రజలకు ఏ సంక్షేమం చేస్తే బాగుంటుందో ఆ సంక్షేమానికి తగిన ఆర్థిక బడ్జెట్ ను తయారు చేసేవారని రాష్ట్ర ప్రజల ఆర్థిక పరిస్థితులను బట్టి ప్రజలు ఋణగ్రస్తులు కాకుండా ఆర్థిక మేధావిల అలోచించి వ్యవహరించేవారని మంత్రి శ్రీధర్ బాబు , కేవీపీ లు నాటి పరిస్థితులను గుర్తు చేసారు. రవీంద్ర భారతిలో ఏర్పాటు చేసిన వాగ్గేయకార సప్త స్వరాలు ముఖ్య కార్యక్రమంలో ప్రియ సిస్టర్స్ గా పేరుగాంచిన హరిప్రియ ,షణ్ముఖ ప్రియలకు దివంగత కొణిజేటి రోశయ్య 91వ జయంతిని పురస్కరించుకొని జీవన సాఫల్య పురస్కారమును మంత్రి శ్రీధర్ బాబు, మాజీ రాజ్యసభ సభ్యులు కేవీపీ రామచంద్రరావు లు ముఖ్య అతిధులుగా పాల్గొని అందజేశారు. ప్రముఖ సంగీత దర్శకులు సాలూరి కోటి ని మంత్రి, మాజీ ఎంపీలు ఘనంగా సన్మానించారు. ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ , మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణ మోహన్ లు పాల్గొని కొణిజేటి రోశయ్య చేసిన సేవలను గుర్తు చేసుకుంటూ కొనియాడారు.వాసవి ఆర్ట్స్ సమర్పణలో చేపట్టిన కార్యక్రమంలో కొణిజేటి రోశయ్య కుటుంబ సభ్యులు ,సన్నిహితులు అతిధులుగా విచ్చేసిన వారికి సన్మానం చేసి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్, అమరవాది లక్ష్మీనారాయణ,కోలేటి దామోదర్, బండారు సుబ్బారావు ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్, ఏపీ మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణ మోహన్,బండారు సుబ్బారావు, దైవజ్ఞ శర్మ,ప్రముఖ సంగీత దర్శకులు సాలూరి కోటి, ఉప్పల శారద, విజయ్ కుమార్ తదితరులు పాల్గొనడం జరిగింది.

## కాంగ్రెస్‌లో ఆధిపత్య పోరు

**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో అంతర్గత సంక్షోభం, ఆధిపత్య పోరు కనిపించకుండా భారీగా ఉందని కేబినెట్ విస్తరణ ఆగిపోవడం.. పీసీసీ చీఫ్ పదవి పై ఓ అంచనాకు రాలేకపోవడం వల్ల అర్థం చేసుకోవచ్చని రాజకీయవర్గాలు అంచనా వేస్తున్నాయి. మంత్రివర్గంలో ఖాళీగా ఉన్న ఆరు మంత్రి పదవుల్ని భర్తీ చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అనుకున్నారు. ప్రాంతాలు, వర్గాలు సమీకరణాల్ని రెడీ చేసుకుని ఐదుగురి పేర్లతో హైకమాండ్ వద్దకు వెళ్లారు. ఒక స్థానాన్ని ఖాళీగా ఉంచారని అనుకున్నారు. అయితే రేవంత్ కు పోటీగా మరో ఇద్దరు సీనియర్ మంత్రులు.. కేబినెట్ లో ఫలానా వాళ్లకు చోటు కల్పించాలంటూ.. చెరో జాబితా సమర్పించారని తెలుస్తోంది. దీంతో హైకమాండ్ అన్ని పేర్లను పక్కన పెట్టింది. ఏకాభిప్రాయం వస్తుందేమోనని హైకమాండ్ చర్చలు జరిపినప్పటికీ రాకపోవడంతో పక్కన పెట్టేశారు. లోక్ సభ ఎన్నికల్లో ఆశావహులతో గట్టిగా పని చేయించడానికి వాటిని తాయిలాలుగా చూపించాలని ఆరు ఖాళీలు ఉంచారు. కానీ ఇప్పుడా పధవుల భర్తి అంత తేలికగా అయ్యే అవకాశాలు కనిపించడం లేదు. ఎందుకంటే ఒక్క రేవంత్ చాయిస్సే కాదు. హైకమాండ్ అనుమతి కూడా ఉండాలి. మంత్రివర్గంలో ఖాళీగా ఉన్న మొత్తం ఆరు స్థానాల్లో ఉమ్మడి నిజామాబాద్ నుంచి సుదర్శన్‌రెడ్డి, రంగారెడ్డి నుంచి మల్‌రెడ్డి రంగారెడ్డి, దానం నాగేందర్, యాదాద్రి భువనగిరి జిల్లా నుంచి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావు, ఉమ్మడి మహబూబ్ నగర్ నుంచి మక్తల్ ఎమ్మెల్యే శ్రీహరి పేర్లు ఎక్కువగా వినిపిస్తున్నాయి. రంగారెడ్డి జిల్లా నుంచి ఒక్క మల్ రెడ్డి మాత్రమే గెలిచారు. తనకు చాన్సివ్వాల్సిందేనని ఆయన పట్టుబడుతున్నారు. ఎంపీగా ఓడిపోతే మంత్రి పదవి ఆఫర్ తో దానం నాగేందర్ పార్టీలో చేరారు. మరో వైపు దామోదర రాజనర్సింహ.. రెండు పేర్లు ప్రకటించేశారు. సీతక్కకు డిప్యూటీ సీఎం ఇస్తారని చెప్పుకొచ్చారు. దీంతో కాంగ్రెస్ లో అలజడి రేగింది. ఇక నామినేటెడ్ పోస్టుల వ్యవహారం తేలడం లేదు. ఎన్నికలకు ముందు కొంత మందికి నామినేటెడ్ పోస్టులు ప్రకటించారు. ఇప్పటికీ జీవో రిలీజ్ చేయలేదు. వాటికే అధికారిక హోదా ఇవ్వకపోతే కొత్తవి ఎప్పుడు భర్తీ చేస్తారోనని కాంగ్రెస్ క్యాడర్ టెన్షన్ పడుతోంది. అధికారంలోకి వచ్చి నెలలు గడిచిపోతున్నాయి కానీ.. కష్టపడిన దానికి ఫలం మాత్రం దక్కడం లేదని ద్వితీయ శ్రేణి నేతలు ఫీలవుతున్నారు. పీసీసీ చీఫ్ పోస్టుతో పాటు మంత్రి పదవుల భర్తీని కూడా కొంతకాలం ఆపాలని హైకమాండ్ నిర్ణయించడంతో రేవంత్ రెడ్డి ఇక పాలనపై దృష్టి పెట్టనున్నారు. ఈ నెలలో ఆయన పూర్తి స్థాయి బడ్జెట్ ను ప్రవేశ పెట్టాల్సి ఉంది. అందులో రుణమాఫీకి నిధులతో పాటు అనేక పథకాలు అమలు చేస్తామని నమ్మకం కలిగించే విధంగా నిధులు కేటాయించాల్సి ఉంది. ముందు ఈ గండాన్ని గట్టెక్కాలని పాలనను దారిలో పెట్టుకోవాలని హైకమాండ్ సూచనలను పాటించేందుకు రేవంత్ రెడీ అయ్యారు. అంతిమంగా రేవంత్ రెడ్డి అనుకున్న విధంగా కాంగ్రెస్ పార్టీపై పూర్తి స్థాయిలో పట్టు సాధించలేకపోయారని అందుకే.. ఆయన జాబితాలను కాంగ్రెస్ పక్కన పెట్టి సీనియర్ నేతల మాటలకు విలువ ఇస్తోందన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ పరిణామం సీనియర్లకు మరింత ఉత్సాహం ఇస్తోందని అనుకోవచ్చు.

## కేకేకు రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక సలహాదారుగా క్యాబినేట్ ర్యాంకు

**విశ్వంభర, హైదరాబాద్ :** సీనియర్ నాయకుడు కే. కేశవరావు కాంగ్రెస్ పార్టీలో చేరిన విషయం తెలిసిందే. కాంగ్రెస్ కండువా కప్పుకున్న కేశవరావు ఈరోజు ఎంపీ పదవికి రాజీనామా చేశారు.ఈ క్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేకే ఇంటికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు.తిరిగి సొంతగూటికి చేరిన కేకేతో సమావేశం తర్వాత సీఎం రేవంత్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కేకే కు రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక సలహాదారుగా క్యాబినేట్ రాంక్ ఇస్తామని రేవంత్ రెడ్డి తెలిపారు. తెలంగాణాలో ఒక పార్టీ అధికారంలోకి వచ్చాక 10 సంవత్సరాలు పక్కా ఉంటుందని, ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలో ఉందని, రెండోసారి కూడా ఖచ్చితంగా అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేశారు.మూసీ అభివృద్ధి పై దృష్టి పెట్టామని.. ఈ ప్రాజెక్టు తన పేరు పై రికార్డుగా ఉంటుందని రేవంత్ రెడ్డి అన్నారు. మూసీ అభివృద్ధి, రీజనల్ రింగ్ రోడ్డు నిర్మాణానికి తమ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. ప్రభుత్వ వ్యవహారంలో తప్పులకు ఆస్కారం ఇవ్వనని.. రూల్స్ ప్రకారమే ముందుకు పోతానని రేవంత్ రెడ్డి తెలిపారు.

## రాజ్యసభ పదవికి కేకే రాజీనామా

**విశ్వంభర, హైదరాబాద్:** రాజ్యసభ సభ్యత్వానికి కే కేశవరావు గురువారం రాజీనామా సమర్పించారు. ఈ మేరకు ఆయన రాజ్యసభ చైర్మన్ జగ్‌దీప్ ధన్‌ఖడ్‌కు రాజీనామా అందజేశారు. బీఆర్ఎస్ పార్టీ ఆయనను రాజ్యసభకు పంపిన విషయం తెలిసిందే. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సమయంలో బుధవారం కేకే కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయన పార్టీ మారడంతో రాజీనామా చేశారు. కేశవరావును బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రాజ్యసభకు నామినేట్ చేశారు. 2020 సెప్టెంబర్‌లో కేకే రాజ్యసభ సభ్యుడిగా ప్రమాణం చేశారు. మరో రెండేళ్ల పదవీకాలం ఉండగానే రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ఆయన గత ఏప్రిల్‌లో పార్టీ మారిన విషయం తెలిసిందే. నిన్న జాతీయ అధ్యక్షుడి సమక్షంలో పార్టీ చేరి.. తాజాగా రాజ్యసభకు రాజీనామా చేశారు.

# బొగ్గు బ్లాకులు సింగరేణికే కేటాయించాలి

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వ రంగంలో ఉన్న సింగరేణి కాలరీస్ కంపెనీ (ఎస్‌సీసీఎల్)లో తెలంగాణ ప్రభుత్వానికి 51 శాతం, కేంద్ర ప్రభుత్వానికి 41 శాతం వాటాలున్నట్లు ప్రధానమంత్రి దృష్టికి ముఖ్యమంత్రి తీసుకెళ్లారు. గనులు, ఖనిజాభివృద్ధి నియంత్రణ చట్టంలోని (ఎంఎండీఆర్) సెక్షన్ 11ఏ/17 (ఏ) (2) ప్రకారం వేలం జాబితా నుంచి శ్రావణపల్లి గనిని తొలగించాలని, అదే సెక్షన్ ప్రకారం గోదావరి లోయ బొగ్గు నిల్వల క్షేత్రం పరిధిలోని కోయగూడెం, సత్తుపల్లి బ్లాక్ 3 గనులనూ సింగరేణికే కేటాయించాలని ప్రధానమంత్రి మోదీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. రాష్ట్రంలోని విద్యుదుత్పత్తి కేంద్రాల అవసరాలు తీర్చేందుకు ఈ గనుల కేటాయింపు కీలకమైనందున, సింగరేణికే వాటిని కేటాయించాలని ప్రధానమంత్రికి ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఆయన నివాసంలో గురువారం మధ్యాహ్నం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కలిశారు. బొగ్గు గనుల కేటాయింపు, ఐటీఐఆర్ పునరుద్ధరణ, రక్షణ భూముల కేటాయింపు, రాష్ట్ర పునర్విభజన చట్టంలోని అంశాలపై ప్రధానమంత్రితో ముఖ్యమంత్రి చర్చించారు. ప్రధానమంత్రి నివాసానికి మధ్యాహ్నం 12.30 గంటలకు చేరుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సుమారు గంట సేపు రాష్ట్రానికి సంబంధించిన అంశాలపై ప్రధానమంత్రితో చర్చించారు. ప్రధానమంత్రితో ముఖ్యమంత్రి భేటీలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పాల్గొన్నారు. 2010 సంవత్సరంలో నాటి యూపీఏ ప్రభుత్వం హైదరాబాద్, బెంగళూరు నగరాలకు సమాచార సాంకేతిక పెట్టుబడుల ప్రాంతం (ఐటీఐఆర్) మంజూరు చేసిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. ఐటీ రంగంలో నూతన కంపెనీలు, దేవలపర్లను ప్రోత్సహించేందుకు వీలుగా తెలంగాణ ప్రభుత్వం 3 క్లస్టర్లలో అందుకు అవసరమైన భూమిని గుర్తించిందన్నారు. 2014 తర్వాత ఐటీఐఆర్ ముందుకు సాగలేదని, హైదరాబాద్‌కు ఐటీఐఆర్ పునరుద్ధరించాలని పీఎంను సీఎం కోరారు.

**కోచ్ ఫ్యాక్టరీ... ఐఐఎం....**

ప్రతి రాష్ట్రంలో ఒక ఐఐఎం స్థాపించాలని కేంద్ర ప్రభుత్వం విధాన నిర్ణయంగా తీసుకున్నా ఇప్పటివరకు తెలంగాణకు ఐఐఎం మంజూరు కాలేదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దృష్టికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకెళ్లారు. వెంటనే హైదరాబాద్‌లో ఐఐఎం మంజూరు చేయాలని, ఇందుకోసం హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ క్యాంపస్‌లో సరిపడా భూమి అందుబాటులో ఉందని తెలిపారు. సెంట్రల్ యూనివర్సిటీలో కాకుండా మరెక్కడైనా ఐఐఎం ఏర్పాటు చేస్తామన్నా ప్రత్యామ్నాయంగా భూ కేటాయింపునకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి వివరించారు. తెలంగాణలో కొత్తగా ఏర్పడిన అన్ని జిల్లాల్లో జవహర్ నవోదయ విద్యాలయాలు ఏర్పాటు చేయాలని ప్రధానమంత్రిని ముఖ్యమంత్రి కోరారు. రాష్ట్రానికి 24 నవోదయ విద్యాలయాలు మంజూరు చేయాలని కోరారు. రాష్ట్ర పునర్విభజన సమయంలో కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీకి కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చిన విషయాన్ని ప్రధానమంత్రి మోదీకి ముఖ్యమంత్రి గుర్తు చేశారు. కోచ్ తయారీ కేంద్రానికి బదులు కాజీపేటలో పీరియాడికల్ ఓవరోలింగ్ వర్క్‌షాప్ ఏర్పాటు చేస్తున్నట్లు 2023 జులైలో రైల్వే మంత్రిత్వ శాఖ ప్రకటించిందని తెలిపారు. దేశంలోని ఇతర ప్రాంతాలకు కోచ్ ఫ్యాక్టరీలు మంజూరు చేసిన రైల్వే శాఖ కాజీపేటలో మాత్రం రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయడం సాధ్యం కాదని ప్రకటించడం సరికాదన్నారు. కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ మంజూరు చేయాలని ప్రధానమంత్రికి విజ్ఞప్తి చేశారు. ఇండియా సెమీకండక్టర్ మిషన్ లో తెలంగాణను చేర్చాలని ప్రధానమంత్రి మోదీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. హైదరాబాద్‌లో సెమీకండక్టర్ ఫ్యాబ్స్‌ను నెలకొల్పేందుకు పలు కంపెనీలు ఆసక్తి కనపర్చుతున్నట్లు మోదీకి రేవంత్ రెడ్డి తెలియజేశారు. ఆయా కంపెనీల ప్రతిపాదనలు ప్రస్తుతం ఇండియా సెమీకండక్టర్ మిషన్ సమీక్షలో ఉన్నందున, ఇండియా సెమీకండక్టర్ మిషన్ లో తెలంగాణ రాష్ట్రానికి చోటు కల్పించాలని ప్రధానమంత్రిని ముఖ్యమంత్రి కోరారు.



**తెలంగాణకు ఇళ్లు కేటాయించండి...**

ప్రధానమంత్రి ఆవాస్ యోజన్ (PMAY) తొలి దశలో తెలంగాణ రాష్ట్రానికి తక్కువ ఇళ్లు మంజూరయ్యాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. నాడు రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలు పీఎంఏవై మార్గదర్శకాలకు అనుగుణంగా లేకపోవడంతో తక్కువ ఇళ్లు మంజూరయ్యాయని వివరించారు. 202425 నుంచి ప్రారంభమవుతున్న పీఎంఏవై పథకంలో 3 కోట్ల గృహాలను లక్ష్యంగా ఎంచుకున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందని, అందులో తెలంగాణకు 25 లక్షల ఇళ్లు మంజూరు చేయాలని ప్రధానమంత్రిని ముఖ్యమంత్రి కోరారు. పీఎంఏవై మార్గదర్శకాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ఇళ్ల నిర్మాణాల విధివిధానాలను రూపొందించేందుకు సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి వెల్లడించారు.

**సంసిద్ధంగా ఉంది.**

**బీఆర్‌జీఎఫ్ నిధులు రూ.1800 కోట్లు ఇవ్వండి..**

వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి నిధి (BRGF) కింద కేంద్ర ప్రభుత్వం 2015 నుంచి 2019 వరకు అయిదేళ్లలో తెలంగాణకు రూ.2,250 కోట్లు కేటాయించిందని ప్రధానమంత్రి మోదీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఒక్కో ఏడాదికి రూ.450 కోట్ల చొప్పున ఈ గ్రాంట్ మంజూరు చేశారని, 201920, 202122, 202223, 202324 సంవత్సరాలకు సంబంధించి బీఆర్‌జీఎఫ్ కింద తెలంగాణకు రావల్సిన రూ.1,800 కోట్లు విడుదల చేయాలని ప్రధానమంత్రికి ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు.

**రక్షణ శాఖ భూముల బదిలీ చేయండి...**

రాజధాని హైదరాబాద్‌లో పెరిగిన ట్రాఫిక్ అవసరాల దృష్ట్యా హైదరాబాద్‌కరీంనగర్ రహదారి, హైదరాబాద్ నాగ్‌పూర్ రహదారి (ఎన్‌హెచ్44)పై ఎలివేటెడ్ కారిడార్ల నిర్మించాలని నిర్ణయించినట్లు ముఖ్యమంత్రి ప్రధానమంత్రికి తెలియజేశారు. ఆ రెండు కారిడార్ల నిర్మాణానికి అడ్డంకి లేకుండా మార్గమధ్యంలో రక్షణశాఖ పరిధిలో ఉన్న భూములను రాష్ట్ర ప్రభుత్వానికి బదిలీ చేయాలని కోరారు. ఆ కారిడార్లతో పాటు హైదరాబాద్ నగరంలో రహదారుల విస్తరణ, రవాణా, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు కేంద్ర రక్షణ శాఖ పరిధిలో 2450 ఎకరాల భూములను రాష్ట్ర ప్రభుత్వానికి బదిలీ చేయాలని ప్రధానమంత్రి మోదీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఆ భూములకు ప్రత్యామ్నాయంగా రావిరాల ప్రాంతంలో రీసెర్చ్ సెంటర్ ఇమరాత్ (RIC) కి లీజుకు ఇచ్చిన 2,462 ఎకరాల భూములను పూర్తిగా కేంద్రానికి అప్పగించేందుకు తమ ప్రభుత్వం సంసిద్ధంగా ఉందని తెలిపారు.

**బయ్యారంలో ఉక్కు కర్మాగారం**

రాష్ట్ర పునర్విభజన చట్టం ప్రకారం తెలంగాణలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి బయ్యారంలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చిందని ప్రధానమంత్రి మోదీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలియజేశారు. ఉక్కు కర్మాగారం ఏర్పాటుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వ సంస్థలు ఇప్పటికే సాధ్యాసాధ్యాల నివేదికలు సమర్పించాయని, వెంటనే ఉక్కు కర్మాగారాన్ని నెలకొల్పే ప్రక్రియను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి కోరారు.

**జాతీయ రహదారులుగా...**

తెలంగాణలోని ప్రధాన పట్టణాలు, పుణ్య క్షేత్రాలకు పెరిగిన రవాణా అవసరాల దృష్ట్యా 13 రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా అప్‌గ్రేడ్ చేయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. జగిత్యాలపెద్దపల్లికాటారం, దిండిదేవరకొండమల్లెపల్లినల్గొండ, భువనగిరి చిట్యాల, చౌటుప్పల్ అమన్‌గల్‌షాద్ నగర్‌సంగారెడ్డి, మరికల్ నారాయణపేట రామసముద్ర, వనపర్తికొత్తకోటగద్వాల మంత్రాలయం, మన్నెగూడవికారాబాద్‌తాండూరుజహీరాబాద్‌బీదర్, కరీంనగర్‌సిరిసిల్ల కామారెడ్డిఎల్లారెడ్డిపిట్లం, ఎర్రవల్లి ఎక్స్ రోడ్డుగద్వాలరాయచూరు, కొత్తపల్లి హుస్నాబాద్ జనగాం హైదరాబాద్, సారపాక ఏటూరునాగారం, దుద్దెడ కొమురవెల్లియాదగిరిగుట్ట రాయగిరి క్రాస్ రోడ్డు, జగ్గయ్యపేట వైరాకొత్తగూడెం రహదారులను జాతీయ రహదారులుగా అప్ గ్రేడ్ చేయాలని ప్రధానమంత్రిని ముఖ్యమంత్రి కోరారు.

### రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణం వేగవంతం చేయాలి..

భారత్‌మాల పరియోజన మొదటి దశలో కేంద్ర ప్రభుత్వం హైదరాబాద్ రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్) ఉత్తర భాగం (సంగారెడ్డి నుంచి చౌటుప్పల్ వరకు) జాతీయ రహదారి నిర్మాణానికి ఆమోదం తెలిపిందని ప్రధానమంత్రి దృష్టికి ముఖ్యమంత్రి తీసుకెళ్లారు. ఆ రహదారి నిర్మాణానికి సంబంధించిన భూ సేకరణ వ్యయంలో 50 శాతం ఖర్చును ఇవ్వడంతో పాటు రహదారి నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రధానమంత్రికి ముఖ్యమంత్రి తెలియజేశారు. ఈ రహదారులకు సంబంధించిన టెండర్ల ప్రక్రియను వీలైనంత తొందరగా చేపట్టాలని కోరారు. హైదరాబాద్ చుట్టూ జాతీయ రహదారుల అభివృద్ధికి అత్యంత ఉపయోగంగా ఉండే ఆర్‌ఆర్‌ఆర్ దక్షిణ భాగాన్ని (చౌటుప్పల్ నుంచి సంగారెడ్డి వరకు) వెంటనే జాతీయ రహదారిగా గుర్తించి, వెంటనే భారత్ మాల పరియోజనలో దాని నిర్మాణం చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

# దేశంలో మరో ఉద్యమం చేద్దామనుకున్నా

(మొదటి పేజీ తరువాయి)

నర్సాపూర్, ఇబ్రహీంపట్నం తదితర ప్రాంతాల నుంచి తనను కలిసేందుకు వచ్చిన నాయకులు, కార్యకర్తలతో ఎర్రవెల్లిలోని వ్యవసాయక్షేత్రంలో కేసీఆర్ సమావేశమయ్యారు. అనంతరం కేసీఆర్ మాట్లాడుతూ అబ్ కీ బార్ కిసాన్ సర్కార్' నినాదంతో దేశంలో రైతు రాజ్యం తెచ్చుకోవాలని బీఆర్ఎస్‌తో కలిసి అడుగులేస్తూ ముందుకు కదిలిన మహారాష్ట్ర తదితర రాష్ట్రాల ప్రజలు మొన్నటి తెలంగాణ ఎన్నికల ఫలితాలతో తీవ్ర ఆవేదన చెందారన్నారు. కేసీఆర్ పాలన లేకపోవడంతో తెలంగాణ రైతుల కంటే మహారాష్ట్రతోపాటు దేశ రైతాంగమే తీవ్రంగా నష్టపోయిందని ఇటీవల తనను కలిసిన మహారాష్ట్ర నేతలు అన్నారని చెప్పారు. తెలంగాణలో బీఆర్ఎస్ ఓటమితో రైతు రాజ్యాన్ని అందించగల దమ్మున్న కేసీఆర్ దార్శనిక నాయకత్వాన్ని దేశం కోల్పోయిందని వారు బాధపడ్డారని తెలిపారు. నల్ల చట్టాలను తెచ్చి తమ జీవితాలను, తాము నమ్ముకున్న వ్యవసాయ రంగాన్ని ఆగం చేయాలని చూసిన గత బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఢిల్లీ వీధుల్లో దేశ రైతాంగం శాంతియుత పోరాటం చేసిన సంగతిని కేసీఆర్ గుర్తుచేశారు. రైతుల మీద లాఠీఛార్జ్, కాల్పులు జరిపి 700 మంది రైతుల మరణానికి నాటి బీజేపీ సర్కార్ కారణమైందన్నారు.

**అధైర్యపడొద్దని కార్యకర్తలకు భరోసా**

దేశ రైతాంగ బాధలను తీర్చేందుకు నడుం కట్టిన బీఆర్ఎస్ కిసాన్ సర్కార్ నినాదంతో మహారాష్ట్ర నుంచి ఒక లైన్ తీసుకొని ముందుకు సాగిందని కేసీఆర్ వివరించారు. ఈ క్రమంలో మహారాష్ట్ర ప్రజల నుంచి అపూర్వస్పందన కానవచ్చిందన్నారు. తెలంగాణతో పాటు దేశ రైతాంగ ప్రగతికోసం బయలుదేరిన నేపథ్యంలో తెలంగాణ ప్రజల నిర్ణయం ఇతర రాష్ట్రాల రైతాంగాన్ని నిరుత్సాహపరిచిందని తెలిపారు. అయినా, ఏమాత్రం అధైర్యపడొద్దని కార్యకర్తలకు కేసీఆర్ భరోసా ఇచ్చారు. ప్రజాస్వామ్యంలో ప్రజలదే అంతిమ నిర్ణయమని స్పష్టం చేశారు. 'ప్రజాస్వామ్యంలో అధికారం శాశ్వతం కాదు. ప్రతిపక్ష పాత్రకూడా శాశ్వతం కాదు. మనకు ప్రజాతీర్పే శిరోధార్యం. వారు ఎలాంటి పాత్రను అప్పగిస్తే దాన్ని చిత్తశుద్ధితో నిర్వర్తించాలి. అధికారం కోల్పోయామని బాధపడడం సరియైన రాజకీయ నాయకుని లక్షణం కాదు. ప్రజాసంక్షేమం కోసం కొనసాగే నిరంతర ప్రక్రియనే రాజకీయం. దానికి గెలుపు ఓటములతో సంబంధం ఉండదు. ప్రజల్లో కలిసివుంటూ వారి సమస్యలమీద నిరంతరం పోరాడుతూ వారి అభిమానాన్ని సాధించాలి' అని కేసీఆర్ పునరుద్ఘటించారు.

**కార్యకర్తలకు కేసీఆర్ వినతి..**

గత బీఆర్ఎస్ ప్రభుత్వం కొనసాగించిన సాగు, తాగునీరు, నిరంతర విద్యుత్, ఫీజు రీయింబర్స్‌మెంట్, సీఎంఆర్ఎఫ్ తదితర అనేక పథకాలను కూడా నేటి కాంగ్రెస్ కొనసాగించకపోవడంతో తెలంగాణ సమాజం తీవ్రంగా నష్టపోతున్నదని కేసీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, తెలంగాణ సంపూర్ణ అభివృద్ధి సాధించడమే బీఆర్ఎస్ అంతిమలక్ష్యమని కేసీఆర్ స్పష్టం చేశారు. గెలుపోటములకు అతీతంగా నిరంతర కృషి కొనసాగించడమే మన కర్తవ్యమని కార్యకర్తలకు అధినేత పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా అభిమానులకు కేసీఆర్ కీలక విజ్ఞప్తి చేశారు. సమాచారం లేకుండా వచ్చి ఇబ్బందిపడొద్దని సూచించారు. తనను కలిసేందుకు ముందస్తు సమాచారం లేకుండా రావడంతో మీకూ నాకూ ఇబ్బందేనన్నారు. వచ్చేముందు సమాచారం లేదంటే అనుమతి తీసుకొని రావాలని కేసీఆర్ మరోసారి ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. నియోజక వర్గాల పేర్లను పార్టీ ముందస్తుగా ప్రకటిస్తుందని.. ఆ ప్రకారం స్థానిక నాయకత్వాన్ని సమన్వయం చేసుకుంటూ తనను కలవడానికి రావాలని కోరారు.

# ఆ మాజీ మంత్రి ఏమయ్యారు?

- బీఆర్ఎస్‌కు దూరమైనట్టేనా..?
- అంటీముట్టనుంటున్న గంగుల
- ఇంటికే పరిమితమైన కమలాకర్
- సీఎం రేవంత్ రెడ్డితో సన్నిహిత సంబంధాలు
- కాంగ్రెస్ గూటికి చేరతారా..? కరీంనగర్‌లో హాట్ టాపిక్



**విశ్వంభర, కరీంనగర్ :** బీఆర్ఎస్ అధికారంలో ఉండగా ఆయన చేసిన హడావుడి అంత ఇంతా కాదు. బీజేపీ,కాంగ్రెస్ నేతల విమర్శలపై ఎప్పటికప్పుడు కౌంటర్ అటాక్ ఇచ్చేవారు. జిల్లా అంతటా తానే అన్నీ చక్కబెట్టేవారు. కానీ ఇప్పుడు ఆయన ఎక్కడా కనిపించడం లేదు . బీఆర్ఎస్ నిర్వహించే ఏ కార్యక్రమానికి ఆయన హాజరు కావడం లేదు. ఇటీవల బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ లోకి జంపింగులు పెరిగిన నేపథ్యంలో ఆయన కూడా దారి చూసుకుంటున్నారా అనే అనుమానాలు తలెత్తుతున్నాయి. ఆయన మరెవరో కాదు మాజీమంత్రి గంగుల కమలాకర్. ఇప్పుడు ఆయన కూడా పార్టీ మారనున్నారనే టాక్ నడుస్తోంది.

**మౌనానికి అర్థం ఏంటి..?**

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మాజీ మంత్రి గంగుల కమలాకర్ బలమైన నేత. బీసీ వర్గాల్లో మంచి పట్టున్న నేత. ఇప్పటి వరకూ ఓటమి చెందకుండా వరుసగా విజయం సాధిస్తున్నారు. అంతే కాకుండా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు అత్యంత సన్నిహితుడు కూడా. ఈ పదేళ్లలలో ప్రభుత్వంలో, పార్టీలో అన్నీ తానై నడిపించారు. 2009లో టిడిపి నుంచి విజయం సాధించిన తరువాత 2014 ఎన్నికల కంటే ముందు బీఆర్ఎస్‌లో చేరారు. 2014, 2018, 2023లో మొత్తం నాలుగుసార్లు కరీంనగర్ నుండి విజయం సాధించారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికలో బీఆర్ఎస్ ఓడిన తరువాత కమలాకర్ సైలెంట్ అయ్యారు. పూర్తిగా హడావుడి తగ్గించారు. పార్లమెంటు ఎన్నికల్లో కూడా అంత దూకుడు ప్రదర్శించలేదు. నియోజకవర్గంలో చేపట్టిన ఏ కార్యక్రమాల్లో పాల్గొనడం లేదు. ఒకవేళ కరీంనగర్‌లో ఉన్నప్పటికీ ఇంటికే పరిమితం అవుతున్నారు. ఎప్పుడూ మీడియాలో యాక్టివ్‌గా కనబడే కమలాకర్ ఇప్పుడు మీడియాకి సైతం దూరంగా ఉంటున్నారు.బీఆర్ఎస్‌లో ఉన్నప్పటికీ పార్టీ నేతలతో చురుగ్గా కలిసి ఏ విషయమూ చర్చించడం లేదు. అయితే కమలాకర్ మనసులో ఏముందో ఎవరికి అర్థం కావటం లేదు. సీఎం రేవంత్ రెడ్డి.. కమలాకర్ గతంలో టిడిపిలో కలిసి పనిచేశారు. వీరిద్దరి మధ్య మంచి రిలేషన్ ఉంది. ప్రభుత్వం పైన కూడా ఎలాంటి విమర్శలు చేయడం లేదు ఎమ్మెల్యే కమలాకర్. ఎప్పుడూ దూకుడుగా ఉండే కమలాకర్ ఇప్పుడు మౌనానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. పార్టీ మార్పు పైనా ఇప్పటికే తన అనుచరులకి సంకేతాలు ఇచ్చారని కొన్ని వార్తలు వినిపిస్తున్నాయి. అయితే తాను పార్టీలోనే ఉంటానని, బిఆర్ఎస్‌ను వీడే ప్రసక్తే లేదని స్పష్టం చేస్తున్నారు. ఇదిలా ఉంటే ఇప్పటికే కరీంనగర్ జిల్లాలోని కొందరు బీఆర్ఎస్ కార్పొరేటర్లు ముఖ్య నేతలు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఇలాంటి నేపథ్యంలో ఆయన బీఆర్ఎస్ ని వీడతారా... ఒకవేళ వీడితే ఏ పార్టీలోకి వెళతారు అనేది ఆసక్తికరంగా మారింది.

## రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడడంలో రాహుల్ గాంధీ విఫలం

(మొదటి పేజీ తరువాయి)

చేయించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన తర్వాత బిఆర్ఎస్ ఎంపీ కేశవరావు రాజీనామా చేయడాన్ని స్వాగతించిన కేటీఆర్, కాంగ్రెస్ పార్టీలో చేరిన అరడజన్ మంది బిఆర్ఎస్ ఎమ్మెల్యేల సంగతి ఏమిటని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు లోక్సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బీఫాంలో పైన పోటీ చేసిన అంశాన్ని కేటీఆర్ ప్రస్తావించారు. వీటన్నిటి పైన మౌనంగా ఉంటున్న రాహుల్ గాంధీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగ స్ఫూర్తి అమలుపైన రాహుల్ చిత్తశుద్ధిని కేటీఆర్ ప్రశ్నించారు

## పార్టీ ఫిరాయింపులపై ఉన్న శ్రద్ధ రైతులపై లేదు

(మొదటి పేజీ తరువాయి)

పరిష్కారం చూపడం లేదనే ఆవేదనతో నిన్నసీఎం గారి సొంత జిల్లాలోనే ఓ రైతు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు.ఈ ఘటనలు మరువక ముందే నేడు ఖమ్మం జిల్లా, కారేపల్లి మండలం, ఆలియా తండాలో మరో రైతు పురుగుల మందు తాగి ప్రాణాలు వదిలేందుకు సిద్ధమయ్యారు. రైతుల ఆత్మహత్యలు నివారించేందుకు, వారి సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రయత్నించకపోవడం బాధాకరం. ఈ ప్రభుత్వానికి పార్టీ ఫిరాయింపులపై ఉన్న శ్రద్ధ, పట్టెడన్నం పెట్టే రైతుల సంక్షేమం పట్ల లేదు. పురుగుల మందే రైతన్నలకు పెరుగన్నం అయ్యే దుర్భర పరిస్థితులను ఏడు నెలల కాంగ్రెస్ పాలన మళ్లీ తీసుకువచ్చిందని తెలిపారు.

## ఆర్టీసీకి కాంగ్రెస్ ఒక్క రూపాయి ఇవ్వలేదు

**విశ్వంభర, హైదరాబాద్ :** కాంగ్రెస్ ప్రభుత్వం టీజీఎస్ఆర్టీసీకి ఫ్రీ బస్సు స్కీమ్ డబ్బులు ఒక్క రూపాయి ఇవ్వలేదని టీజీఎస్ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీ. శ్రీనివాస్ రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. తాజాగా మీడియాతో శ్రీనివాస్ రావు మాట్లాడుతూ... ఫ్రీ బస్సు వల్ల ఆర్టీసీకి 6 నెలల్లో రూ. 2,500 నష్టం వాటిల్లిందన్నారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణానికి సంబంధించి దాదాపు రూ. 2,500 కోట్ల నిధులను తక్షణం సంస్థకు చెల్లించాలని శ్రీనివాస్ రావు ప్రభుత్వాన్ని కోరారు. హైదరాబాద్లోని సుందరయ్య కళానిలయంలో ఫెడరేషన్ రాష్ట్ర విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణంతో సంస్థకు ఆరు నెలలుగా రోజుకు సుమారు రూ.15 కోట్ల చొప్పున నష్టం వాటిల్లుతోందన్నారు.

## అర్ధరాత్రి గులాబీకి గుడ్ బై

(మొదటి పేజీ తరువాయి)



ప్రస్తుతం శాసనమండలి సభ్యుల సంఖ్య 40. వీటిల్లో రెండు ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీగా ఉన్నాయి. ఇప్పటి వరకు మండలిలో కాంగ్రెస్ ఎమ్మెల్సీల సంఖ్య ఆరుగా ఉండగా.. తాజా చేరికలతో ఆ పార్టీ బలం 12 మందికి పెరిగింది. అయితే కాంగ్రెస్ పార్టీలో చేరకలు ఇంతటితో ఆగిపోలేదని, టీఆర్ఎస్ఎల్పీని విలీనం చేసేవరకు కొనసాగుతాయిని హస్తం పార్టీ నేతలు ధీమాతో చెబుతున్నారు. కాగా, గులాబీ ఎమ్మెల్యేలు పార్టీ మారకుండా ఉండేందుకు మాజీ సీఎం కేసీఆర్ పది రోజులుగా జిల్లాల వారిగా మీటింగులు పెట్టి బుజ్జగిస్తున్న సంగతి తెలిసిందే. కానీ కేసీఆర్ దగ్గర ఫిరాయింపులకు పాల్పడమని చెప్పి వచ్చిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు బయటకురాగానే కండువాలు మార్చుతుండటం ఆ పార్టీని కలవరపెడుతోంది.



## మాజీ సీఎం రోశయ్యకు
# డా.కాచం ఘన నివాళి

**విశ్వంభర, హైదరాబాద్ :** మాజీ ముఖ్యమంత్రి కీ.శే కొణిజేటి రోశయ్య జయంతి సందర్భంగా హైదరాబాద్ చైతన్యపురిలోని వైశ్య వికాస వేదిక ప్రధాన కార్యాలయంలో వైశ్య వికాస వేదిక అధ్యక్షుడు, బి3 న్యూస్ చైర్మన్ డాక్టర్ కాచం సత్యనారాయణ రోశయ్య చిత్రపటానిక పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాచం సత్యనారాయణ మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా, వివిధ రకాల పదవులకు వన్నె తెచ్చిన నేతగా మంచి గుర్తింపు తెచ్చుకున్నారని, రాజకీయాలలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకొని అందరి మన్నలను పొంది ఎన్నో సంస్కరణలకు శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. అలాగే తమిళ నాడు గవర్నర్‌గా పని చేసిన ఆయన ఎంతో హుందాతనంతో ఉండి తమిళ ప్రజల ప్రేమను కూడా సంపాదించుకున్నారని గుర్తు చేశారు. ఆయన చేసిన సేవలు ఎనలేనివని డా. కాచం సత్యనారాయణ అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు, టిపీసీసీ అధికార ప్రతినిధి మొగుళ్ళ రాజిరెడ్డి, టీపీసీసీ సేవా దళ్ స్టేట్ సెక్రటరీ కొదుమూరి దయాకర్ రావు, యర్రమాద కృష్ణారెడ్డి, కూర రమేష్, గజవెల్లి గురుమూర్తి, కాసం ఏక సాయి, ఇరుగు శ్రీధర్, ఏలే మహేష్ నేత, దుమ్మా నవీన్‌కుమార్, శివ, అవినాష్ పాల్గొన్నారు.

# రోశయ్య ఆశయ సాధనకు కృషి చేయాలి

### నివాళులర్పించిన ముషీరాబాద్ వాసవి హాస్టల్ చైర్మెన్ గంజి రాజమౌళి గుప్త
### అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త



**విశ్వంభర, ముషీరాబాద్ :** ఆర్యవైశ్య ముద్దు బిడ్డ మాజీ ముఖ్యమంత్రి రోశయ్య ఆశయ సాధనకు కృషి చేయాలని టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్, టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మెన్, అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ మరియూ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త అన్నారు. రోశయ్య జయంతి సందర్భంగా గురువారం ముషీరాబాద్‌లోని వాసవి హాస్టల్‌లో రోశయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ.. కొణిజేటి రోశయ్య ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆర్థిక మంత్రిగా.. ఏడుసార్లు బడ్జెట్ ప్రవేశపెట్టి రికార్డ్ సృష్టించారన్నారు. రోశయ్య ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా.. తమిళనాడు కర్ణాటక రాష్ట్రాల గవర్నర్గా పనిచేసేసి ఎంతో కీర్తి గడించాడని కొనియాడారు. తన తెలివితేటలతో ఎవరినైనా మెప్పించగల నేర్పరితనం రోశయ్య గారిదన్నారు. రోశయ్య ఏ సభలో మాట్లాడిపా.. ఎల్ఆర్ ఈశ్వరి పాటలాగా ఉంటుందని, రోశయ్య మాట్లాడుతూ ఉంటే చప్పట్లు, ఈలలు వేసేవారని గుర్తు చేశారు. దివంగత కొణిజేటి రోశయ్య శాసనసభలో గానీ, మండలిలో గాని ఎంత క్లిష్ట సమస్య పైన మాట్లాడుతున్న.. తనదైన హాస్యం జత చేసేవారని అన్నారు. రోశయ్యకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. వాసవి ఆర్ట్స్ వారు రోశయ్య జన్మదినోత్సవాన్ని ఇంత ఘనంగా నిర్వహిస్తున్నందుకు వాసవి ఆర్ట్స్ ను అభినందిచారు. ఈ కార్యక్రమంలో ఐవీఎఫ్ కోశాధికారి ప్రభాకర్, సతయ్య, రాజశేఖర్ గుప్త, కృష్ణమూర్తి, శ్రీధర్ ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్య వైశ్య మహాసభ ఘన నివాళి



**విశ్వంభర, ఖైరతాబాద్ :** మాజీ ముఖ్యమంత్రి కీ.శే కొణిజేటి రోశయ్య 91వ జయంతి సందర్బంగా ఖైరతాబాద్ ఆర్య వైశ్య మహాసభలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్య వైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మి నారాయణ , మహిళా విభాగ అధ్యక్షురాలు ఉప్పల శారద, కోశాధికారి కాచం సుష్మ మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కి ముఖ్యమంత్రిగా, తమిళనాడుకి గవర్నర్‌గా పలు పదవులకు వన్నె తెచ్చిన మహా నాయకుడని, వారు చేసిన సేవలను కొనియాడారు. అలాగే వైశ్య కుటుంభంలో పుట్టిన తాను వైశ్య జాతికి ఎన్నో విధాలుగా సేవలు అందించిన మహనీయుడని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్య వైశ్య మహాసభ కోశాధికారి నల్లమల సామ్రాజ్య లక్ష్మి, పలువురు ఆర్య వైశ్య మహాసభ నాయకులు పాల్గొన్నారు.

## అధికారంలోకి వచ్చి 7 నెలలు అవుతున్నా..
# పాలన గాడిన పడలేదు

### ఎమ్మెల్సీ తాత మధు




**విశ్వంభర, హైదరాబాద్ :** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 7 నెలలు అవుతున్నా.. పాలన ఇంకా గాడిలో పడలేదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాత మధు ఎద్దేవ చేశారు. హైదరాబాద్‌లోని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యలయం తెలంగాణ భవన్‌లో గురువారం ఎమ్మెల్సీ తాత మధు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ముఖ్యమంత్రి, డిప్యూటీ ముఖ్యమంత్రి మంత్రులు పాలన గాలికి వదిలేసి ఢిల్లీ చుట్టూ చక్కర్లు కొడుతున్నారన్నారు. ఇన్ని రోజులైనా.. రైతులకు అందించాల్సిన ఎరువులు, విత్తనాలు సకాలంలో అందించడం లేదని, వర్షాలు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గతంలో కేసీఆర్ పాలనలో జూన్ మాసంలోనే రైతు బంధు ఇచ్చేవాళ్లని, కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా 15 వేలు ఇస్తాం అని జులై నెల వచ్చిన ఇంకా రైతు భరోసా దిక్కు లేదన్నారు. రైతులకు రైతు భరోసా ఇవ్వడానికి విధివిధానాలు అంటూ డిప్యూటీ సీఎం భట్టి ఆధ్వర్యంలో కమిటీ వేశారు. చింతకాని మండలంలో రైతు ప్రభాకర్ ఆత్మహత్య చేసుకుని తాను కాంగ్రెస్ పార్టీకి ఓటు వేశానని, కాంగ్రెస్ వ్యక్తినని అని కూడా మరణ వాగ్మూలంలో చెప్పినట్లు పేర్కొన్నారు. నిన్న కిసాన్ సెల్ అధ్యక్షుడు కోదండారెడ్డి సిగ్గుమాలిన మాటలు మాట్లాడారని ఆరోపించారు. మరి కోదండారెడ్డి వినిపించడం లేదా.., భట్టి విక్రమార్క అనుచరుడు ఇందులో ప్రధాన నిందితుడని, మరి ఆయనను ఎందుకు అరెస్ట్ చేయడం లేదని ప్రశ్నించారు. మొదటి నిందితుడుగా ఉన్న భట్టి అనుచరుడ్ని 8వ నిందితుడుగా ఎలా చేర్చుతారు. ముఖ్యమంత్రి మాత్రం ఉన్నతస్థాయి విచారణ అంటాడు కానీ అతను భట్టికి చాలా దగ్గర, నిందితుడు ఒక జెడ్పిటిసి భర్త కూడా. రాష్ట్రంలో ఎక్కడ చూసిన రైతుల ఆత్మహత్యలు తప్ప ఇంకోటి లేదన్నారు. ప్రజావాణికి వెళ్లి రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్న పరిస్థితి ఇప్పుడు రాష్ట్రంలో ఉందని మండిపడ్డారు. మహబూబ్‌నగర్‌లో నిన్న ప్రజావాణికి వెళ్లి ఆత్మహత్య యత్నం చేసుకుంటే పోలీస్‌లు అడ్డుకున్నారని, రైతులు ఆత్మహత్యలు చేసుకుంటే మీరు ఎం చేస్తున్నారని అన్నారు. ప్రథమ ముద్దాయిగా ఉన్న కిషోర్ కేస్ బుక్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతు ప్రభాకర్ కుటుంబానికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి, వారి కుటుంబంలో ఒక్కరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. రైతు ఫిర్యాదు చేసిన పట్టించుకోని అధికారులను వెంటనే అక్కడ నుంచి బదిలీ చేయాలి, అప్పుడే రైతు కుటుంబానికి న్యాయం జరుగుతుందన్నారు.



## గంజాయితో జీవితాలను
# నాశనం చేసుకోవద్దు

### ఎస్పీ కిరణ్ ఖరే

**విశ్వంభర, భూపాలపల్లి :** గంజాయి సేవించి జీవితాలను నాశనం చేసుకోవద్దని జయశంకర్ భూపాలపల్లి ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. గురువారం భూపాలపల్లి సబ్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో మత్తు పదార్థాల అవగాహన, మరియు గంజాయి సేవిస్తూ పట్టుబడిన వారికి భూపాలపల్లి పోలిసు స్టేషన్ ఆవరణలో ఎస్పీ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ జిల్లాలో గంజాయి నియంత్రణకు స్పెషల్ డ్రైవ్ నిరహిస్తున్నామని, గంజాయి వినియోగదారులు, రవాణా దారులపై నిఘా పెట్టామన్నారు. గంజాయి రవాణా చేసే ముఠాలపై కఠిన చర్యలు తప్పవని, గంజాయి నియంత్రణకు జిల్లా టాస్క్ ఫోర్స్ టీం ఏర్పాటు చేశామని, జిల్లాకు సరిహద్దు రాష్ట్రాలైన మహారాష్ట్ర, ఛత్తీస్ ఘడ్ లోని గడ్చిరోలి, చంద్రపూర్, బీజాపూర్ నుంచి గంజాయి రవాణా అయ్యే అవకాశం ఉందని, జిల్లా టాస్కోర్స్ టీంలు గంజాయి రవాణా దారులకు చెక్ పెడతాయని పేర్కొన్నారు. పదే పదే నేరాలకు పాల్పడుతూ, గంజాయి రవాణా చేస్తూ పట్టుబడితే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. యువత డ్రగ్స్, గంజాయి లాంటి మత్తు పదార్థాలకు బానిసలై వారి భవిష్యత్తుని నాశనం చేసుకోవద్దనే ఉద్దేశంతో ఈ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలో ఉన్న గంజాయి రవాణా, సేవించేవారు తప్పనిసరిగా తమ కుటుంబం కోసం మారాలని, మత్తు పదార్థాలకు బానిసలై ఆరోగ్య సమస్యలు తలెత్తడమే కాకుండా నేరాలు చేసే అవకాశం ఉందన్నారు. యువకులు మంచి మార్గంలో నడుచుకోవడానికి ఈ కౌన్సెలింగ్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. చెడు వ్యసనాలను దూరం చేసుకొని మంచి ప్రవర్తనతో మెలగాలని, లేని పక్షంలో కఠినంగా వ్యవహరిస్తామన్నా రు. ఎవరైనా గంజాయికి అలవాటుపడిన వారు ఉంటే వారి వివరాలు తెలియజేయాలని, సమాచారం అందజేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఎస్పీ అన్నారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి డీఎస్పీ ఏ సంపత్‌రావు, భూపాలపల్లి సీఐ డీ నరేష్ కుమార్, చిట్యాల సీఐ డీ మల్లేష్, ఎస్సైలు సుధాకర్, సాంబమూర్తి, రవికుమార్, అశోక్, ప్రసాద్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్సీ హాస్టల్‌ను
# కలెక్టర్ సందర్శించాలి

### కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోట గోపి

**విశ్వంభర, ఆత్మకూర్ (ఎస్) :** ఆత్మకూర్ ఎస్ మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌ను కలెక్టర్ సందర్శించాలని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోట గోపి అన్నారు. నిన్న ఉదయం అనుమానాస్పదంగా మృతి చెందిన ఏడో తరగతి విద్యార్థి మెల్లం శ్యామ్ కుమార్ కుటుంబాన్ని ప్రభుత్వపరంగా అన్ని విధాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. గురువారం కెవిపిఎస్ జిల్లా బృందం ఆత్మకూరు (ఎస్) మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 80 మంది విద్యార్థులు చదువుతున్న హాస్టల్‌లో సరైన సౌకర్యాలు లేక పిల్లలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. హాస్టల్ ఆవరణలో బాత్రూములకు పక్కన సర్కారు చెట్లు మరియు పిచ్చి మొక్కలు విపరీతంగా పెరిగి పాములు, తేళ్లు, విష పురుగులు వచ్చే విధంగా ఆ పరిసరాలు ఉన్నాయన్నారు. ప్రహరీగోడ వెలుపల, హస్తల బయట విపరీతమైన కంపచెట్లు ఉండడంతో హాస్టల్ లోపలికి పాములు వచ్చే ప్రమాదం ఉందన్నారు. సంక్షేమ హాస్టల్‌లపై సోషల్ వెల్ఫేర్ జిల్లా అధికారుల పర్యవేక్షణ సక్రమంగా లేకపోవడంతో ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని వాటి మూలంగా విద్యార్థులు తమ అమూల్యమైన భవిష్యత్తును కోల్పోతున్నారని అన్నారు. మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్లో జిల్లా కలెక్టర్ సందర్శించి సౌకర్యాల గురించి తెలుసుకొవాలని అన్నారు. విద్యార్థి కుటుంబానికి 50 లక్షల రూపాయల ఎక్స్ గ్రెసీయా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా నాయకులు యాతాకుల ప్రవీణ్, రవీందర్, మహేష్, విద్యార్థులు పాల్గొన్నారు.









# అయారాం.. గయారాంలు తెలంగాణలో ఇంకా ఎంతమందో?



చరిత్ర దానికదే పునరావృతం అవుతుందని పెద్దలు చెప్పిన మాట నిజం అవుతున్న సందర్భం. మనం రాజులు, రాచరికాలు వద్దు,నిరంకుశులు వద్దనుకున్నాము. నియంతృత్వ రాజ్యాలను పాతరేశాం. బానిస బతుకులు వద్దనుకుని పరాయి పాలకులనుపారతోలాం. మన పాలన మనమే చేసుకుంటున్నాం. సొంత రాజ్యాగాన్నిరాసుకున్నాం, ప్రపంచంలోనే అతి పెద్దప్రజాస్వామ్యాన్నిప్రతిష్ఠిచుకొన్నాం.ఇప్పుడు మన పాలన మనదే, మన బాగోగులు మనవే, మన బాధ్యత మనదే. నేడు నిరంకుశం, నియంతృాఎత్వం పెరిగిపోయి మనవాళ్లే మనల్నిఅణిచివేస్తుంటే, మనవాళ్లే మనల్ని దోపిడీ చేస్తుంటే, ఉపాధి గల్లంతు చేసి, ధరలు పెంచి జీవితం దుర్భరం చేస్తుంటే, కులం, మతం మత్తులోముంచుతుంటే, మనం నిర్మించుకున్నఅతి పెద్ద ప్రజాస్వామ్యానికి ఉరిబిగిస్తుంటే, రాజ్యాంగాన్ని కాల రాస్తుంటే ఇప్పుడు ఎవరిని నిందించాలి? ఎవరిని భాద్యులను చేయాలి ? విశ్వసనీయత లేని రాజకీయ నాయకులు ఇకదేశ రాజకీయాల్లో అనుకున్నంతగా రాణించలేకపోతున్నారు.

ప్రజాస్వామ్యంపై విశ్వసనీయత అనేది నాయకులకు ఉండాలి కానీ మన దేశంలో రాజకీయ నాయకులకు ఆవిశ్వసనీయత అనేది లేకుండా పోయింది అనేది నగ్నసత్యం. ప్రజాస్వామ్య సమగ్రతను దెబ్బతీస్తూ, ప్రజలు వేసిన ఓట్ల తీర్పును ఎగతాళి చేస్తూ ఒక పార్టీ టికెట్టుపై గెలిచి మరో పార్టీలోకి దూకే 'నాయకులను అంగట్లో సరుకుగా మారిపోయిన పరిస్థితి కనిపిస్తుంద అనేది నగ్న సత్యం. ఇకప్రజాస్వామ్య దేశంలో చట్ట సభల ద్వారా చట్టాల రూపకల్పన చేయబడతాయి. ఆచట్ట సభల సభ్యులే ఆచట్టాలను ఉల్లంఘించడం అందుకు శాసన సభలు, పార్లమెంట్లు వేదికల వడం హాస్యాస్పదం. ఆ కోవలోనిదే పార్టీ పిరాయింపుల తతంగం. ఒక పార్టీ అభ్యర్థిగా ఒక ఎన్నికల చిహ్నంపై గెలుపొంది అనంతరం ఇతర పార్టీల్లోకి మారడం చట్ట వ్యతిరేకం. చరిత్రలో గమనిస్తే స్వతంత్రం కంటే ముందే మన దేశంలో పార్టీ ఫిరాయింపులు చూడవచ్చు. కాంగ్రెస్ పార్టీ తరఫున సెంట్రల్ లెజిస్లేటివ్ అసెంబ్లీకి ఎన్నికైన శ్యామ్లాల్ నెహ్రూ దేశంలో ప్రవేశపెట్టిన మౌంట్ పోర్ట్ సంస్కరణల సందర్భంగా ఆనాటి ఓటింగ్లో కాంగ్రెస్ నుంచి బ్రిటీష్ వారి పక్షం చేరాడు. ఇది మన దేశ పజాస్వామ్య రాజకీయ చరిత్రలో మొదటి పిరాయింపుగా గమనించవచ్చు. స్వాతంత్రం అనంతరం ఈ పార్టీ పిరాయింపులు దేశంలోని అన్ని రాష్ట్ర శాసన సభలు మరియు పార్లమెంట్లో కూడా సర్వసాధారణం అయినవి. 1953లో ప్రకాశం పంతులు ప్రజా పార్టీ నుంచి కాంగ్రెస్లోకి చేరి ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రి అయ్యారు. ఆ క్రమంలోనే 1967లో హర్యాన రాష్ట్రంలో అసెంబ్లీ బల నిరూపణలో గయలాల్చంద్ అనే శాసన సభ్యుడు ఒకే రోజు మూడు పార్టీలు మారాడు. ఆ సంఘటన ద్వారానే "అయారాం, గయారాం" అనే నానుడి రాజకీయ పరిభాషగా మారింది. దేశంలోని యాభై శాతం నాయకులు అధికారం కోసం పార్టీలు మారి అధికారం చేజిక్కించుకున్నారు. ఈ విధానం దేశ ప్రజాస్వామ్యానికి నష్టం చేస్తుందని భావించిన పార్లమెంట్ 11 ఆగస్టు 1967లో పార్టీ పిరాయింపుల నిరోధానికి చేపట్టిన చర్యల గురించి ఒక కమిటీ ఏర్పాటు చేసింది. ఆనాటి కేంద్ర హోం మంత్రి ఎస్.బి. యశ్వంత్ రావ్ చవాన్ నాయకత్వంలో కమిటీ. Y.B. చవాన్ కమిటీ" లేదా "ఫిరాయింపుల కమిటీ" అని పిలుస్తారు. పిరాయింపుల నిరోధానికి చర్యల రీత్యా చట్ట రూప కల్పనకొరకు సూచించింది. పందొమ్మిది వందల అరవై ఎనిమి దిలో సూచించిన ఆ కమిటీ సిఫార్సులు 1985 లో చట్టంగా రూపు దిద్దుకుంది. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 102, 109 లను యాభై రెండవ సవరణ చేసి పదవ షెడ్యూల్డును చేర్చడం ద్వారా పార్టీ పిరాయింపుల నిరోదక చట్టం అమలులోకి వచ్చింది. భారత రాజకీయ వ్యవస్థ పార్లమెంట్, విదానసభల ఫిరాయింపులద్వారాప్రభావితమవుతోంది. ఈపరిస్థితి రాజకీయ వ్యవస్థలోఎక్కువ అస్థిరతను, గందరగోళాన్ని తెచ్చిపెట్టింది. 1985లో రాజీవ్ గాంధీ ప్రభుత్వం రాజకీయఫిరాయింపులను అరికట్టడానికి ఫిరాయింపుల వ్యతిరేకతపై 52వ రాజ్యాంగ సవరణ చట్టాన్నిచేసింది. దీనిని రాజ్యాంగంలో 10వ షెడ్యూల్లోచేర్చారు. రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 101, 102, 190, 191లు కూడా పార్టీ ఫిరాయింపులు గురించి తెలుపుతాయి. ఈ చట్ట ప్రకారం ఒక రాజకీయ పార్టీ ఎన్నికల చిహ్నంపై ప్రజలు ఓటు వేసి గెలిపించిన వ్యక్తి వేరే ఇతర పార్టీలోకి మారడం నిషిద్ధం. అలా పార్టీ మారిన వ్యక్తిని ఆ పదవి నుంచి తొలగించే అధికారం శాశన సభ మరియు పార్లమెంట్ స్థాయిలో ఆయా సభాధి పతులకు చట్టం కల్పించి స్పీకర్ నిర్ణయం మేరకు గవర్నర్ ఆమోదంతో ఆ వ్యక్తిని పదవీచుత్యున్ని చేయమని చట్టం చెబుతుంది. ఒక వేళ ఒక పార్టీలోని 2/3 మెజార్టీ సభ్యులు తమ పార్టీ మార్పుకు సిద్ధపడితే ఆ తీర్మాణం మేరకు ఆ పార్టీ శాసన సభ పక్షాన్ని విలీనం చేయడం చట్టబద్ధం అవుతుంది. అయితే మనం చూస్తున్న పార్టీ పిరాయింపులు వ్యక్తుల ప్రతి పాదికన చూస్తున్నాం. 2014 గతంలో తెలంగాణలో ఎన్నికలు జరిగి ఫలితాలు వెలుబడిన నెల రోజులలోపే రాష్ట్రంలో పిరాయింపుల పర్వం మొదలైంది. ఒక మాటలో చెప్పాలంటే పార్టీ పిరాయింపులలో లేదా పార్టీ పిరాయింపుల నిరోదక చట్టాన్ని దిక్కరించడంలో తెలుగు రాష్ట్రాలది అగ్రస్థానం. గత రెండు వేల పద్నాలుగు సంవత్సరంల అసెంబ్లీలో మనం గమనిస్తే తెలంగాణ శాసన సభలో తెలంగాణ రాష్ట్ర సమితి అరవై మూడు సభ్యులతో ప్రభు త్వాన్ని ఏర్పాటు చేస్తే అనతి కాలంలోనే ఆ బలాన్ని తొంబై సభ్యులకు పెంచుకుంది. అందులో పన్నెండు గురు తెలుగు దేశం నుంచి, ఏడుగురు కాంగ్రెస్ నుంచి ముగ్గురు వై.యస్.ఆర్. కాంగ్రెస్ నుంచి, ఇద్దరు బహుజన సమాజ్ పార్టీ ల నుండి కాగా ఇంకొ కరు సిపిఐ. కమ్యూనిస్టు పార్టీ సభ్యులు వున్నారు. మొదట పార్టీ పిరాయించిన టీడీపీ సభ్యుడు తలసాని శ్రీనివాస్ యాదవ ్మరియు బుహుజన సమాజ్ పార్టీ సభ్యుడు ఇంద్రకరణ్ రెడ్డిలకు మంత్రి పదవులు ఇచ్చిన తీరు ఆశ్చర్య కరం. ఇదిఇలా వుంటే ఆంధ్ర రాష్ట్ర అసెంబ్లీలో తాము తక్కువేం కాదనన్నట్టు 2014 లో అధికార తెలుగు దేశం పార్టీ ప్రతిపక్ష పార్టీ వై.యస్.ఆర్. కాంగ్రెస్ నుండి గెలిచిన ఇద్దరు పార్లమెంట్ సభ్యులను, ఇరువై మూడు మంది శాసన సభ్యులను తన పార్టీలోకి తీసుకొని అందులో నలుగురికి మంత్రి పదవులు కట్టబెట్టారు. ఒక పార్టీ నుంచి గెలుపొందిన అభ్యర్థులు ముఖ్యంగా ప్రతిపక్ష పార్టీ సభ్యులు అధికార పక్షం వైపు వెళ్తున్నారు. అందుకు వారు ఇచ్చే వివరణ ప్రజల అభివృద్ధి కోసం అనే మాట అయినా పదవుల కోసమో లేదా డబ్బుల కోసమో ఆకర్షింపబడుతున్నారనేది జగమెరిగిన సత్యం. అధికార పక్షం తమ ప్రభుత్వానికి సరిపడ సభ్యుల సంఖ్య ఉన్నప్పటికీ ప్రతిపక్ష పార్టీల సభ్యులను ప్రలోభాలతో ఆకర్షించి పిరాయింపులకు పాల్ప డడం అప్రజాస్వామిక చర్య. అధికార, ప్రతిపక్షాల పనితీరే ప్రజాస్వామ్యాన్ని బలోంతం చేస్తుంది. కానీ అధికార పక్షం ప్రతి పక్షమే లేకుండా చేయాలనే ప్రయత్నాలు నిర్వీర్యం చేస్తుంది. ప్రతి పక్షం లేని పాలనలో నియంతృత్వం బలపడుతుంది. గతంలో తెలంగాణ రాష్ట్ర శాసన సభలో అధికార పార్టీకి చాలినంత బలం వున్న ప్రతి పక్ష పార్టీ సభ్యులను పార్టీ పిరాయించేలా ప్రోత్సహిస్తున్నది. రోజుకు ఒకరు చొప్పున కాంగ్రెస్ నుండి టి.ఆర్.ఎస్.లోకి జారు కున్నారు. దీని వెనుకాల ఆర్థిక, అధికార కాంక్ష మూలం అనేది కాదనలేని సత్యం. ధన ప్రభావంతో గెలిచిన సభ్యులు తిరిగి ఆ ధనం కోసమే అమ్ముడు పోతున్నారు. తమను ప్రశ్నించేవారు ఉండకూడదు అనే కాంక్షతో అధికార పక్షం ఈ చట్టవ్యతి రేక చర్యలను ప్రోత్సహిస్తున్నది. చట్టాలను రూపకల్పన చేయా ల్సిన వాళ్ళు, చట్టాలను కాపాడుతామని ప్రమాణం చేసి అధికారం లోకి వచ్చిన వాళ్ళు చట్టాలను తుంగలో తొక్కడం హాస్యాస్పదం. పార్టీ పిరాయింపు నిరోధక చట్టంను అమలు చేయాల్సిన లేదా అందులో తీర్పు చెప్పాల్సిన స్పీకర్ పార్టీ మారిన వారితో మంత్రు లుగా మాట్లాడిస్తుండే పరిస్థితి మనం చేస్తున్నాం. చట్టంలోని లొసులుగులు ముఖ్యంగా ఫిరాయింపు పై చర్య తీసుకోవలసిన స్పీకర్కు ఎంతగడువులో తీర్పు వెలువరించాలనే నిబంధన లేక పోవడం మరి ముఖ్యంగా ఆ స్పీకర్ అధికార పార్టీ సభ్యుడై ఉండడం వలన ఈ చట్టం కాగితాలనే పరిమితం అవుతుంది. నిజాయితీతో నడిచే, విలువలతో కూడిన రాజకీయ నాయకులు లేక పోవడం, ప్రస్తుత పరిస్థితిలో చూస్తున్నాం. ఇక భావి భారత రాజకీయాలను శాసిస్తాం, దేశ రాజకీయాలలో చక్రం తిప్పుతామనే మన నాయకులు పిరాయింపులను ప్రోత్సహించి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న వారు మనకు ఏ మేరకు అవసరమో ఆలోచించాలి. పార్టీ మారిన వారు తమకు ఇతర పార్టీల ద్వారా సంక్రమించిన పదవిని వదులుకొని పార్టీ మారితే నష్టం లేదు, ఆ మధ్య కాలంలో అధికార టీడీపీ నుంచి వై.యస్.ఆర్. పార్టీ లోనికి ఒక ఎం.ఎల్.సి. చేరినప్పుడు ఆ పార్టీ అధ్యక్షుడు ఆ పదవికి రాజీనామా చేయించారు. 35 రాజకీయాలకు శుభ సూచికం. ఏది ఏమైనా పార్టీ పిరాయింపుల చట్టాన్ని సవరించి స్పీకర్ అధికారాన్ని న్యాయ వ్యవస్థకు బదిలీ చేస్తూ ప్రజాస్వామ్యాన్ని కాపాడి ప్రజాభిష్టాన్ని గౌరవించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న యథేచ్ఛగా పార్టీ ఫిర్యాంపులు తెర తీసినట్లు కనిపిస్తుంది. ఇక బిఆర్ఎస్ నుండి లీకులు వస్తున్నాయని బహిరంగనే చెబుతున్న కాంగ్రెస్ నేతలు. ఇక బిఆర్ఎస్ నుండి ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, బాన్సువాడ నుండి ఎమ్మెల్యేగా పోచారం శ్రీనివాస్ రెడ్డి, కడియం శ్రీహరి, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్, వెంకట్రావు, చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, రాజ్యసభ సభ్యుడు కేశవ రావు, ఇంకా కొంతమంది ఎమ్మెల్యే 20 మంది వరకు కాంగ్రెస్ పార్టీలో చేరుతానని మీడియాకు లీకులు ఇదుస్తున్నారు. ఈ పరిస్థితి రాజకీయ వ్యవస్థలో మరింత అస్థిరతను, గందరగోళం సృష్టిస్తున్నట్టు కనిపిస్తుంది. ఎన్నికల కమిషన్ పార్టీ పిరాయింపుల దారులపై విప్లవాత్మక ఎన్నికల సంస్కర చేస్తూ రీకాల్ హక్కులు కల్పించాల్సిన బాధ్యత ఎన్నికల కమిషన్ ఉండాల్సిన అవసరం ఉన్నది. గత పాలకులకు అధికారం ఉన్నదనే అహంభావంతో ఆకాశంలో విహరిస్తున్న నేతలను ప్రజలు ఓటు ద్వారా నేలపైకి దింపారు. ఎంత ఎత్తుకు ఎగిరినా చివరకు నేలపైకి దిగాలనే సత్యాన్ని ప్రజలు ఓటు ద్వారా గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ ప్రధాన జెండాగా భారత రాజ్యాంగాన్ని కాపాడాలి అని నినాదాలు చేస్తూనే గత ఎన్నికల్లో పోయింది. పార్లమెంట్లో కూడా రాహుల్ గాంధీ ఎంపీగా ప్రమాణస్వీకారం చేస్తూ రాజ్యాంగాన్ని కాపాడాలని ప్రమాణ స్వీకారం చేశారు కానీ తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ మాత్రం ఇతర పార్టీ ఎమ్మెల్యేలను కలుపుకోవడం రాజ్యాంగ విరుద్ధం కాదా? రాహుల్ గాంధీ తన తండ్రి తెచ్చిన చట్టాన్ని గౌరవించాలి కదా చట్టాలను తుంగలో తొక్కడం సరైన విధానమా ? ఎమ్మెల్యేలు అంటే రాజకీయ అంగట్లో సరుకుల్లాగా అమ్ముడుపోయే ఎమ్మెల్యేలుగా అనిపిస్తుంది మేధావులు అనుకుంటున్నారు. మన భారతదేశానికి ఒకే రాజ్యాంగము ఒకే చట్టంఉన్నది. పార్టీ మారే ఎమ్మెల్యేలకు వర్తించదా..! కానీ కాంగ్రెస్ కో నీతి, బిజెపి కో నీతి, రాష్ట్రాల్లో ఉన్న ప్రాంతీయ పార్టీలకు ఒకే నీతి ఉండాలి కదా.. ప్రజల విలువైన ఓటు ద్వారా వాళ్ళని ఎన్నుకుంటే ప్రజల విశ్వాసాన్ని ఓటు గౌరవాన్ని మంట కలుపుతున్న పార్టీలు. తెలంగాణ ప్రజలు ఇచ్చిన ఓట్ల తీర్పును విస్మరిస్తారా.? గత పాలకులే నియంతృత్వ పాలన కొనసాగించినందుకే ప్రజలు ఇంటికి పంపించారు. ఇప్పుడున్న పాలకుల కూడా ఇదే వర్తిస్తుంచక తప్పదన్న విషయం గుర్తెరగాలి.



- మన్నారం నాగరాజు
తెలంగాణ లోక్ సత్తా పార్టీ,
రాష్ట్ర అధ్యక్షుడు
ఫోన్ :9550844433

# జ్ఞానపీఠ అవార్డు గ్రహీత రావూరి భరద్వాజ



ప్రతిష్ఠాత్మకమైన జ్ఞానపీఠ్ అవార్డు పొందిన మూడో తెలుగు రచయిత రావూరి భరద్వాజ. ఆయన కన్నా ముందు ఈ అవార్డు కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణకు, డాక్టర్ సి. నారాయణరెడ్డికి ఈ అవార్డు లభించింది. భరద్వాజ 2011లో త్రిపురనేని గోపీచంద్ పురస్కారాన్ని, 2009లో లోక్నాయక్ ఫౌండేషన్ సాహిత్య పురస్కారాన్ని, 2012లో జ్ఞానపీఠ పురస్కారాన్ని అందుకున్నారు.

రావూరి భరద్వాజ (జూలై 5, 1927 (అక్టోబరు 18, 2013) తెలుగు లఘు కథా రచయిత, నవలా రచయిత, రేడియోలో రచయితగా పేరు తెచ్చుకున్నారు. గొప్ప భావుకుడైన తెలుగు కవి, రచయిత. రావూరి భరద్వాజ 37 కథా సంపుటాలు, 17 నవలలు, 6 బాలల మినీ నవలలు, 5 బాలల కథా సంపుటాలు, 3 వ్యాస, ఆత్మకథా సంపుటాలు, 8 నాటికలు, ఐదు రేడియో కథానికలు రచించారు. ఈయన బాల సాహిత్యంలో కూడా విశేషకృషి సలిపాడు. సినీ పరిశ్రమలో తెరవెనుక జీవితాన్ని కళ్లకు కట్టినట్టు చిత్రీకరించిన పాకుడు రాళ్ళు నవల భరద్వాజ యొక్క ఉత్కృష్ట రచనగా పరిగణింప బడుతుంది. ఈయన రచనలలో జీవన సమరం మరో ప్రముఖ రచన.

తెలుగు రచనా ప్రపంచంలో వినూత్న సాహితీ ప్రక్రియకు శ్రీకారం చుట్టిన ఘనుడాయన. ఆడంబరాలు లేని సాధారణ జీవితం ఆయనది. భరద్వాజకు దిగువ మధ్యతరగతి, పేదప్రజల భాషపై గట్టిపట్టు ఉంది. ఒక బీద కుటుంబంలో జన్మించిన భరద్వాజ కేవలం ఉన్నత పాఠశాల స్థాయి వరకే చదువు కున్నారు. ఆ తరువాత కాయకష్టం చేసే జీవితాన్ని ప్రారంభించారు. చిన్నతనంలో పొలాల్లో గడిపిన భరద్వాజ వ్యవసాయ కూలీల కఠినమైన జీవన పరిస్థితులను గమనించే వారు. అప్పుడే పల్లె ప్రజల భాష, యాస, ఆవేశాలు, ఆలోచనలు, కోపాలు, తాపాలు గమనించిన భరద్వాజ ఆ అనుభవాలను తర్వాత కాలంలో తన రచనల లో నిజమైన పల్లె వాతావరణాన్ని సృష్టించడానికి ఉపయోగించు కున్నారు. 2013 అక్టోబరు 18న రావూరి భరద్వాజ తిరిగిరాని లోకాలకు తరలి వెళ్ళారు.

రావూరి 1927 జూలై 5వ తేదీన కృష్ణా జిల్లా లోని నందిగామ తాలూకా కంచికచర్ల సమీపం లోని మోగులూరు (నాటి హైదరాబాదు సంస్థానంలోని) గ్రామంలో రావూరి కోటయ్య, మల్లికాంబ దంపతులకు జన్మించారు. ఆయన విద్యాభ్యాసం 8వ తరగతి వరకే సాగింది. తొలి నాళ్ళలో రావూరి భరద్వాజపై చలం ప్రభావం ఎక్కువగా ఉండేది. యుక్త వయసు లోనే తెనాలిచేరి అక్కడ ఒక ప్రెస్సులో పనిచేయటం ప్రారంభించారు. 1946లో నెల్లూరులోని జమీన్ రైతు వారపత్రిక సంపాదక వర్గంలో చేరారు.1948లో దీనబంధు వారపత్రికకు బాధ్యులుగా ఉన్నారు. జ్యోతి,సమీక్ష, అభిసారిక, చిత్రసీమ, సినిమా, యువ పత్రికల్లో 1959వరకు కొన్నాళ్ళు ఫౌంటెన్ పెన్నుల కంపెనీలో సేల్స్మన్గా పని చేశారు. అక్కడ యజమాని అమానుషత్వాన్ని భరించలేక రాజీనామా చేసి కొన్నాళ్ళపాటు ఖాళీగా ఉన్నారు.

ఆ తర్వాత హైదరాబాదు ఆకాశవాణి కేంద్రంలో 1959లో ప్రూఫ్ రీడింగ్ కళాకారునిగా చేరి చివరకు 1987లో ప్రసంగ కార్యక్రమాల ప్రయోక్తగా పదవీ విరమణ చేశారు. రావూరి భరద్వాజ గురించి చాలాకాలం పరిశోధన చేసి, రచనల గురించి సమగ్రమైన పరిశీలన చేసిన బొగ్గుల శ్రీనివాస్ ప్రకారం భరద్వాజ సుమారు 187 పైగా పుస్తకాలను వెలువరించారు, 500 పైగా కథలను 37 సంకలనాలుగా, 19 నవలలు, 10 నాటకాలు వ్రాశారు. భరద్వాజ తన తొలి కథ ఒకప్పుడును 16 ఏళ్ల ప్రాయంలో వ్రాశారు. ఇది జానపద శైలిలోసాగే కథ. భరద్వాజపై చలం ప్రభావం మెండుగా ఉంది. చలాన్ని అనుకరిస్తూ ఈయన అనేక సెక్సు కథలు వ్రాశారు. త్వరలోనే సెక్సు కథలు వ్రాయటంలో అందెవేసిన చెయ్యి అనిపించు కున్నారు. అనేక పత్రికలు ఆ వ్యాసంగంలో ఈయన్ను ప్రోత్సహించాయి. ఏ మాత్రం సంకోచం, జంకు లేకుండా జీవనోపాధికై ఆయన అనేక కథలు వ్రాశారు.

1983లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డును పొందారు. నాలోని నీవు, అంతరంగిణి, ఒక ఏకాంతం, ఒకింత వేకువ కోసం వంటి కవితా సంకలనాలు రచించారు. భరద్వాజ రచించిన కౌముది, హిందీ, గుజరాతీ భాషల్లోకి అనువాదమైంది. ఆత్మగతం, బానుమతి, దూరపు కొండలు, జీవనాడి, మనోరత్నం, నీరు లేని నది, సశేషం, స్వప్న సీమలు, స్వర్ణ మంజరి వంటి 11 నాటకాలు రచించారు. బాల సాహిత్యానికి సంబంధించి 33 పుస్తకాలు రచించారు. పిల్లల కోసం ఏడు నవలలు రాశారు.

విచిత్రమైన మానవ భావోద్వేగాలే ప్రధానాంశాలుగా కథలు వ్రాసే భరద్వాజ శైలి సరళమైనది. పాత్ర చిత్రీకరణలో, ఒక సన్నివేశాన్ని పరిచయం చేయటంలో రావూరి భరద్వాజకు ఉన్న ప్రజ్ఞ అద్భుతమైనది.

రావూరి భరద్వాజ పేరు ప్రఖ్యాతులు తెచ్చిన రచనల్లో ముఖ్యమైనది, చలనచిత్ర పరిశ్రమను వస్తువుగా చేసుకొని తెలుగులో వెలువడిన మొట్ట మొదటి నవల పాకుడు రాళ్లు. భరద్వాజ దీనికి మాయ జలతారు అని నామకరణం చేశారు. అయితే శీలా వీర్రాజు పాకుడురాళ్లు అనే పేరు పెట్టాడు. మల్లంపల్లి సోమశేఖర శర్మ, ముదిగొండ సుబ్రహ్మణ్య శర్మల ప్రోత్సాహంతో రావూరి భరద్వాజ తాను అంతకు ముందే రాసిన 'పాలపుంత' అనే ఓ పెద్ద కథని పాకుడురాళ్లు నవలగా రాశారు. మూడు సంవత్సరాల పాటు కృష్ణా పత్రికలో ధారా వాహికగా వెలువడిన పాకుడురాళ్లు నవలపై శ్రీ కృష్ణదేవ రాయ, శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయాల్లో పరిశోధనలు జరగడం విశేషం.

రావూరి భరద్వాజకు 1980లో ఆంధ్ర విశ్వ విద్యాలయం, 1987లో జవహర్లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వ విద్యాలయం, 1991లో నాగార్జున విశ్వ విద్యాలయం గౌరవ డాక్టరేట్లు ప్రదానం చేసి గౌరవించాయి. 1980లో కళాప్రపూర్ణ ఆంధ్ర విశ్వవిద్యాలయం, 1983లో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం, 1985లో సోవియట్ భూమి నెహ్రూ పురస్కారం ఇనుక తెర వెనకకు లభించింది. 1987లో రాజాలక్ష్మీ ఫౌండేషన్ అవార్డు,1987లో తెలుగు కళాసమితి కె.వి.రావు, జ్యోతిరావు అవార్డు, 1997లో తెలుగు విశ్వ విద్యాలయం నుండి సాహిత్యంలో విశిష్ట పురస్కారం, 2007లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కళారత్న అవార్డు, 2008లో లోక్ నాయక్ ఫౌండేషన్ పురస్కారం, (వినూత్న సాహితీ ప్రక్రియ కల్పించినందుకు, డిసెంబరు 4వ తేదీన ప్రకటించారు), 2011లో కేంద్ర సాహిత్య అకాడమీ, వంగూరి ఫౌండేషన్, గోపీచంద్ జాతీయ సాహిత్య పురస్కారాలు లభించాయి. 2012లో జ్ఞానపీఠ అవార్డు తెలుగు సాహిత్యానికి ఆయన చేసిన బహుముఖమైన కృషికి దక్కింది.

- రామ కిష్టయ్య సంగన భట్ల...
9440595494

# చంద్రబాబు, రేవంత్ భేటీకి కాంగ్రెస్ పర్మిషన్ ఇచ్చిందా..?

- ఇద్దరి ముఖ్యమంత్రుల సమావేశం ఏ క్షణమైనా రద్దు కావచ్చు
- ఇద్దరు ముఖ్యమంత్రులు కలవాలని తాము కోరుకుంటున్నాం
- బీజేపీ నేత ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ సంచలన వ్యాఖ్యలు

**విశ్వంభర, హైదరాబాద్ :** ఆంధ్ర ప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణలో భాగంగా ఇచ్చిన హామీలపై చర్చించేందుకు తెలుగు ముఖ్యమంత్రులు చంద్రబాబు నాయుడు, రేవంత్ రెడ్డి ఈనెల ఆరవ తేదీన భేటీ అయ్యేందుకు ముహూర్తం ఫిక్స్ చేసిన విషయం తెలిసిందే. ఈ సమావేశం హైదరాబాద్లోని ప్రజాభవన్లో జరగనుంది.అయితే చంద్రబాబు నాయుడు, రేవంత్ రెడ్డి భేటీపై తెలంగాణ బీజేపీ నేత ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇద్దరు ముఖ్యమంత్రులు కలవాలని తాము కోరుకుంటున్నామని, కానీ వారిద్దరి భేటీ ఏ క్షణంలోనైనా రద్దు కావొచ్చని ఎన్వీఎస్ ప్రభాకర్ వెల్లడించారు. విభజన చట్టంలోని హామీలు ఇద్దరు ముఖ్యమంత్రులు చొరవ తీసుకుని ముందుకు వెళ్తే మంచిదేనని, అయితే చంద్రబాబు, రేవంత్ రెడ్డి మీటింగ్కు కాంగ్రెస్ అధిష్ఠానం నుంచి పర్మిషన్ ఉందా అని ఆయన ప్రశ్నించారు. అసలు ఆ మీటింగ్ జరుగుతుందా అని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. ఏదో ఒక కారణం చెప్పి చంద్రబాబు, రేవంత్ రెడ్డి మీటింగ్ను కాంగ్రెస్ అధిష్ఠానం ఆపివేసే అవకాశాలున్నాయని తెలంగాణ బీజేపీ నేత ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ తెలిపారు.



# ఈవీఎంలు ట్యాంపరింగ్ చేయొచ్చు

- సీఎం రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు
- పోలింగ్ రోజున 15 శాతం చేయొచ్చు

**విశ్వంభర, ఢిల్లీః** తెలంగాణలో 2029వరకూ కాంగ్రెస్ పార్టీనే అధికారంలో ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఏపీలో ఐదేళ్లకోసారి, తెలంగాణలో పదేళ్లకోసారి అధికారం మారే ట్రెండ్ ఉందన్నారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న రేవంత్ రెడ్డి.. ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా, పలువురు కేంద్రమంత్రులతో సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి ఈవీఎంలను ట్యాంపరింగ్ చేయొచ్చంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. పోలింగ్ రోజున రిజర్వ్లో ఉండే 15శాతం ఈవీఎం యంత్రాలను ట్యాంపరింగ్ చేసే అవకాశం ఉందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. వాటిని అటు ఇటు మారిస్తే ఎవరికీ తెలిసే అవకాశమే ఉండదని సీఎం చెప్పుకొచ్చారు. మూసీ నది సుందరీకరణ, రీజనల్ రింగ్ రోడ్డు పూర్తి చేయడం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యత అంశాలుగా పెట్టుకున్నట్లు చెప్పారు. 55కిలోమీటర్ల మేర మూసీ నదిపై రోడ్డు, రైళ్లు వెళ్లేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. ఆ సమయంలో నిరాశ్రయులయ్యే 10వేల మందికి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కేటాయిస్తామని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టులు పూర్తి చేసి పాలనలో ముఖ్యమంత్రిగా ముద్ర వేస్తానని ఆశాభావం వ్యక్తం చేశారు.



# శాకంబరి నవరాత్రి ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

**విశ్వంభర, హైదరాబాద్ :** వరంగల్ జిల్లా భద్రకాళి దేవాలయంలో ఈ నెల 6 నుంచి 21 వరకు నిర్వహించే శాకంబరి నవరాత్రి ఉత్సవాలకు హాజరుకావాలంటూ అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు ఆహ్వానం అందించారు. ఈ మేరకు ఆలయ ఈవో శేషు భారత, ప్రధాన అర్చకులు భద్రకాళి శేషు, అర్చకులు రామయ్య, సూపరింటెండెంట్ విజయ్ గురువారం సెక్రటేరియట్లో మంత్రి కొండా సురేఖ, వరంగల్ జిల్లా ఇంచార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలను కలిసి ఉత్సవాలకు ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఉత్సవాల పోస్టర్ను మంత్రులు ఆవిష్కరించారు. ఉత్సవాలను వైభవోపేతంగా నిర్వహించాలని, ఈ దిశగా సంపూర్ణ సహకారాన్ని అందిస్తామని మంత్రి సురేఖ ఆలయ ఈవో, అర్చకులకు సూచించారు.



## రైతు భరోసా పథకంపై
# రైతన్నల అభిప్రాయాల సేకరణ

**విశ్వంభర, చింతపల్లి :** రైతుల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ లక్ష్యమని, అందులో భాగంగానే రైతు భరోసా పథకంపై చింతపల్లి మండల కేంద్రంలోని గురువారం మార్కెట్ యార్డులో రైతుల అభిప్రాయ సేకరణలో భాగంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్య అతిథిలుగా ఏడీఏ శ్రీ లక్ష్మీ, పిఎసిఎస్ చైర్మన్ లింగంపల్లి వెంకటయ్య పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ఘడియ గౌరారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. రైతు భరోసా పథకంపై రైతుల నుంచి అభిప్రాయలను సేకరించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. సాగు చేస్తున్న వ్యవసాయ భూములకే ప్రభుత్వం రైతు భరోసా ఇవ్వాలని సూచించారు. అలాగే 5 నుంచి 10 ఎకరాల వరకు మాత్రమే రైతు బంధు పథకం వర్తింప జేయాలని మరికొందరు రైతులు కోరారు. ఖాళీగా ఉన్న భూములకు ఇవ్వవద్దని సూచించారు. రైతుభరోసా డబ్బులు జూన్ మొదటి వారంలో అందేలా చూడాలని సలహాలు ఇచ్చారు. అనంతరం ఏడీఏ శ్రీ లక్ష్మీ మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతులకు అందించనున్న రైతు భరోసాపై రైతుల అభిప్రాయ సేకరణ కార్యక్రమంలో అన్ని పిఎసిఎస్‌లలో తీసుకొని, రైతుల సూచనలు, సలహాలను ప్రభుత్వానికి నివేదిస్తామని చెప్పారు. చాలామంది రైతులు రైతు భరోసా పథకంతో పాటు అన్ని రకాల సబ్సిడీలను అందించాలని కోరుతున్నారని చెప్పారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అన్ని విధాలా చేయూతనిస్తుందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలను రైతులు తప్పని సరిగా పాటించాలని వ్యవసాయ అధికారి శ్రావణ కుమారి సూచించారు. ఈ కార్యక్రమంలో సహకారం సంఘం సీఈఓ రాజశేఖర్ రెడ్డి, సహకార సంఘం సీనియర్ అడిటర్ శరత్ కుమార్, నల్ల సుధాకర్ రావు, వీరమళ్ళ శ్రీనివాస్, రమవత్ మధు, సిద్దగోని లక్ష్మమ్మ, రామరాజు, తిరుమని పాపయ్య, లక్ష్మయ్య, సర్పంచ్ ముచ్చర యాదగిరి, ఎంపీటీసీలు సదానందం, వరలక్ష్మి, గోవిందు రవి కుమార్, ఏఈవోలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీ హిందువులపై
# తప్పుడు ఆరోపణలు సరికాదు

**పెద్ద శంకరంపేట బీజేపీ మండల అధ్యక్షుడు కోణం విఠల్**



**విశ్వంభర, నారాయణఖేడ్ :** లోకసభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ హిందువులపైన హిందూ మతం పైన తప్పుడు ఆరోపణలు చేయడం సమంజసం కాదని పెద్ద శంకరంపేట మండల బిజెపి అధ్యక్షుడు కోనం విఠల్ మండిపడ్డారు. గురువారం పెద్ద శంకరంపేటలోని బిజెపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.. లోక్సభలో ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న రాహుల్ గాంధీ హుందాగా ప్రవర్తించాలి కానీ హిందువులపైన ఇష్టారితిలో ఆరోపణలు చేయడం మంచి పద్ధతి కాదని ఆయనకు దేశ ప్రజలు ఎన్నటికీ క్షమించరని ఇలాంటి ప్రకటనలు మానుకోవాలని పేర్కొన్నారు. 100 కోట్ల హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా మాట్లాడిన రాహుల్ గాంధీనీ హిందువులు ఎప్పటికీ క్షమించరని ఆయన అన్నారు. హిందువులను హింసాత్మకలు అనడం.. హిందువుల పట్ల మీకున్న ద్వేషం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. హిందువులకు వ్యతిరేకంగా ప్రకటనలు చేయడం తీవ్రమైన కుట్ర అని ఆయన విమర్శించారు. రావుల్ గాంధీ ఇప్పటికైనా ఇలాంటి ప్రకటనలు మానుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల బిజెపి నాయకులు సూర్య ప్రకాష్, శ్రావణ్ కుమార్, అశోక్, మంగలి కృష్ణ, శ్రీహరి పాల్గొన్నారు.

## మహాదేవపూర్ ప్రాథమిక సహకార సంఘంకు
# ఎన్‌సీడీసీ ఎక్సలెన్స్ అవార్డు



**విశ్వంభర, భూపాలపల్లి :** జాతీయ కో-అపరేటివ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రాంతీయ కో-అపరేటివ్ ఎక్సలెన్స్ మరియు మెరిట్ 2023 అవార్డులులో భాగంగా భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ ప్రాథమిక సహకార సంఘం సేవలు పని విధానాలు గుర్తించి అద్భుతంగా ఉన్నందు వలన రాష్ట్ర వ్యవసాయ సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, TGCAB చైర్మన్ మార్నేని రవీందర్ రావు చేతుల మీదుగా గౌరవ ఎక్సలెన్స్ అవార్డుతో పాటు 25000/- రూపాయల చెక్ ప్రోత్సాహకాన్ని సహకార సంఘం చైర్మన్ చల్ల తిరుపతి రెడ్డి , వైస్ చైర్మన్ పెండ్యాల అనిల్, సంఘం సభ్యులు CEO కుమ్మరి రాజబాబు స్వీకరించారు. వీరితో పాటు అధికారులు NCDC MD ఎమ్ గోపి, NCDV కో అపరేటివ్ ఎస్క్యూటివ్ డైరెక్టర్ వీకే దుబాసి, డైరెక్టర్ ఆఫ్ కో అపరేటివ్ మరియు రిజిస్టర్ ఆఫ్ కో అపరేటివ్ సొసైటీ ఆఫీసర్ ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

# నెంబర్ ప్లేట్ లేని వాహనాలు సీజ్

**విశ్వంభర, నారాయణఖేడ్ :** ద్విచక్ర వాహనాలకు నంబర్ ప్లేట్ లేకుండా ఉన్న ప్రతి వాహనాన్ని సీజ్ చేయడం జరుగుతుందని పెద్ద శంకరంపేట ఎస్సై శంకర్ అన్నారు. గురువారం పెద్ద శంకరంపేటలోని ప్రధాన రహదారిపై వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల శంకరంపేట గ్రామంలో వెహికల్ చెకింగ్ స్పెషల్ డ్రైవ్ లో భాగంగా నెంబర్ ప్లేటు, వాహన ధ్రువపత్రాలు లేని 17 టూ వీలర్లను సీజ్ చేసినట్లు తెలిపారు. నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడిపినచో సీజ్ చేయబడతాయని, మైనర్ లకి వాహనాలు ఇవ్వవద్దని పేర్కొన్నారు.

# కల్వకుర్తి ఎత్తిపోతల లిఫ్ట్ ఇరిగేషన్‌పై సమీక్ష



**విశ్వంభర, ఆమనగల్లు :** కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ పనులు త్వరితగతిన పూర్తి చేయటానికి గురువారం సచివాలయంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, దామోదర రాజనర్సింహ గార్లతో మహబూబ్‌నగర్ జిల్లాల ఎమ్మెల్యేలతో మరియు సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రత్యేక దృష్టితో వెల్దండ మండల పరిధిలోని చెరుకూరు శివారులోని కేఎస్ఐ డి 82 కాలువ పెండింగ్ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. గత ప్రభుత్వంలో ఎమ్మెల్సీగా పనిచేసిన ప్రస్తుత ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కల్వకుర్తి ప్రాంతానికి సాగునీరు అందించాలనే తపనతో డి 82 కాలువ పనులు మండల పరిధిలోని చెరుకూరు గ్రామ శివారులో 400 మీటర్ల పొడవు పనులు ఆగిపోయాయి. ఆగిపోయిన పనులను తిరిగి ప్రత్యేక చొరవ తీసుకొని ఎమ్మెల్యే తొందరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మిగతా పనులపై మంత్రులు ఎమ్మెల్యేలతో సమీక్షించారు.

# ప్రాజెక్టు నిర్మాణానికి రైతులకు నోటీసులు



**విశ్వంభర, చింతపల్లి :** ఆర్ విద్యాసాగర్ రావు డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా చింతపల్లి, మల్లారెడ్డిపల్లి, నసర్లపల్లి మూడు గ్రామాలతో కలిపి ప్రాజెక్టు నిర్మించడానికి అప్పటి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ప్రాజెక్టు విస్తీర్ణం 1691 ఎకరాలు కాగా మూడో విడతలో భాగంగా చింతపల్లి గ్రామానికి సంబంధించి 428 ఎకరాల భూ సేకరణకు అధికారులు మండల కేంద్రంలోని గ్రంథాలయం వద్ద రైతులకు సమావేశం ఏర్పాటు చేశారు. రైతులు తమ అభిప్రాయాలను తెలియచేస్తే ఉన్నతధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. 2016లో ఇస్తామన్న 5.15లక్షలు పరిహారం చెల్లించని అప్పటి ప్రభుత్వం రైతులకు మూడో విడతలో రైతులకు కేటాయించిన నిధుల ప్రకారం చెల్లించాలని అధికారులకు తెలిపారు. ఇప్పటి భూముల విలువ ప్రకారం ఎకరానికి 30లక్షల రూపాయలు, ఇంటి స్థలం, ఇంటిలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కలిపించాలని రైతులు అధికారులకు తెలిపారు. ఈ నెల 30వ తారీకు కలెక్టర్ సమక్షంలో మండల కేంద్రంలో సమావేశం ఏర్పాటు చేస్తామని అధికారులు రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమం సీనియర్ అసిస్టెంట్ అశోక్ రెడ్డి, జూనియర్ అసిస్టెంట్లు శేఖర్ రెడ్డి, శీను, రైతులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# సతుల స్థానంలో పతులకు సన్మానం

## కల్వకుర్తి మండల ఎంపీటీసీల ఆత్మీయ సమ్మేళనం

**విశ్వంభర, కల్వకుర్తి :** కల్వకుర్తి ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ఎంపీటీసిల వీడ్కోలు సమావేశంలో సతుల స్థానంలో పతులు హాజరయ్యారు. అధికారుల సాక్షిగా మహిళా ఎంపీటీసీలకు బదులు వారి భర్తలు హాజరయ్యారు. జిల్లెళ్ళ ఎంపిటిసి శోభారాణి, మార్చాల ఎంపిటిసి కడల సంతోష, రఘుపతి పేట ఎంపిటిసి సునీతలకు బదులు వారి భర్తలకు అధికారులు సన్మానం చేశారు. గెలుపొందినప్పటి నుంచి మహిళా ప్రజాప్రతినిధులు ప్రతి సమావేశాలలో భర్తలు హాజరు కావడం బహిరంగ రహస్యం, మరి కనీసం వీడ్కోలు సమావేశం రోజునైనా మహిళలను గౌరవించకపోవడం అధికారుల నిర్లక్ష్యమని చెప్పక తప్పదు.
ఈ ధోరణి మారి మహిళలు వారి సంపూర్ణ రాజకీయ అధికారాలు, హక్కులను లేకుండా పోయిందని ప్రజలు వాపోతున్నారు.

# దొడ్డి కొమరయ్య విగ్రహాన్ని ట్యాంక్ బండ్‌పై ఏర్పాటు చేయాలి

## డా.దిడ్డి సుధాకర్




**విశ్వంభర, బషీర్ బాగ్:** దొడ్డి కొమరయ్య విగ్రహాన్ని ట్యాంక్ బండ్‌పై ఏర్పాటు చేయాలని ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ డా.దిడ్డి సుధాకర్ డిమాండ్ చేశారు. అమ్ ఆద్మీ పార్టీ తెలంగాణా కమిటీ ఆధ్వర్యంలో గురువారం తెలంగాణ తొలి అమరుడు దొడ్డి కొమరయ్య 78వ వర్ధంతి సందర్భంగా లిబర్టీ చౌరస్తాలోని ఆప్ రాష్ట్ర కార్యాలయంలో డాక్టర్ దిడ్డి సుధాకర్, కన్వీనర్, బుర్రా రాములు గౌడ్, మహిళా విభాగం అధ్యక్షురాలు హేమ జిల్లోజు, సోషల్ మీడియా భాద్యులు అహసాన్, సోహల్, కోడంగల్ శ్రీనివాస్, మౌనిక తదితరులు ఆయన చిత్ర పటానికి పూలమాలలను వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సుధాకర్ మాట్లాడుతూ ఆనాడు జమీందార్, పటేల్, పట్వారిలో కోసం దేశముఖ్‌లు దేశ్ పాండేలు ఇష్టా రాజ్యంగా పన్నులు వసూలు చేసే వాళ్లని, విసునూర్ దేశ్ ముఖ్‌గ వున్న విసునూరు రామచంద్రారెడ్డి ఆయన తల్లి జానమ్మ ఒక జాగీర్దార్, వీరికి చెందిన కడివెండి గడీ మీద 1946 జూలై 4 న దేశముఖ్, రజాకార్లకు వ్యతిరేకంగా గుత్పల సంఘం తీసిన జులూస్‌కు 19 సంవత్సరాల వయసున్న దొడ్డి కొమరయ్య ముందుండి నడిపించాడని అన్నారు. ఆనాడు జరిగిన కాల్పులలో తెలంగాణ తొలి అమరుడుగా దొడ్డి కొమరయ్య చరిత్ర కెక్కాడని, ఆ తరువాత తెలంగాణ ఉద్యమం ఊపు అందుకోవడం, నిజాంకు వ్యతిరేకంగా సాయుధ పోరాటం జరగడం, తెలంగాణ భారత దేశంలో విలీనం అవడం తెలిసిందే అన్నారు. మలి ఉద్యమంలో తెలంగాణ సాధించుకున్నా, తెలంగాణ తొలి అమరుడికి దక్కాల్సిన గౌరవం దక్కలేదన్నారు. తెలంగాణ అగ్గిరవ్వ, తెలంగాణ తొలి అమరుడు, దొరల గడీలను కూల్చిన ధీశాలి, సాయుధ పోరాట యోధుడు, రైతాంగ సాయుధ పోరాటాన్ని పతాక స్థాయికి తీసుక పోవడానికి అసువులు బాసిన ధీశాలి దొడ్డి కొమరయ్య అన్నారు.

# నారాయణపూర్ ప్రత్యేక అధికారిగా జైపాల్ రెడ్డి

**విశ్వంభర, నారాయణపూర్ :** రాష్ట్రవ్యాప్తంగా ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, ఎంపీపీల పదవీకాలం బుధవారం ముగియడంతో గురువారం నుంచి జిల్లా అధికారులను మండల ప్రత్యేక అధికారులుగా నియమించారు. నారాయణపూర్ మండల ప్రత్యేక అధికారిగా జిల్లా షెడ్యూలు కులాల సంక్షేమ అధికారిగా విధులు నిర్వర్తిస్తున్న ఎం జైపాల్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. మండల పంచాయతీ అధికారితో కలిసి మండలంలోని పంచాయతీ కార్యదర్శులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి పీ జనార్ధన్ రెడ్డి, టీపీఎస్ఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు బీ వెంకటేష్, టీ వెంకటేశ్వర్లు, వీ చంద్రశేఖర్ రెడ్డి, పీ శ్రీనివాస్, సాయిరాం రెడ్డి, ఎన్ వినయ్, కే ఉషయ్య, ఏ దశరథ, ఎండీ రఫీ, పీ గంగారం, జీ సువర్ణ, ఏ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.





# డిండిలో విద్యాసంస్థల బంద్

**విశ్వంభర, డిండి :** మండల కేంద్రంలోని అన్ని పాఠశాలలు, కళాశాలలు బంధుకు అనుబంధ సంఘాలు ఎన్ఎస్‌యూఐ, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ బంద్ నిర్వహించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో పేపర్ లీకులు జరుగుతున్న నరేంద్రమోదీ మోదీ స్పందించపోవడం అప్రజాస్వామికం, పేపర్ లీకుల కారణంగా మసకబారుతున్న దేశ ప్రతిష్ట దేశ ప్రధాని మౌనం వీడి విద్యార్థుల పక్షాన మాట్లాడకుంటే సంఘటిత ఉద్యమాలను ఉధృతం చేస్తాం విద్యార్థి, యువజన సంఘాల ఐక్య కార్యాచరణ సమితి సంయుక్తంగా డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి పున్న దినేష్, ఏఐవైఎఫ్ నల్లగొండ జిల్లా ఉపాధ్యక్షుడు ఎనమల్ల నవీన్, ఏఐవైఎఫ్ డివిజన్ అధ్యక్షుడు సురిగి వినమ్ కుమార్, డిండి మండల అధ్యక్షులు, యూఎస్ఎఫ్ఐ మైముద్, ఎన్ఎస్‌యూఐ డిండి మండల టౌన్ అధ్యక్షులు అజమ్, భాను, అనిల్, సైదులు, శ్రీకాంత్, సిద్దు, అరవింద్, బన్నీ, గణేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.




సూర్యాపేట జిల్లా మునగాల మండలం నరసింహులగూడెం హై స్కూల్‌లో విద్యాసంస్థలు బంద్ పాటించాలని ప్రిన్సిపాల్ అనురాధకు వినతి పత్రం ఇస్తున్న DYFI జిల్లా కమిటీ సభ్యుడు తుమ్మ సతీష్, మాతంగి తిరుపతయ్య, ఎర్ర వెంకటేశ్వర్లు **– విశ్వంభర, సూర్యాపేట**



## బాసర ట్రిబుల్ ఐటీలో సీటు సాధించిన
# సంస్థాన్ విద్యార్థి

**విశ్వంభర, నారాయణపూర్ :** సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన పదవ తరగతి విద్యార్థి మెట్టు హర్షవర్ధన్ తండ్రి మెట్టు బాలయ్య, బాసర త్రిబుల్ ఐటీలో సీటు సాధించాడు. నిరుపేద కుటుంబానికి చెందిన హర్షవర్ధన్ బాసర త్రిబుల్ ఐటీలో సీటు సాధించడంతో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రేగెట్టి రమాదేవి అభినందనలు తెలిపారు.



# మెరిసిన నిరుపేద విద్యార్థిని కుసుమాలు

**విశ్వంభర, చింతపల్లి :** మండలంలోని వెంకటేశ్వర నగర్ (గొడకొండ్ల) జెడ్పిహెచ్ఎస్ పాఠశాలలో చదివిన రాగిపని హర్షిత, సురిగి సింధు అనే నిరుపేద మట్టిలోని మాణిక్యాలు నిన్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన బాసర త్రిబుల్ ఐటీ ఫలితాల్లో ఎన్సిసి కోటలో అడ్మిషన్ పొంది పాఠశాల ఉపాధ్యాయులకు మరియు గ్రామానికి గౌరవాన్ని తెచ్చారు. ఈ నిరుపేద విద్యార్థినిలు మొన్న జరిగిన పదవ తరగతి ఫలితాలలో పాఠశాల పీఈటి రెహానా బేగం, ఉపాధ్యాయులు రవి కుమార్‌లు అందించిన ప్రోత్సాహంతో 9.8 పాయింట్స్ సాధించి మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రథమ స్థానాన్ని పొందారు. వీరికి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఏ వాణి, ఇన్చార్జి ఉపాధ్యాయులు కృష్ణవేణి, ఉపాధ్యాయులు విద్యార్థినులను అభినందించారు. ఈ పాఠశాలలో 2013వ సంవత్సరంలో పాఠశాల ఉపాధ్యాయులు బీ రవి కుమార్, ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎన్సీసిలో పాఠశాల పిఈటి రెహనా కృషి ఫలితంగా విద్యార్థినిలు విజయం సాధించారు. విద్యార్థినిలకు పాఠశాల ఉపాధ్యాయులు ప్రత్యేకమైన అభినందనలు తెలియజేశారు.



## ఇంటర్నేషనల్ స్కూల్‌లతో గురుకులాలు పోటీపడాలి

- విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి
- గురుకుల లో ఏ సమస్యలు ఉన్న తన దృష్టికి తీసుకురండి
- మంత్రి పొన్నం ప్రభాకర్

**విశ్వంభరా హుస్నాబాద్, జూలై 4 :** హుస్నాబాద్ నియోజకవర్గంలోని పొతారం గ్రామంలో ఉన్న మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలను రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అకస్మిక పర్యటన చేశారు. పాఠశాలలో పరిసరాలు మొత్తం శుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. విద్యార్థులతో ఒక్కొక్కరితో ఆత్మీయంగా పలకరిస్తూ మాట్లాడారు .అదే సమయంలో విద్యార్థులకు డిన్నర్ సమయంలో భోజనం చేస్తుండడంతో వారితో కలిసి భోజనం చేశారు.ప్రతి రోజూ అన్నం, కూరలు ఎలా ఉన్నాయని ,ఉదయం ఏ రోజు ఎలాంటి టిఫిన్ పెడుతున్నారని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.. విద్యార్థులతో మంత్రి వారి కుటుంబ సభ్యులకు మొబైల్ వీడియోకాల్‌లో పరిచయం చేశారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గురుకుల పాఠశాలలో ఏ సమస్య ఉన్న తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. అక్కడే ఉన్న ఉపాధ్యాయులతో సబ్జెక్టు ల వారీగా వారు బోధించే అంశాలపై మాట్లాడారు. గురుకులాలు ఇంటర్నేషనల్ స్కూల్‌లతో పోటీ పడాలంటే ఉపాధ్యాయులు, సిబ్బంది కూడా ఇంగ్లీష్ లో మాట్లాడాలని సూచించారు అప్పుడే విద్యార్థులు కూడా మాట్లాడడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. ముఖ్యంగా మ్యాథ్స్ లో విద్యార్థులు వెనకబడకుండా ప్రత్యేక తరగతుల ద్వారా బేసిక్ నుండే వారికి నేర్పించాలని సూచించారు. ప్రతి రోజూ వారికి ఉండే ఆటల సమయాన్ని ఉపయోగించి వారికి ప్రత్యేకంగా ఆటల్లో శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు.స్కూల్ కి గ్రౌండ్ చిన్నగా ఉన్న అంశాన్ని మంత్రి గారి దృష్టికి తీసుకొచ్చారు. స్కూల్ గ్రౌండ్ కోసం స్థల పరిశీలన చేసి ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. అధ్యాపక బృందం విద్యార్థులకు ప్రేమ పూర్వకంగా, స్నేహ పూర్వకంగా మెలగాలని ఇప్పటి నుండే లక్ష్యాన్ని ఎంచుకొని సాధించేలా వారిలో అలచర్చాలని సూచించారు. స్కూల్ కి విద్యుత్ సమస్య లేకుండా చూసుకోవాలని ఆవరణలో లైట్స్ ఏర్పాటు చేయాలని, నాణ్యమైన డ్రింకింగ్ వాటర్ అందించాలని తెలిపారు. ప్రహరీపై పెన్సింగ్ వేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

# నిఘా విభాగాలకు నిధులివ్వండి

- అమిత్ షాను కోరిన సీఎం రేవంత్
- టెక్నాలజీ పరికరాల కోసం నిధులు కావాలన్న రేవంత్
- 29 మంది అదనపు ఐపీఎస్ లను కేటాయించాలంటూ వినతి
- ఆయన వెంట డిప్యూటీ సీఎం



**విశ్వంభర, ఢిల్లీ :** రాష్ట్ర స్థాయి అత్యున్నత నిఘా విభాగాలైన తెలంగాణ యాంటీ నార్కొటిక్స్ బ్యూరో (టీజీ న్యాబ్), తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీ సీఎస్‌బీ) ఆధునీకరణకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో కేంద్ర హోం శాఖ మంత్రిని ఆయన నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం కలిశారు. సుమారు గంటపాటు కొనసాగిన భేటీలో వివిధ అంశాలను కేంద్ర మంత్రి దృష్టికి ముఖ్యమంత్రి తీసుకెళ్లారు. భేటీలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కూడా పాల్గొన్నారు. డ్రగ్స్, సైబర్ నేరాల నియంత్రణతో పాటు అరికట్టడానికి కావాల్సిన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, పరికరాల కొనుగోలు కోసం టీజీ న్యాబ్‌కు రూ.88 కోట్లు, టీజీ సీఎస్‌బీకి రూ.90 కోట్లు కేటాయించాలని కేంద్ర మంత్రి అమిత్ షాను ముఖ్యమంత్రి కోరారు. ప్రతి ఐదేళ్లకు ఒకసారి ఐపీఎస్ క్యాడర్ సమీక్ష చేయడం తప్పనిసరని, తెలంగాణకు సంబంధించి 2016లో మొదటి సారి సమీక్ష నిర్వహించారని, నాటి నుంచి సమీక్ష చేయనుందున వెంటనే సమీక్ష చేయాలని కేంద్ర మంత్రిని ముఖ్యమంత్రి కోరారు. రాష్ట్ర విభజన సమయంలో తెలంగాణకు 61 ఐపీఎస్ పోస్టులు కేటాయించారని, రాష్ట్ర అవసరాలకు ఐపీఎస్‌లు సరిపోనందున, తెలంగాణకు అదనంగా మరో 29 ఐపీఎస్ పోస్టులు కేటాయించాలని విజప్తి చేశారు. తెలంగాణ సరిహద్దు రాష్ట్రాలైన ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రల్లో వామపక్ష తీవ్రవాదానికి వ్యతిరేకంగా పెద్ద సంఖ్యలో సెక్యూరిటీ ఫోర్స్ క్యాంపులు ఏర్పాటు చేసిన విషయాన్ని కేంద్ర మంత్రికి ముఖ్యమంత్రి గుర్తు చేశారు. ఆదిలాబాద్, మంచిర్యాల, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలో కూడా ఇదే విధమైన క్యాంపులను ఏర్పాటు చేయడానికి అవకాశం ఉందన్నారు. వామపక్ష తీవ్రవాద ప్రభావిత జిల్లాలుగా గతంలో ఉండి తొలగించిన మూడు జిల్లాలను ఎస్ఆర్ఈ కింద (భద్రతాపరమైన వ్యయం, చెల్లింపులు) తిరిగి కొనసాగించాలని కోరారు. సరిహద్దు రాష్ట్రాలతో విశాలమైన సరిహద్దు ఉండటంతో తెలంగాణ భద్రతపైన మరింత దృష్టి సారించాల్సిన అవసరం ఉందని కేంద్ర హోం శాఖ మంత్రికి ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాష్ట్రంలో వామపక్ష తీవ్రవాదాన్ని అణిచివేసేందుకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం కొండవాయి గ్రామం, ములుగు జిల్లా వెంకటాపురం మండలం ఆలుబాక గ్రామ పరిధిలో సీఆర్పీఎఫ్ జేటీఎఫ్ క్యాంపులు ఏర్పాటు చేయాలని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లోని కర్రె గుట్టల కొండల్లో ఉన్న అనుకూలతను ఆసరాగా చేసుకొని సీపీఐ మావోయిస్టు కమిటీ ఒక ప్రత్యేక దళాన్ని ఏర్పాటు చేసి తమ ప్రాబ్యల విస్తరణకు ప్రయత్నిస్తోందని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మావోయిస్టు ప్రత్యేక దళం కదలికల నియంత్రణతో పాటు నిర్మూలనకు జేటీఎఫ్ క్యాంపులు ఉపయోగపడతాయని తెలిపారు. ఎస్పీవోలకు చెల్లించాల్సిన నిధుల్లో కేంద్రం వాటా 60 శాతం నాలుగేళ్ల నుంచి పెండింగ్ లో ఉందని, ఆ మొత్తం రూ.18.31 కోట్లు విడుదల చేయాలని కోరారు. మావోయిస్టుల నియంత్రణ కోసం ఏర్పాటు చేసిన ఎస్పీవోల్లో మాజీ సైనికులు, మాజీ పోలీసులను మాత్రమే చేర్చుకోవాలనే నిబంధన సమాచారం చేరవేతకు ఇబ్బందిగా ఉందన్నారు. 1065 మందిని ఎస్పీవోల్లో చేర్చుకోవడానికి నిబంధనలు సడలించాలని కోరారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో మాజీ సైనికులు, మాజీ పోలీసులు అందుబాటులో లేరని కేంద్ర మంత్రి దృష్టికి ముఖ్యమంత్రి తీసుకెళ్లారు. దీర్ఘకాలంగా పెండింగ్ లో ఉన్న ఆంధ్రప్రదేశ్, తెలంగాణ పునర్విభజన సమస్యల పరిష్కారానికి సహకరించాలని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. షెడ్యూల్ 9లోని (చట్టంలోని 53, 68, 71 సెక్షన్ల ప్రకారం) ప్రభుత్వ భవనాలు, కార్పొరేషన్ల పంపిణీ, షెడ్యూల్ పదిలోని సంస్థల వివాదం (చట్టంలోని 75 సెక్షన్ ప్రకారం) సామరస్యపూర్వకంగా పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. పునర్విభజన చట్టంలో ఎక్కడా ప్రస్తావించని ఆస్తులు,సంస్థలను ఆంధ్రప్రదేశ్ క్లెయిమ్ చేసుకుంటున్నందున, అందులో తెలంగాణకు న్యాయం జరిగేలా చొరవ చూపాలని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు.

## నాలుగు రోజులు భారీ వర్షాలు

ఏపీ, తెలంగాణకు వాతావరణశాఖ అలర్ట్



**విశ్వంభర, హైదరాబాద్ :** తెలుగు రాష్ట్రాల ప్రజలకు అలర్ట్. వాతావరణ శాఖ కీలక ప్రకటన చేసింది. రానున్న రోజుల్లో భారీ వర్షాలు పడొచ్చని అంచనా వేస్తోంది. ఏపీ, తెలంగాణల వానలు జోరుగా కురవొచ్చని పేర్కొంటోంది. రాష్ట్రవ్యాప్తంగా వచ్చే 4 రోజులు పాటు వర్షాలు కురవొచ్చని హైదరాబాద్ వాతావరణ శాఖ పేర్కొంటోంది. అక్కడక్కడ ఉపరితల గాలులు వీస్తాయని, వీటి ప్రభావంతో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలున్నాయని తెలిపింది. జూలై 5 నుంచి రాష్ట్రంలో భారీ వర్షాలు కురిసే అవకా శాలున్నాయని వెల్లడించింది. గురువారం నుంచి శనివారం వరకు రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. ఆదివారం, సోమవారాల్లో పలు జిల్లాల్లో భారీ వర్షాలు పడే సూచనలు ఉన్నాయని పేర్కొంది. మరోవైపు గుజరాత్–కర్ణాటక తీరాల వెంబడి ద్రోణి విస్తరించి ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. దీని ప్రభావంతో రేపు ఏపీలోని మన్యం, అల్లూరి, కృష్ణా, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతిలో వర్షాలు పడొచ్చు. ఇంకా శ్రీకాకుళం, విజయనగరం, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, తూ.గో, ప.గో, ఏలూరు, నెల్లూరు, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీ సత్యసాయి, వైఎస్ఆర్ జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.



## పాడి రైతులు, కౌలు రైతులకు కూడా రైతు భరోసా అందించాలి

పీఏసీఎస్ చైర్మన్ గంప వెంకటేష్ గుప్త

**విశ్వంభర, ఆమనగల్లు :** ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆమనగల్లు ఆధ్వర్యంలో గురువారం ప్రత్యేక సర్వసభ్య సమావేశం నిర్వహించారు. స్థానిక రైతు వేదికలో జరిగిన రైతుల ప్రజాభిప్రాయ సేకరణ సమావేశానికి సింగిల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టా భూమి కలిగిన పాడి రైతులకు, కౌలు రైతులకు, అదేవిధంగా ఇన్కమ్ టాక్స్ కట్టే రైతులకు కూడా రైతు భరోసా ఇవ్వాలన్నారు. రైతులకు ఐటి లేకపోతే రైతు బిడ్డలకు పెద్ద చదువులు చదివే అవకాశం కోల్పోతారు కాబట్టి తప్పనిసరి రైతులు ఐటీ కడుతున్నారని, కాబట్టి వారికి కూడా రైతు భరోసా ఇవ్వాలన్నారు. గత సంవత్సరం రెండు నుంచి మూడు లక్షల క్వింటాల దాకా ధాన్యం సేకరించామని ఈ సంవత్సరం 20, 30 వేల క్వింటాళ్లు కూడా కొనలేదని రైతులు వడ్లను ఆరబెట్టలేక తరుగుకు భయపడి దళారులకు క్వింటాలుకు రూ.500 తక్కువకు అమ్ముతున్నారని ఆవేదన చెందారు. వైస్ చైర్మన్ సత్యం మాట్లాడుతూ వ్యవసాయం చేసే రైతు యువకులు పెళ్లి చేసుకుందామంటే అమ్మాయిని ఎవరు ఇవ్వడం లేదని, సైనికులు బార్డర్లో ఇలాగైతే వానకు, ఎండకు కష్టపడి దేశ భద్రత కోసం కష్టపడుతున్నారో రైతులు కూడా అదేవిధంగా దేశంలోని ప్రజలకు అన్నం పెట్టడానికి రాత్రింబవళ్లు కష్టపడుతున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు పెద్దపీట వేసి వారి సమస్యలను తీర్చాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో రైతులు వారి వారి అభిప్రాయాలను వెల్లడి చేశారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి నాగలింగం, మాజీ చైర్మన్ ధనుంజయ, వైస్ చైర్మన్ పోలేపల్లి సత్యం, జోగు వీరయ్య ఏవో అరుణకుమారి, సింగిల్ విండో డైరెక్టర్స్ చేగూరి వెంకటేష్, శ్రీపాల్, ముదివెన్ వెంకటేష్, రమేష్, సిబ్బంది దేవేందర్, అల్లాజి, అధికారులు పాల్గొన్నారు.



## ఎంపీపీ ప్రత్యేక అధికారిగా జగదీశ్వర్ రెడ్డి

**విశ్వంభర, చివ్వేంల :** మండల ప్రజా పరిషత్ ప్రత్యేక అధికారిగా జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి జగదీశ్వర్‌రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. మండల ప్రజా పరిషత్ ప్రాదేశిక సభ్యుల ఐదు సంవత్సరాల పదవీకాలం ముగియడంతో ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయ అధికారులు ,సిబ్బంది వారికి పుష్పగుచ్చం ఇచ్చి శాలువాతో సత్కరించారు. అనంతరం ఆయన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి అక్కడి ఉద్యోగుల వివరాలు తెలుసుకొని, ఓపీ రిజిస్టర్‌ను పరిశీలించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో చక్రాల సంతోష్ కుమార్, మెడికల్ ఆఫీసర్ భవాని, సిహెచ్ఓ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



## విద్యాసంస్థల బంద్ విజయవంతం

**విశ్వంభర, ఆమనగల్లు :** మండల కేంద్రంలో నీట్ పేపర్ లీకేజ్‌కి వ్యతిరేకంగా గురువారం దేశవ్యాప్తంగా విద్య సంస్థల బంద్‌కు విద్యార్థి యువజన సంఘాల పిలుపు మేరకు ఆమనగల్ పట్టణంలో ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో ప్రవేట్ మరియు గవర్నమెంట్ విద్యాసంస్థల బంద్ విజయవంతం అయ్యిందని ఆమనగల్లు ఎన్ఎస్ యూఐ నాయకులు ఎండీ ఫరీద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ కల్వకుర్తి నియోజకవర్గం జనరల్ సెక్రటరీ మహమ్మద్ ఫిరోజ్, గుద్దేటి శివ, శ్రీకాంత్, మల్లేష్, కిరణ్ పాల్గొన్నారు.

## ఆత్మకూరు డబల్ బెడ్ రూంలలో సెప్టిక్ ట్యాంక్ ఏర్పాటు చేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కల్లూరి మల్లేశం




**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలో ఉన్న డబల్ బెడ్ రూమ్ ఇండ్లలో బహిర్భూమికి వసతులు లేవని, వెంటనే సెప్టిక్ ట్యాంకర్ నిర్మాణం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కల్లూరి మల్లేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం రోజున ఆత్మకూరు(ఎం)మండల కేంద్రంలోని డబల్ బెడ్ రూమ్ ఇండ్లలో ఉన్న సమస్యలను సిపిఎం పోరుబాట కార్యక్రమంలో భాగంగా పర్యటించి అక్కడ నివాసం ఉంటున్న వారిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కల్లూరి మల్లేశం మాట్లాడుతూ.. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో నివాసం ఉంటున్న మహిళలు బహిర్భూమికి వెళ్ళడం కోసం పాతకాలం పద్ధతులలో చెట్లు వెతుక్కోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రైనేజీని నిర్మించడం కనీస బాధ్యతని అయినా.. ప్రభుత్వాలు విస్మరిచ్చాయని విమర్శించారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించాలని, లేనియెడల సిపిఎం ఆధ్వర్యంలో ఎమ్మార్వో కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చ రించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి వేముల బిక్షం, మండల కమిటీ సభ్యులు చెర్కు మల్లేశం, గుండబోయిన స్వామి, తుమ్మల సత్య నారాయణ రెడ్డి, నాయకులు కందడి వెంకట్ రెడ్డి, కమల్, రితీష్, గర్దాసు లింగయ్య, లక్ష్మి, మాంద్ర మహేందర్, సంతోష, రచ్చ రమేష్, భాగ్యమ్మ, కొంగర పరిసరాములు, వేముల నరసింహ, పుష్ప, అంగడి యాదగిరి, వేముల నరసింహ, భాగ్య లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



## కొరటికల్ గ్రామంలో అల్లూరి సీతారామరాజు జయంతి

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలం కొరటికల్ గ్రామంలో అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా అల్లూరి సీతారామరాజు యువజన సంఘం ఆధ్వర్యంలో సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అల్లూరి సీతారామరాజు యువజన సంఘం అధ్యక్షుడు పల్లపు విజయ్ మాట్లాడుతూ.. మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు మహోజ్వల శక్తి అని అన్నారు. అతను ప్రజల కోసం చేసిన సాయుధ పోరాటం గురించి ఎంత చెప్పిన తక్కువే అని అన్నారు. ఆనాడు బ్రిటీష్ సామ్రాజ్యాన్నే గడ గడలాడించిన వీర యోధుడు అల్లూరి సీతారామరాజు అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు చిన్నం ఏలెందర్, అల్లూరి యువజన సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## కొమురయ్య ఆశయసాధనకు కృషి చేయాలి

**విశ్వంభర, నారాయణఖేడ్ :** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు, భూమి, భుక్తి, జాతి విముక్తి కోసం పోరాడిన తెలంగాణా ముద్దు బిడ్డ దొడ్డి కొమురయ్య ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాయిని మధు అన్నారు. గురువారం స్థానిక వెటర్నరీ ఆసుపత్రి వద్ద కొమురయ్య వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళర్పించారు. కార్యక్రమంలో గోరుగంటి గంగారాం కుమార్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గర్గారెడ్డి, మాజీ వార్డు మెంబర్ విఠల్రెడ్డి తదితరులున్నారు.



## ఎన్ఎస్‌యూఐ అధ్వర్యంలో పాఠశాలల బంద్

**విశ్వంభర, నారాయణఖేడ్ :** నీట్‌పై కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఎన్ఎస్ఈయూఐ రాష్ట్ర అధ్యక్షుడు బి.వెంకట్ పిలుపు మేరకు గురువారం పాఠశాలల బంద్ నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్యూఐ మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్ గౌడ్ మాట్లాడుతూ.. కేంద్రం ప్రభుత్వం నీట్ పరీక్షల లీకేజీపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో లక్షల మంది విద్యార్థులు నష్టపోయారని, వారికి తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శివ, మహేష్ గౌడ్, శ్యామ్, మహిపాల్‌గౌడ్, అరుణ్, పవన్ తదితరులున్నారు.




# ఇంజనీరింగ్ సీట్ల కౌన్సెలింగ్ ప్రారంభం

**విశ్వంభర, హైదరాబాద్ :** తెలంగాణ ఇంజినీరింగ్ కౌన్సెలింగ్ గురువారం నుంచి ప్రారంభమవుతుంది. ప్రభుత్వ, ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలల్లో బీటెక్/బీఈ సీట్ల భర్తీకి ఈ కౌన్సెలింగ్ ప్రక్రియ కొనసాగనుంది. 4 నుంచి జులై 13 వరకు రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించవచ్చు. జులై 6 నుంచి 13 వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఉంటుంది. జులై 8 నుంచి 15 వరకు వెబ్ ఆప్షన్లకు అవకాశం ఇస్తారు. జులై 19న ఇంజినీరింగ్ తొలి విడత సీట్ల కేటాయింపు చేస్తారు. జులై 19 నుంచి జులై 26 వరకు విద్యార్థులు సీట్లు పొందిన కాలేజీల్లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది. ఇక జులై 26 నుంచి ఇంజినీరింగ్ రెండో విడత కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుంది. జులై 27న రెండో విడత కౌన్సెలింగ్ సర్టిఫికెట్ల వెరిఫికేషన్, జులై 27, 28 తేదీల్లో వెబ్ ఆప్షన్లకు అవకాశం ఇస్తారు. జులై 31న ఇంజినీరింగ్ రెండో విడత సీట్ల కేటాయింపు ఉంటుంది. జులై 31 నుంచి ఆగస్టు 2 వరకు సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలి. 8 నుంచి మూడో విడత కౌన్సెలిం గ్ ప్రారంభమవుతుంది. మూడో విడత కౌన్సె లింగ్ కు ఆగస్టు 9న సర్టిఫికెట్ వెరిఫికేషన్, ఆగస్టు 9, 10 తేదీల్లో వెబ్ ఆప్షన్లకు అవకాశం ఇస్తారు. 13న ఇంజినీరింగ్ మూడో విడత సీట్ల కేటాయింపుతో పాటు అదే రోజు సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలి. కౌన్సెలింగ్‌కు హాజరయ్యే విద్యార్థులు తప్పనిసరిగా పదో తరగతి మార్క్స్ మెమో, ఇంటర్మీడియట్ మార్కుల మెమో, ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్ (టీసీ), స్టడీ సర్టిఫికెట్, లేటెస్ట్ ఇన్‌కం సర్టిఫి కెట్, కుల ధ్రువీకరణ సర్టిఫికెట్, తెలంగాణ ఈఏపీసెట్ 2024 హాల్‌టికెట్, తెలంగాణ ఈఏపీసెట్ 2024 ర్యాంక్, ఆధార్‌కా ర్డు, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు తమతో పాటు తీసుకెళ్లాలి.

# భాగ్యనగరం రణరంగం

- కాంగ్రెస్, బీజేపీ యూత్ వింగ్‌ల పోటా పోటీ నిరసనలు
- పోలీసులు అడ్డుకున్నా ఆగని వైనం
- రెండు పార్టీల కార్యకర్తల నడుమ తోపులాటలు, ఘర్షణలు



**విశ్వంభర, హైదరాబాద్ :** హైదరాబాద్‌లో రాహుల్ వర్సెస్ మోదీ.. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో ఇవాళ ఇదే సీన్ కనిపించింది. కాంగ్రెస్, బీజేపీ యూత్ వింగ్‌లు చేపట్టిన పోటాపోటీ ఆందోళనలు ఉద్రిక్తతకు దారితీశాయి. హిందుత్వంపై రాహుల్ గాంధీ పార్లమెంట్ వేదికగా చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ బీజేపీ యువ మోర్చా ఆందోళనకు దిగింది. బీజేపీ రాష్ట్ర కార్యాలయం నుంచి గాంధీభవన్ ముట్టడికి బయల్దేరిన బీజేవైఎం కార్యకర్తలను అక్కడే పోలీసులు అడ్డుకున్నారు. బీజేవైఎం కార్యకర్తలు బారికేడ్లు తోసుకుని ముందుకెళ్లడంతో ఇరువర్గాలకు మధ్య తోపులాట జరిగింది. పోలీసులు లాక్కునేందుకు ప్రయత్నించినా.. రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను బీజేవైఎం కార్యకర్తలు దహనం చేశారు. అటు, బీజేపీకి పోటీగా ఆందోళనకు దిగింది కాంగ్రెస్ పార్టీ. రాహుల్‌పై మోదీ వ్యాఖ్యలను నిరసిస్తూ.. బీజేపీ కార్యాలయాన్ని ముట్టడించేందుకు బయల్దేరారు యూత్ కాంగ్రెస్ నేతలు. దీంతో గాంధీభవన్ ఎదుట బారికేడ్లు పెట్టి.. వారిని పోలీసులు అడ్డుకున్నారు. దీంతో, రెండు పార్టీల ఆఫీసుల దగ్గర తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. రాహుల్ క్షమాపణ చెప్పాలంటూ బీజేవైఎం డిమాండ్ చేస్తుంటే.. మోదీ క్షమాపణ చెప్పాలంటూ యూత్ కాంగ్రెస్ నేతలు పట్టుబడుతున్నారు. ఇరు వర్గాలను పోలీసులు అక్కడి నుంచి పంపించే ప్రయత్నం చేశారు. దీంతో వాతావరణం సర్దుమణిగింది.



## పదవి కాలం ముగిసిన సేవా కార్యక్రమాలు కొనసాగిస్తా..

### జడ్పీటీసీ దశరథ్ నాయక్

**విశ్వంభర, ఆమనగల్లు :** కడ్తాల్ మండలం కేంద్రంలో గురువారం జడ్పిటిసి జర్పుల దశరథ్ నాయక్ నివాసంలో జెడ్పిటిసిగా పదవీకాలం పూర్తి చేసుకున్న సందర్భంగా వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. వారిని వివిధ పార్టీల నాయకులు శాలువాలతో పూలమాలతో సన్మానించారు. తన కుమారుడు పేరుమీద రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ నెలకొల్పి ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నానని పదవి కాలం ముగిసిన కూడా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తానని అన్నారు. బుధవారం రాత్రి కడ్తాల్ మండలం రేఖ్యా తండా గ్రామపంచాయతీకి చెందిన వాడిత్య గమ్లి మరణించారు వారి కుటుంబ సభ్యులకు ఐదు వేల రూపాయల అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆనంద్, హరిచందు నాయక్, ప్రియా రమేశ్ తదితర నాయకులు పాల్గొన్నారు.



## దీనదయాల్ వాఖ్యలను వెనక్కి తీసుకోవాలి

### సూదగాని లక్ష్మయ్య గౌడ్

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** మండలంలోని కూరేళ్ల గ్రామంలో కాంగ్రెస్ నేత, అనుభవ గ్రామీణ వైద్యుడు, సుశ్రుత గ్రామీణ వైద్యుల సంఘం జిల్లా కార్యవర్గ సభ్యుడు సూదగాని లక్ష్మయ్య గౌడ్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గ్రామీణ వైద్యులకు, ఆర్ఎంపీ వైద్యులకు గుర్తింపు కోసం సిఫార్సులా అంటూ హేళనగా మాట్లాడిన ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ దీన దయాల్ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని, ఇలాంటి వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. గ్రామీణ వైద్యులకు ప్రభుత్వం గుర్తింపు ఇవ్వాలని ప్రొ.కోదండరామ్ సహకారంతో ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహని మర్యాద పూర్వకంగా కలిసి గ్రామీణ వైద్యులకు, ఆర్ఎంపి లకు గుర్తింపు పత్రాలను ఇవ్వాలని అన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న తనిఖీలను, దాడులను ఆపాలని గ్రామీణ వైద్యులకు మద్దతుగా నిలిచిన కోదండరాంని కూడా కించపరుస్తూ మాట్లాడడం వారి విజ్ఞతకే వదిలేస్తున్నాని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పేద ప్రజలకు నిరంతరం వైద్య సేవలు అందిస్తున్న గ్రామీణ వైద్యులను ప్రభుత్వం గుర్తించి వారిని కాపాడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, మంత్రులను, శాసన సభ్యులను, శాసన మండలి సభ్యులకు విజ్ఞప్తి చేశారు.

# విశిష్ట హాస్పటల్ ప్రారంభం




**విశ్వంభర, వనస్థలిపురం :** హైదరాబాద్ వనస్థలిపురం వైదేహినగర్ కాలనీలో బుధవారం విశిష్ట హాస్పటల్‌ను ప్రారంభించారు. హాస్పటల్‌లో అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని నిర్వాహకులు తెలియజేశారు. 24 గంటలు ప్రజలకు అవసరమైన వైద్య సేవలను నాణ్యమైన పద్ధతిలో అతి తక్కువ ఖర్చుతో సేవలు అందించనున్నట్లు ఆస్పత్రి డా. పూజల వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రజలు తమ ఆసుపత్రి వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమంలో యాజమాన్యం డా.పూజల వెంకటేశ్వర్లు, డా. మైసగోని అనిల్ కుమార్, బైకాని లింగస్వామి తో పాటు వివిధ పార్టీల నాయకులు, చల్లూరి మురళీధర్ రెడ్డి, పవన్ మల్లాడి, మునగాల రమణరెడ్డి, దీపావళి బాలు, మహేందర్, ముత్యాల ప్రభాకర్ రెడ్డి, గుత్తా రవీందర్ రెడ్డి, వివిధ ఆసుపత్రుల డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# దొడ్డి కోమురయ్య సేవలు మరువలేనివి



**విశ్వంభర, నారాయణపూర్ :** సంస్థాన్ నారాయణపురం మం డల కేంద్రంలో కురుమ యువ చైతన్య సమితి అధ్యక్షుడు మంగ మల్లేష్ కురుమ ఆధ్వర్యంలో దొడ్డి కొమురయ్య కురుమ 78వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈ సం దర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిం చి వారు మాట్లాడుతూ కొమరయ్య చేసిన సేవలను కొని యాడారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు గణం అంజయ్య, కేవైసి మండల ప్రధాన కార్యదర్శి కోడూరి అశోక్, కోశాధికారి మంగ పర్వతాలు, ఉపాధ్యక్షులు బర్లా నరసింహ, చెరుకుపల్లి బీరయ్య, చెరుకుపల్లి నరసింహ, నర్రి నరసింహ, కోడూరి బీరయ్య, కందాల ఎల్లయ్య, కోడూరి నరసింహ, చెరుకుపల్లి లింగస్వామి, బర్ల శ్రీశైలం, నర్రి ఎట్టయ్య, బర్ల మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## దొడ్డి కొమురయ్యకు ఘన నివాళి



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండల కేంద్రంలో గురువారం కురుమ సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఘనంగా పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కోరే భిక్షపతి, మాజీ అధ్యక్షులు కోరే బీరయ్య, మాజీఉపాధ్యక్షులు మజ్జిగ నరసయ్య, కురుమ సంఘం అధ్యక్షులు మజ్జిగ రాంబాబు, ఉపాధ్యక్షులు మజ్జిగ మల్లయ్య, ప్రధాన కార్యదర్శి బండ శివాజీ, కోశాధికారి కంబాలపల్లి మల్లయ్య, కార్యవర్గ సభ్యులు జట్ట చిరంజీవి, కురుమ కులస్తులు జిట్ట యాదగిరి, సోమయ్య, మల్లెల క్రాంతి, మజ్జి అశోక్ పాల్గొన్నారు.

# జడ్పీ చైర్మన్ ఆత్మీయ వీడ్కోలు సమావేశం




**విశ్వంభర, వరంగల్ :** హనుమకొండ జిల్లా పరిషత్తులో సీఈవో అధ్యక్షతన జడ్పీ చైర్మన్ సుధీర్ కుమార్ జడ్పిటిసిలకు ఆత్మీయ వీడ్కోలు సన్మాన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో చైర్మన్ సుధీర్ కుమార్ మాట్లాడుతూ.. చేసిన పనుల ద్వారా సమాజంలో గుర్తింపు గౌరవం పొందాలి కానీ.. పదవితో కాదని నీతి నిజాయితి నిబద్ధతతో సేవ చేస్తే ప్రజలలో మంచి పేరు వస్తుందన్నారు. అన్ని బలాల కంటే ప్రజాబలం గొప్పదని అభివృద్ధిలో కీలక పాత్ర పోషించి, విజయవంతంగా పదవీ కాలాన్ని పూర్తి చేసిన అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో మండల పరిధిలోని అనేక గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేసామని. ప్రజా జీవితంలో ఒకసారి నిలిచిన తర్వాత అధికారం ఉన్నా లేకపోయినా ప్రజల కోసం పని చేసేటోళ్లే నిజమైన రాజకీయ నాయకులన్నారు. భవిష్యత్తులో ఇంకా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. రాజకీయ నాయకులు ప్రజలకు సేవ చేస్తూ.. రాజకీయ ప్రస్థానంలో మరెన్నో ఉన్నతమైన పదవులు పొందుతూ.., పదవులకు వన్నె తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ జడ్పీటీసీలు జడ్పీ పాలకమండలి తదితరులు పాల్గొన్నారు.

# అయిలన్నకు మంత్రి పదవి ఇవ్వాలి

**పాదయాత్ర చేపట్టిన ఖప్రాయిపల్లి కాంగ్రెస్ పార్టీ నాయకులు**




**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలం ఖప్రాయపల్లి గ్రామంలో గురువారం ప్రభుత్వ విప్ ఆలేరు శాసన సభ్యులు బీర్ల ఐలయ్యకి మంత్రి పదవి ఇవ్వాలని కోరుతూ ఖప్రాయిపల్లి నుంచి యాదగిరిగుట్ట వరకు కాంగ్రెసు పార్టీ నాయకులు కార్యకర్తలతో కలిసి పాదయాత్ర చేపట్టినట్లు ఖప్రాయిపల్లి కాంగ్రెస్ పార్టీ నాయకులు సామ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరోనా కష్టకాలంలో అయిలన్న అన్ని తానై అధికారం లేకపోయినా తన బీర్ల ఫౌండేషన్ తరపునా గడప గడపకు నిత్యావసర సరుకులు, ఉచిత ఆంబులెన్స్, గ్రామాలలో వాటర్ ఫిల్టర్‌లు మొదలైన సౌకర్యాలు కల్పించిన గొప్ప మనసున్న బహుజన బడుగు బలహీన వర్గాల నాయకుడు అన్నారు. బీర్ల అయిలయ్యకి అధిష్టానం మంత్రి పదవి ఇవ్వాలని కోరుతూ తమ గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలతో కలిసి ఖప్రాయిపల్లి నుంచి యాదగిరి గుట్ట లక్ష్మీ నరసింహ స్వామి వరకు పాదయాత్ర చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ముద్దసాని సిద్దులు, కట్టెకోల హన్మంతు గౌడ్, బాషబోయిన పాపయ్య, బండ అయిలయ్య తదితరులు పాల్గొన్నారు.

## మండల ప్రజా పరిషత్ ప్రత్యేక అధికారిగా రాజారామ్



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండల ప్రజా పరిషత్ ప్రత్యేక అధికారిగా జిల్లా మత్స్య శాఖ అధికారి ఎం రాజారామ్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీఓ జులూరు పద్మావతి, సూపరింటెండెంట్ వెల్మినేటీ లోకేశ్వర్ రెడ్డి, ఉపాధి హామీ ఏపీఓ బోడిగే రమేష్, సీనియర్ అసిస్టెంట్ కృష్ణ ప్రసాద్, జూనియర్ అసిస్టెంట్ నరేష్, ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావుని ఎర్రవెల్లి ఫామ్ హౌస్‌లో ఆత్మకూరు(ఎం)మండల బీఆర్ఎస్వీ ఉపాధ్యక్షుడు ఏనూతూల వంశీకృష్ణ గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు.

**– విశ్వంభర, ఆత్మకూరు(ఎం)**



## ఇళ్ల పంపిణీపై ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం?

- ఎన్నికల హామీల అమలుకు కసరత్తు
- కేంద్రంతో సమాలోచనలు
- త్వరలో కేంద్ర ప్రభుత్వంతో కార్యాచరణ
- చంద్రబాబు మోదీతో మంతనాలు?

**విశ్వంభర, విజయవాడ:** పేద వాడికి సొంతింటి నిర్మాణం కల. తిండి, బట్ట, నీడనిచ్చే ఇల్లు ఉండాలనేది ప్రతి ఒక్కరి ఆశయం. ఇందులో భాగంగానే ప్రభుత్వాలు మారుతున్న ప్రజల తలరాతలు మాత్రం మారడం లేదు. సొంతింటి నిర్మాణం కలగానే మిగులుతోంది. ఎన్నికల ప్రచారాస్త్రంగా మిగులుతోంది. దీంతో ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సీఎం చంద్రబాబు కార్యాచరణకు శ్రీకారం చుడుతున్నారు. ఢిల్లీ పర్యటన సందర్భంగా ప్రధాని మోదీని కలిసి ఇళ్ల పంపిణీపై చర్చించారు. పేదవాడి కల నెరవేర్చే విధంగా పథకం తీసుకురావాలని సూచించారు. దీనికి ప్రధాని కూడా ఓకే చెప్పినట్లు సమాచారం. తమకు అధికారం కట్టబెట్టిన ప్రజల రుణం తీర్చుకునే విధంగా పథకం రూపకల్పనకు తుది మెరుగులు దిద్దుతున్నారు. ఎలాంటి ఖర్చు లేకుండా పేదవారికి ఇళ్లు కట్టి ఇచ్చే పథకం తీసుకొచ్చేందుకు కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే అధికార యంత్రాంగం ఇందులో నిమగ్నమైపోయారు. దీనికి సంబంధించిన తుది మెరుగులు దిద్దుతున్నారు. పథకం రూపురేఖలు, అమలు బాధ్యతను ప్రభుత్వమే తీసుకోనుందని సమాచారం. గత ప్రభుత్వం చేసిన తప్పులు చేయకుండా ప్రజలకు నిజాయితీగా లాభం చేకూర్చే విధంగా ముందుకు వెళ్లనున్నట్లు తెలుస్తోంది. దీని కోసం నిధులు, విధులు తదితర వాటిని లెక్కలోకి తీసుకుని వాటిని ఎలా సమకూర్చుకోవాలనే దానిపై కూడా నిర్ణయం తీసుకోనున్నట్లు చెబుతున్నారు.

ఎన్డీయే భాగస్వామ్య పార్టీగా టీడీపీ మంచి పాలన అందించడమే ధ్యేయంగా ముందుకు కదులుతోంది. దీని కోసమే అహర్నిశలు పాటుపడుతోంది.



## ఇక మీదట ఉచితంగా ఇసుక


- అక్రమాలకు చెక్
- అడ్డదారుల్లో రవాణా కుదరదు
- నిబంధనలు సవరించిన ప్రభుత్వం
- ప్రజలకు అందుబాటులోనే..

**విశ్వంభర, విజయవాడ:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. ఇన్నాళ్లు ఇసుక అక్రమ రవాణా ద్వారా వైసీపీ ప్రభుత్వం కోట్లాది రూపాయలు కొల్లగొట్టింది. దీనిపై టీడీపీ దిద్దుబాటు చర్యలు చేపడుతోంది. ఇసుక అక్రమ రవాణాకు చెక్ పెట్టాలని యోచిస్తోంది. ఇందులో భాగంగానే ప్రజలకు స్వల్ప ధరలకే అందజేయాలని నిర్ణయించింది. దీంతో ఇసుక రవాణాలో ఉన్న లోటుపాట్లను సవరిస్తోంది. గతంలో టన్ను ఇసుకకు రూ. 475 ధర నిర్ణయించారు. రూ. 100 లు కాంట్రాక్టర్, తవ్వకాలు, రవాణా ఖర్చులకు తీసేవారు. మిగతా రూ.375 ప్రభుత్వానికి చేరేవి. కానీ ఇప్పుడు అలా కాదు నిబంధనలు సవరించింది. టన్ను ఇసుకకు ర. 88 మాత్రమే వసూలు చేయాలని కొత్తగా రూల్స్ తీసుకొచ్చింది. సీనరేజ్ చార్జీ కింద తీసుకునే రూ. 88 టన్నుకు నేరుగా జిల్లా, మండల పరిషత్, పంచాయతీలకు వెళ్తుంది. జిల్లా ఖనిజ నిధి కింద రూ. 19.80 చొప్పున వసూలయ్యే మెత్తం రీచ్ ప్రాంత డెవలప్ మెంట్ కు జిల్లా ఖాతాలోకి వెళ్తుంది. ఇలా ఇసుక అక్రమాలకు చెక్ పడనుంది. ఇన్నాళ్లు ఇసుక దందాలో అడ్డదారుల్లో అడ్డగోలుగా సంపాదించుకున్న వారి ఆటలు కట్టించేందుకే సర్కారు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. వైసీపీ ప్రభుత్వం ఇసుక దందా మాటున రూ. కోట్లు కొల్లగొట్టిందనేది జగమెరిగిన సత్యమే. జగన్ అక్రమాలకు అంతు లేకుండా పోవడంతోనే అతడిని పక్కన పెట్టినట్లు సమాచారం. ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వం ఆ తప్పులు చేయకుండా ఉండటానికే కొత్త నిబంధనలు అమల్లోకి తీసుకొచ్చింది. పేదవారికి అన్యాయం జరగకుండా చూడటమే తమ ప్రభుత్వ లక్ష్యమని సీఎం చంద్రబాబు చెబుతున్నారు.

## జగన్‌కు గొడవ పెట్టుకోవడమే ముఖ్యం

**హోంశాఖ మంత్రి అనిత సంచలన వ్యాఖ్యలు**

**విశ్వంభర, విశాఖపట్నం :** ఈవీఎం ధ్వంసం, హత్యాయత్నం కేసులో అరెస్ట్ అయి నెల్లూరు సెంట్రల్ జైలులో ఉన్న మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి కలవడంపై హోంమంత్రి అనిత ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఈవీఎం పగులగొట్టి మాజీ ఎమ్మెల్యే జైలుకు వెళ్తే ఆయన్ను పరామర్శ చేయడానికి జగన్ రూ. 25 లక్షలు ఖర్చు పెట్టి మరీ వెళ్ళారని ఎద్దేవా చేశారు. ప్రతిపక్షంలోకి వచ్చాక జైల్లో ఉన్న పిన్నెల్లిని హెలికాప్టర్‌లో వెళ్లి మరీ పరామర్శించారన్నారు. ములాఖత్‌లు ముగిసిన తర్వాత కూడా మానవతా దృక్పథంతో జగన్‌కు అనుమతి ఇచ్చామన్ని చెప్పుకొచ్చారు. అనుమతి వచ్చే అవకాశం లేదని తెలిసి కూడా జగన్ వెళ్లారంటే గొడవ పెట్టుకోవడానికే అని మండిపడ్డారు. జైలు నుంచి బయటకొచ్చిన



జగన్ ఏదేదో మాట్లాడారన్నారు. ములాఖత్‌ల పై జైళ్ల ఐజీ నుంచి కూడా నివేదిక తెప్పించుకుని పరిశీలిస్తామన్నారు. తనపైప కూడా గత ప్రభుత్వం అట్రాసిటీ కేసులు పెట్టిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో అక్రమంగా పెట్టిన కేసులపై విచారణ చేస్తామని తెలిపారు. న్యాయపరంగా చర్చించి నిర్ణయం తీసుకుంటామని హోంమంత్రి అనిత వెల్లడించారు.

# రికార్డుల దగ్ధంపై పవన్ ఆగ్రహం

- బాధ్యులపై కఠిన చర్యలుంటాయని హెచ్చరిక
- సమగ్ర విచారణకు ఆదేశం





**విశ్వంభర, విజయవాడ :** విజయవాడలోని కృష్ణా కరకట్టపై పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ రికార్డుల దగ్ధం చేసిన ఘటనపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దగ్ధం చేసిన ఫైల్స్, రిపోర్టులకు సంబంధించిన వివరాలను వెంటనే అందించాలని అధికారులను ఆదేశించారు. దీని వెనుక ఎవరున్నారనే అంశాలపై ఆరా తీసిన ఆయన.. బాధ్యులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు. 'అసలు పీసీబీ కార్యాలయాల్లో ఫైల్స్, రిపోర్టులు ఏ మేరకు భద్రంగా ఉన్నాయి. భద్రపరిచేందుకు అనుసరిస్తోన్న విధానాలు ఏంటో వెల్లడించాలి.' అని అధికారులకు నిర్దేశించారు. మరోవైపు, ఈ ఘటనపై ప్రభుత్వం పూర్తి స్థాయి విచారణకు ఆదేశించింది. రికార్డుల దగ్ధం ఘటనను తీవ్రంగా పరిగణించిన ప్రభుత్వం.. కాగితాలతో పాటు కంప్యూటర్ హార్డ్ డిస్కులు, గుర్తింపు కార్డులు కూడా ఉండడంపై సీరియస్ అయ్యింది. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది.

### అసలేం జరిగిందంటే ?

కృష్ణా జిల్లా పెనమలూరు నియోజకవర్గంలోని పెదపులిపాక వద్ద నిర్మానుష్యం ప్రదేశంలో బుధవారం రాత్రి 9 గంటల ప్రాంతంలో కారులో వచ్చిన దుండగులు కరకట్టపై బస్తాల్లోని దస్త్రాలను తగలబెట్టడం మొదలుపెట్టారు. ఈ వాహనంపై ప్రభుత్వ వాహనం అనే స్టిక్కర్ ఉంది. అక్కడే ఉన్న స్థానికులు ఏం తగలబెడుతున్నారని ప్రశ్నించారు. అవి ప్రభుత్వ దస్త్రాలని గుర్తించారు. దీనిపై పోలీసులకు సమాచారం ఇచ్చారు. వాటిపై మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఫొటోలు ఉండటంతో ఆ దస్త్రాలు తీసుకొచ్చిన కారు డ్రైవర్‌ను వెంబడించి పట్టుకుని పోలీసులకు అప్పగించారు. అవన్నీ పొల్యుషన్ కంట్రోల్ బోర్డుకు సంబంధించిన దస్త్రాలని డ్రైవర్ తెలిపాడు. అటుగా వెళ్తున్న ఓ టీడీపీ కార్యకర్త దీన్ని గమనించి.. దస్త్రాలపై మాజీ మంత్రి పెద్దిరెడ్డి, పీసీబీ మాజీ ఛైర్మన్ సమీర్ శర్మ చిత్రాలు ఉండడంతో వెంటనే విషయాన్ని పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్, టీడీపీ నేతలకు సమాచారం ఇచ్చారు. కాలుష్య నియంత్రణ మండలి, ఏపీ ఖనిజాభివృద్ధి సంస్థలకు చెందిన బస్తాల కొద్దీ దస్త్రాలను దగ్ధం చేశారు. వీటిల్లో కొన్ని హార్డ్ డిస్కులు, సీఎంవోకు చెందిన పత్రాలు సైతం ఉన్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. పరారయ్యేందుకు యత్నించగా పట్టుకున్న డ్రైవర్ నాగరాజును గట్టిగా నిలదీయడంతో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఛైర్మన్ సమీర్‌శర్మ సూచనలతోనే ఈ ఫైళ్లు తగులబెట్టినట్లు అంగీకరించాడు. అయితే, దగ్ధం చేసిన ఫైళ్లలో కీలక సమాచారం ఉందని టీడీపీ నేతలు చెబుతున్నారు. గతంలో పెద్దిరెడ్డి మంత్రిగా ఉన్నప్పుడే రాష్ట్రంలో విలువైన ఖనిజ సంపద దోపిడీకి గురైందని విమర్శించారు. ఇసుక తవ్వకాలపై సీఎం సమీక్ష నిర్వహించిన మరుసటి రోజే కీలక దస్త్రాలు తగులబెట్టడం అనుమానాలకు తావిస్తోందని అంటున్నారు.

### వారి పాత్రపై చర్చ

మరోవైపు, దస్త్రాల దహనం ఘటనకు సంబంధించి పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మాజీ ఛైర్మన్ సమీర్ శర్మ, ఓఎస్డీ రామారావు పాత్ర ఉందంటూ ఎక్సైజ్ శాఖ వర్గాల్లో తీవ్ర చర్చ జరుగుతోంది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో రంగంలోకి దిగిన పోలీసులు ఓఎస్డీ రామారావును విచారణకు పిలిచారు. ఎక్సైజ్ శాఖలో రామారావు సుదీర్ఘకాలం పని చేశారు. కొత్త ప్రభుత్వంలో ముఖ్యులకు తాను ఓఎస్డీగా వెళ్తున్నట్లు కొంతకాలంగా ఆయన అందరితో చెప్పుకొంటున్నట్లు తెలుస్తోంది. డిప్యూటీ సీఎం పవన్ సహా మరికొందరు మంత్రులకు తాను సన్నిహితుడినని ప్రచారం చేసుకుంటున్నట్లు అంతటా చర్చ సాగుతోంది. ఎక్సైజ్ శాఖలో ఉద్యోగుల బదిలీలు, ఆర్వోఆర్ విషయాల్లో అక్రమాలకు తెర లేపారనే ఆరోపణలు ఉన్నాయి.

# దటీజ్ పవన్ కల్యాణ్?

- సినిమాల్లోనే ఆయన హీరోయిజం చూశాం
- నిజ జీవితంలో కూడా ఆయన స్టైలే వేరు
- ప్రజాభిమానం చూరగొనడంలో అందెవేసిన చేయి
- నిక్కచ్చిగా మాట్లాడటం నైజంగా మారిన వైనం



**విశ్వంభర, పిఠాపురం:** పవర్ స్టార్ పవన్ కల్యాణ్ అంటే ఏంటో మనకు తెలుసు. ఆయన అలవాట్లు, మాటలు సినిమాల్లో ఎలాగుంటాయో బయట కూడా అలాగే ఉంటాయి. తనకు కావాల్సిన విషయాన్ని సూటిగా చెప్పడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య. ఎంత పెద్ద మాట అయినా తనదైన స్టైల్లో వెల్లడించడం పుట్టుకతో వచ్చిన ఓ మంచి అలవాటుగా చెబుతారు. ఇటీవల కాలంలో పిఠాపురంలో చాలా మంది ఎమ్మెల్యే గారి తాలూకా అంటూ బోర్డులు పెట్టుకుని తిరగడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. పోలీసులు పట్టుకుంటే తనది బాధ్యత కాదని సెలవిచ్చారు. తప్పు చేసిన వారెవరైనా చట్టానికి అతీతులు కారు. ఎంతటి వారైనా శిక్షార్హులే. వాహనాల మీద ఎమ్మెల్యే గారి తాలూకా అని బోర్డు పెట్టుకుని విచ్చలవిడి వేగంతో వెళితే ఎవరు సమాధానం చెబుతారు? పోలీసులు ఆపితే ఏంటి పరిస్థితి. బైక్ రైడింగ్ చేయాలంటే మైదాన ప్రాంతాలకు వెళ్లి ఎవరు లేని చోట చేసుకుంటే బాగుంటుంది. అంతేకాని జనారణ్యంలో బైక్‌లు వేగంగా నడుపుతూ ప్రజలకు భంగం కలిగిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని తేల్చారు. తన పేరు చెప్పి తనకు చెడ్డ పేరు తీసుకువచ్చే వారు అవసరం లేదన్నారు. మంచి పనులు చేస్తూ పదిమందిలో మంచి వారిగా గుర్తింపు పొందే వారే మనకు కావాలని సూచించారు. పవన్ కల్యాణ్ అలా సుతిమెత్తగా వారికి హెచ్చరికలు పంపారు. పిఠాపురంలో ఇటీవల కాలంలో చాలా మంది ఇలా రాసుకుని తిరగడంతో తన ప్రతిష్ట గంగలో కలుస్తుందని వాపోయారు. ఇకనైనా అటువంటి పనులు మానుకుంటే మంచిదని హితవు పలికారు.



## చిటికెనకు చేనేత సంఘం సన్మానం

**విశ్వంభర, సిరిసిల్ల :** వస్త్రోత్పత్తిలో రాష్ట్రంలోనే దశాబ్దాల చరిత్ర కలిగిన సిరిసిల్ల చేనేత వస్త్ర వ్యాపార సంఘం బుధవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో పలు జాతీయ అంతర్జాతీయ అవార్డుల గ్రహీత, ప్రముఖ సాహితీవేత్త, విమర్శకులు డాక్టర్ చిటికెన కిరణ్ కుమార్‌ను వస్త్ర వ్యాపార సంఘం అధ్యక్షులు తాటిపాముల దామోదర్ శాలువా జ్ఞాపికతో ఘనంగా సన్మానించారు. సంఘ బాధ్యులు మాట్లాడుతూ.. జాతీయ, అంతర్జాతీయంగా రచనల ద్వారా సిరిసిల్ల పేరు ప్రఖ్యాతులను, కీర్తి ప్రతిష్టలను చిటికెన కిరణ్ కుమార్ ఉన్నత స్థానంలో నిలుపుతున్నాడని, అందరూ గర్వించదగ్గ విషయం అని శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి గౌడ రాజు, ఉపాధ్యక్షులు ఏనుగుల ఎల్లయ్య, శ్రీగాద విష్ణు, సాప భగవాన్, పారిశ్రామికవేత్తలు చిలుక సత్యం, చిటికెన వెంకటేశం, ఏనుగుల లక్ష్మణ్, గౌడ కిరణ్, ఎల్దండి శ్రీనివాస్, పురప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

## సర్వేనెంబర్ 126 ప్రభుత్వ భూమిని కాపాడాలి

**విశ్వంభర, చివ్వెంల :** కుడ కుడ గుట్ట చుట్టూ గల సర్వేనెంబర్ 126 లో ప్రభుత్వ భూమిని కాపాడాలని తెలంగాణ జన సమితి మండల అధ్యక్షులు ధారావత్ సుమన్ నాయక్ కోరారు. ప్రభుత్వ భూమిని కాపాడాలని అర్హులైన పేదలకు ఇవ్వాలని కోరుతూ తెలంగాణ జన సమితి నాయకులతో కలిసి ఆయన గురువారం తహసిల్దార్ కృష్ణయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సుమన్ నాయక్ మాట్లాడుతూ.. జీవో నెంబర్ 58 ,59 పేరుతో కొంతమంది అక్రమార్కులు లేనివి ఉన్నట్లుగా చూపించి రెగ్యులర్ చేయించుకున్నారని అలా ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టించిన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని, ఇచ్చినటువంటి రెగ్యులరైజేషన్ పట్టాలను తక్షణమే రద్దు చేసి ఆ భూమిని వెంటనే ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జన సమితి జిల్లా నాయకులు మల్సూర్ నాయక్, వినయ్ గౌడ్, యాకూబ్, సతీష్ పాల్గొన్నారు.



## ఆ ఊరికి నిజంగానే చేతబడి చేస్తున్నారా?

- భయపడుతున్న గ్రామస్తులు
- 15 రోజులుగా ఆందోళన
- మొలలు కొడుతుండటంతో వణికిపోతున్న ప్రజలు

**పల్నాడు, విశ్వంభర:** మనిషి కంప్యూటర్ కాలంలో కూడా మూఢ నమ్మకాలకు భయపడుతున్నాడు. సాంకేతిక పెరిగినా భయాందోళన మాత్రం తగ్గడం లేదు. ఫలితంగా వారి బలహీనతను ఆధారంగా చేసుకుని ఎవరో చేస్తున్న పనికి ఊరంతా ఉలిక్కిపడుతోంది. మంత్రాలు, చేతబడి చేస్తున్నారనే ఉద్దేశంతో నిద్రాహారాలు మాని కళ్లల్లో వత్తులు వేసుకుని మరీ కాపలా కాస్తున్నారు. దీంతో టెక్నాలజీ కాలంలో కూడా ఇలాంటి నమ్మకాలు ఇబ్బందులకు గురి చేయడం గమనార్హం. పల్నాడు జిల్లా చినతురకపాలెం గ్రామంలో గత పదిహేను రోజులుగా చేతబడి భయం వెంటాడుతోంది. ఊరిలోని చెట్లు, గోడలకు మేకులు కొట్టడంతో ఏం జరుగుతోందో తెలియడం లేదు. గోడలకు కొట్టిన మేకులు తొలగించడానికి కొందరు మసీదు పెద్దలను తీసుకొచ్చి పూజలు చేసి తీసేయించుకుంటున్నారు. చెట్లకు కూడా మేకులు కొట్టడంతో వాటిని కొట్టేస్తున్నారు. గ్రామంలోని ప్రధాన వీధుల వద్ద కూడా నిమ్మకాయలు, పసుపు, కుంకుమ చల్లిన ఘటనలు చోటుచేసుకోవడంతో గ్రామస్తులు బెంబేలెత్తిపోతున్నారు. ఇదంతా ఎవరు చేస్తున్నారు? ఎందుకు చేస్తున్నారు? వారి ఉద్దేశం ఏమిటనే దానిపై అందరిలో చర్చ జరుగుతోంది. కానీ నిందితులు మాత్రం దొరకడం లేదు. దీంతో దీనిపై అందరిలో ఒకటే ఆందోళన. ఇదంతా చేస్తోంది ఎవరో ఆకతాయిలు తప్ప వేరే ఎవరు కాదనే విషయం తెలిసినా వారి ఆచూకీ మాత్రం లభించడం లేదు. దీనికి కారణమైన వారిని గుర్తించి పోలీసులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## జగన్ జైలుకెళ్లే సమయం ఆసన్నమైంది

- మంత్రి రాంప్రసాద్ రెడ్డి సంచలనం
- ఐదేండ్లుగా తప్పించుకున్నాడంటూ వ్యాఖ్యలు

**విశ్వంభర, విశాఖపట్నం :** మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ జైలుకు వెళ్లే సమయం ఆసన్నమైందని ఏపీ రవాణాశాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. చేసిన తప్పులను కప్పిపుచ్చుకోవడానికి ఐదేండ్ల పాటు ముఖ్యమంత్రిగా తప్పించుకున్నావని, ఇక ఏ పదవి లేనందున జైలుకు వెళ్లడం ఖాయమని ఆరోపించారు. మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని జైలులో వైఎస్ జగన్ గురువారం మిలాఖతయ్యారు. అనంతరం చంద్రబాబుపై జగన్ చేసిన వ్యాఖ్యలపై మంత్రి స్పందించారు. రాష్ట్రంలోని 16 శాతం మంది ఓటర్లు టీడీపీ, బీజేపీ, జనసేనకు అధికంగా ఓటేసి గెలిపించిన విషయాన్ని గుర్తుపెట్టుకోవాలని సూచించారు. ప్రజల్లో సానుభూతి సంపాధించుకోవడం కోసం అధికార పార్టీపై తప్పుడు ఆరోపణలు మానుకోవాలని సూచించారు. 21 రోజుల్లోనే ప్రభుత్వం ఏమీ చేయలేదని జగన్ మాట్లాడటం సిగ్గుచేటని ఆరోపించారు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ఇచ్చిన హామీలు తూచ తప్పకుండా అమలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.



# జార్ఖండ్ సీఎంగా హేమంత్ సోరెన్

**• మూడోసారి ప్రమాణం చేసిన సీఎం • త్వరలోనే మంత్రివర్గ విస్తరణ**

**విశ్వంభర, జార్ఖండ్ :** జార్ఖండ్ ముఖ్యమంత్రిగా హేమంత్ సోరెన్ గురువారం ప్రమాణస్వీకారం చేశారు. రాజ్‌భవన్‌లో గవర్నర్ సీవీ రాధాకృష్ణన్ సోరెన్‌తో ప్రమాణస్వీకారం చేయించారు. అంతకు ముందు ఆయనను కూటమి నేతలు లెజిస్లేటివ్ పార్టీ నేతగా ఎన్నుకున్నారు. చంపై సోరెన్ బుధవారం సీఎం పదవికి రాజీనామా చేశారు. గవర్నర్‌ను కలిసి ఆయనకు రాజీనామా పత్రాన్ని అందజేశారు. ఆ తర్వాత హేమంత్ సోరెన్‌ను ప్రభుత్వ ఏర్పాటుకు గవర్నర్ ఆహ్వానించారు. సోరెన్ సీఎంగా ప్రమాణం ప్రమాణం చేయడం ఇది మూడోసారి. కేవలం సోరెన్ మాత్రమే ప్రమాణస్వీకారం చేయగా.. త్వరలోనే మంత్రివర్గ విస్తరణ జరుగనున్నది. ఆ తర్వాత మంత్రులు ప్రమాణస్వీకారం చేయనున్నారు. సీఎం పదవి నుంచి వైదొలిగిన చంపై సోరెన్ ఇకపై కోఆర్డినేషన్ కమిటీకి చైర్మన్‌గా వ్యవహరించారనున్నారు. నిన్న జరిగిన జార్ఖండ్ ముక్తి మోర్చా సమావేశంలో శాసన సభాపక్ష నేతగా హేమంత్ సోరెన్‌ను నియమించాలని నిర్ణయించారు. కాంగ్రెస్ జార్ఖండ్ ఇన్‌చార్జి గులాం అహ్మద్ మీర్‌తో పాటు రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్ ఠాకూర్, హేమంత్ సోరెన్ సోదరుడు బసంత్ సోరెట్, భార్య కల్పనా సోరెన్ సమావేశానికి హాజరయ్యారు. భూ కుంభకోణం కేసులో దాదాపు ఐదునెలల తర్వాత మాజీ సీఎం హేమంత్ సోరెన్ జూన్ 28న జైలు నుంచి విడుదలయ్యారు. ఈ కేసులో ఆయనకు కోర్టు బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే. ఈడీ కేసులో ఆయన జనవరి 31న అరెస్ట్ కాగా.. హేమంత్ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు.

# సోనియాగాంధీతో అంబానీ భేటీ

**కుమారుడి పెళ్లికి రావాలంటూ ఆహ్వానం**



**విశ్వంభర, ఢిల్లీ :** పారిశ్రామిక దిగ్గజం, రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముఖేష్ అంబానీ ఢిల్లీలో కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీని గురువారం ఆమె నివాసంలో కలిశారు. తన కుమారుడు అనంత్ అంబానీ పెండ్లి పత్రికను ఈ సందర్భంగా సోనియాకు అందచేసిన ముఖేష్ అంబానీ ఆమెను వివాహానికి రావాల్సిందిగా ఆహ్వానించారు. జన్‌ఫథ్‌లో సోనియాగాంధీతో ముఖేష్ అంబానీ సమావేశమయ్యారు. ఇక జులై 12న ముంబై బాంద్రాలోని జియో వరల్డ్ కన్వెన్షన్ సెంటర్‌లో అనంత్, రాధిక మర్చంట్ వివాహం అట్టహాసంగా జరగనుంది. ఈ వివాహానికి కనీవినీ ఎరుగని ఏర్పాట్లు చేపట్టారు.

పెండ్లి పత్రికను ఇటీవల నీతా అంబానీ వారణాసిలోని కాశీ విశ్వనాథుడి పాదాల చెంత ఉంచి ప్రత్యేక పూజలు నిర్వ హించారు. అత్యంత ఆర్భాటంగా నిర్వహించే ఈ పెండ్లి వేడుకకు దేశ విదేశాల నుంచి పలువురు ప్రముఖులు హాజరుకానున్నారు.

# ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించే దేశాలను ఏకాకి చేయాలి : జైశంకర్



**విశ్వంభర, అస్తానా :** కజకిస్థాన్ రాజధాని అస్తానాలో 24వ ఎస్‌సీఓ సమ్మిట్ జరుగుతోన్న విషయం తెలిసిందే. ఈ సమావేశానికి మోదీకి బదులుగా కేంద్ర విదేశాంగ మంత్రి జై శంకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ సందేశాన్ని జైశంకర్ చదివి వినిపించారు. తీవ్రవాదం, వాతావరణ మార్పులు, ఆర్థిక అభివృద్ధికి అవసరమైన అంశాలను ఇందులో ప్రస్తావించారు. భారత విదేశాంగ విధానంలో ఎస్‌సిఓకు ప్రముఖ స్థానం ఉందని ఆయన అన్నారు. 2020లో కౌన్సిల్ ఆఫ్ హెడ్స్ ఆఫ్ గవర్నమెంట్ సమావేశానికి అలాగే 2023లో కౌన్సిల్ ఆఫ్ హెడ్స్ ఆఫ్ స్టేట్ సమావేశానికి భారతదేశం ఆతిథ్యం ఇచ్చింది. విదేశాంగ మం త్రి సంస్థ సభ్యుడిగా పాల్గొన్నందుకు ఇరాన్‌ను అభినందిస్తున్నామని జైశంకర్ అన్నారు. హెలికాప్టర్ ప్రమాదంలో రైసీ మరణం పట్ల రాష్ట్రపతి తన ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. దీంతో పాటు అధ్యక్షుడు లుకాషెంకోను అభినందిస్తున్నానని అన్నారు. సంస్థలో కొత్త సభ్యునిగా బెలారస్‌ను స్వాగతిస్తున్నానని పేర్కొన్నారు. మానవత్వానికి వ్యతిరేకంగా జరుగుతున్న సంఘటనలను ప్రతిబింబించడంతో పాటు దాని ప్రభావాన్ని తగ్గించడమే ఈ సదస్సు ఉద్దేశమని జైశంకర్ అన్నారు. ఉగ్రవాదంపై అందరూ ఐక్యంగా పోరాడాలని అన్నారు. SCO ప్రాథమిక లక్ష్యాలలో ఇది ఒకటని అన్నారు. సరిహద్దు ఉల్లంఘన శాంతిభద్రతలకు పెను ముప్పు అని అన్నారు. ఉగ్రవాదాన్ని ఏ రూపంలోనైనా క్షమించలేమన్నారు. ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించి ప్రోత్సహించే దేశాలను అంతర్జాతీయ సమాజం ఏకాకిని చేయాలని విదేశాంగ మంత్రి ఉద్ఘాటించారు. సీమాంతర ఉగ్రవాదంపై నిర్ణయాత్మకంగా స్పందించాల్సిన అవసరం ఉందన్నారు. ఉగ్రవాదంతో పాటు వాతావరణ మార్పులపై కూడా జయ శంకర్ మాట్లాడారు. వాతావరణ మార్పు నేడు ప్రపంచం ఎదుర్కొంటున్న ప్రధాన ఆందోళన అని ఆయన అన్నారు. ప్రత్యామ్నాయ ఇంధనాలకు పరివర్తన, ఎలక్ట్రిక్ వాహనాల వాడకం పెంపు కోసం కృషి చేస్తున్నామన్నారు. భారత్ SCO అధ్యక్షతన డీ-కార్బొనైజేషన్‌పై తీర్మానం ఆమోదించిన విషయాన్ని గుర్తు చేశారు. ఏ ప్రాజెక్టుకైనా కనెక్టివిటీ, మౌలిక సదుపాయాలు అవసరమని ఆయన అన్నారు. ఎలాంటి వివక్ష లేకుండా వాణిజ్య హక్కులు, రవాణా వ్యవస్థ ఉండాలన్నారు. ఈ అంశాలపై SCO తీవ్రంగా చర్చించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. 21వ శతాబ్దం టెక్నాలజీ శతాబ్దమన్న జయశంకర్, టెక్నాలజీని సృజనాత్మకంగా మార్చాలని.. సామాజిక సంక్షేమం, ప్రగతి కోసం ఉపయోగించాలని చెప్పుకొచ్చారు. ఎస్‌సిఓ సదస్సులో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై మాట్లాడుతూ.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై జాతీయ వ్యూహాన్ని సిద్ధం చేసి AI మిషన్‌ను ప్రారంభించే దేశాలలో భారత దేశం ఒకటి అని అన్నారు.



# ప్రధాని మోడీని కలిసిన టీమిండియా

**• శభాష్ అంటూ అభినందించిన పీఎం**
**• క్రికెటర్లతో ప్రత్యేక సంభాషణ**

**విశ్వంభర, ఢిల్లీ :** భారత క్రికెట్ జట్టు ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కలిసింది.. ఈ సందర్భంగా టీ20 వరల్డ్‌కప్ గెలిచిన భారత జట్టును ప్రధాని మోదీ ప్రత్యేకంగా అభినందించారు. టీ20 వరల్డ్ కప్‌తో బార్బడోస్ నుంచి ఢిల్లీ చేరుకున్న టీమిండియాకు ఎయిర్‌పోర్ట్‌లో ఘనస్వాగతం లభించింది. అనంతరం ఐటీసీ మౌర్యా హెూటల్ కు చేరుకున్న క్రికెటర్లు కాసేపు రెస్ట్ అనంతరం.. లోక్‌కల్యాణ్ మార్గ్‌లోని ప్రధాని నివాసానికి చేరుకున్నారు. తన ఇంటికి చేరుకున్న టీమిండియా ప్లేయర్స్ తో ప్రధాని మోదీ సమావేశం అయ్యారు. టీ20 వరల్డ్‌కప్ గెలిచిన భారత జట్టును మోదీ ప్రత్యేకంగా అభినందించారు. బ్రేక్‌ఫాస్ట్ విత్ ఛాంపియన్స్.. కార్యక్రమంలో భాగంగా మోదీ.. క్రికెటర్లతో ప్రత్యేకంగా సంభాషించారు.. టి20 వరల్డ్ కప్‌లో భారత జట్టు ప్రదర్శన.. ఫైనల్ మ్యాచ్ తదితర అంశాలను స్వయంగా అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా మోదీ జట్టు సభ్యులతో కలిసి ఫొటో దిగారు. వరల్డ్ కప్ గెలిచి స్వదేశంలో అడుగుపెట్టిన ఆటగాళ్లందరికీ.. అభిమానులు ఘన స్వాగతం పలికారు.. ఈ సందర్భంగా టీమిండియా క్రికెటర్లు సందడి చేస్తూ కనిపించారు. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, పంత్, సూర్యకుమార్ యాదవ్, సిరాజ్ ఇలా ప్రతి ఒక్కరూ ట్రోఫీతో ఫుల్ జోష్‌లో కనిపించారు. హెూటల్‌లో కేక్ కటింగ్ సెలబ్రేషన్ కూడా గ్రాండ్‌గా జరిగింది..

# 30 మందితో సూపర్ కేబినెట్

**• ప్రకటించిన ప్రధాని నరేంద్ర మోడీ**
**• 25 రోజుల తర్వాత కేబినెట్ కమిటీలు**
**• అత్యధికంగా 8 కమిటీల్లో అమిత్ షా**
**• తెలుగు మంత్రులకు 4 కమిటీల్లో చోటు**



**విశ్వంభర, ఢిల్లీ :** మోదీ హ్యాట్రిక్ నినాదం నిజమైంది. వరుసగా మూడోసారి భారత ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేసిన నరేంద్ర మోదీ.. పూర్తిస్థాయి కేబినెట్‌తో బాధ్యతలను చేపట్టారు. కేబినెట్ ఏర్పడిన 25 రోజుల తర్వాత మోదీ ప్రభుత్వం కేబినెట్ కమిటీలను ప్రకటించింది. 30 మంది కేబినెట్ మంత్రులను వివిధ కమిటీలలో సర్దుబాటు చేసింది. రాష్ట్ర మంత్రులను కూడా 4 కమిటీల్లో ప్రత్యేక ఆహ్వానితులుగా చేర్చారు. అయితే రాజకీయ వ్యవహారాల కమిటీ గురించే ఎక్కువగా చర్చ జరుగుతోంది. ఈ కమిటీలో ప్రధాని నరేంద్ర మోదీతో పాటు 12 మంది సభ్యులుగా ఉన్నారు. ఇది కేబినెట్ కమిటీలలో అత్యంత శక్తివంతమైనదిగా పరిగణిస్తారు. దేశ రాజకీయాలకు సంబంధించిన ప్రధాన నిర్ణయాలను ఈ కమిటీ ప్రతిపాదనపై కేబినెట్ తీసుకుంటుంది. భారత ప్రభుత్వం వ్యాపార కేటాయింపు నియమాలు, 1961 చట్టం ప్రకారం ఈ కమిటీలు పని చేస్తాయి. భారత రాజ్యాంగంలో కేంద్ర మంత్రివర్గం గురించి ప్రస్తావించారు. కానీ ఈ కమిటీలను పేర్కొనలేదు. అందువల్ల కేబినెట్ కమిటీలకు రాజ్యాంగ కమిటీల హెూదా ఉండదు. వ్యాపార నిబంధనల ప్రకారం కేబినెట్ కమిటీలు ఏర్పాటవుతాయి. ఈ వ్యాపార నియమం రాజ్యాంగంలోని ఆర్టికల్ 77(3) ఈ కమిటీలు పని చేస్తాయి. ఇది కేంద్ర మంత్రి మండలి పని తీరును సులభతరం చేయడానికి, కేటాయింపు నియమాలను రూపొందించే హక్కు రాష్ట్రపతికి ఉందని పేర్కొంది. దీని కింద కేబినెట్‌లో అపాయింట్‌మెంట్, సెక్యూరిటీ, పొలిటికల్, పార్లమెంటరీ, స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ గ్రోత్ కమిటీలను ఏర్పాటు చేస్తారు. ఏ కమిటీలో ఏ మంత్రులు ఉండాలో ప్రధాని నిర్ణయిస్తారు. రాజకీయ వర్గాల్లో, ఈ కమిటీని సూపర్ కేబినెట్ అని కూడా పిలుస్తారు. ఎందుకంటే ఈ కమిటీ దేశ రాజకీయాలు, అంతర్గత వ్యవహారాలలో ముసాయిదాలను సిద్ధం చేస్తుంది. సెంట్రల్ సెక్రటేరియట్ ప్రకారం, కేంద్ర, రాష్ట్రాల సమస్యలను పరిష్కరించేందుకు రాజకీయ వ్యవహారాల కేబినెట్ కమిటీ పని చేస్తుంది. సమాఖ్య వ్యవస్థ కారణంగా భారతదేశంలోని వివిధ రాష్ట్రాల్లో వివిధ పార్టీలు అధికారంలో ఉన్నాయి. ఈ రాష్ట్రాల మధ్య సమన్వయం ఏర్పరచి పథకాలను అమలు చేయడమే కేంద్ర ప్రభుత్వ విధి. ఇది కాకుండా, ఏదైనా రాజకీయ లేదా ఆర్థిక సమస్య దేశానికి అంతర్గతంగా హాని కలిగిస్తుందా లేదా అని కూడా ఈ కమిటీ చూస్తుంది. అంతేకాకుండా, ఈ కమిటీ విదేశాలకు సంబంధించిన విధాన విషయాలను అంచనా వేయడానికి కూడా బాధ్యత వహిస్తుంది. సెంట్రల్ సెక్రటేరియట్ జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం, ఈసారి రాజకీయ వ్యవహారాల కమిటీలో ప్రధాని నరేంద్ర మోదీతో సహా మొత్తం 13 మంది సభ్యులు ఉన్నారు. ఈ కమిటీలో ప్రధానితో పాటు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, హెూం మంత్రి అమిత్ షా, రోడ్డు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, ఆరోగ్య మంత్రి జేపీ నడ్డా, వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ ఉన్నారు. వీరితో పాటు చిన్న పరిశ్రమల శాఖ మంత్రి జితన్‌రామ్ మాంఝీ, షిప్పింగ్ మంత్రి సర్బానంద సోనోవాల్, విమానయాన శాఖ మంత్రి కే రామ్మోహన్ నాయుడు, అటవీ శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్, మహిళా అభివృద్ధి శాఖ మంత్రి అనుపూర్ణా దేవి, పార్లమెంటరీ మంత్రి కిరణ్ రిజిజు, బొగ్గు శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి పేర్లు కూడా ఉన్నాయి. రాష్ట్రాల వారీగా చూస్తే, కమిటీలో గుజరాత్, మహారాష్ట్ర నుంచి ఇద్దరు చొప్పున, ఉత్తరప్రదేశ్, బీహార్, అస్సాం, అరుణాచల్, జారండ్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, హిమాచల్, రాజస్థాన్ నుంచి ఒక్కొక్కరు చొప్పున మంత్రులు ఉన్నారు. బీజేపీ కోటా నుంచి 10 మందికి, ఇద్దరు కూటమి భాగస్వాములకు కమిటీలో చోటు కల్పించారు. నిర్మలా సీతారామన్, గిరిరాజ్ సింగ్, మన్సుఖ్ మాండవ్య, ప్రహ్లాద్ జోషిలకు ఈసారి కమిటీలో చోటు దక్కలేదు. కేబినెట్‌లోని మొత్తం ఎనిమిది కమిటీల్లో కేంద్ర హెూంమంత్రి అమిత్ షా ఉన్నారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను 6 కమిటీల్లో చేర్చారు. బీజేపీ జాతీయ అధ్యక్షులు, ఆరోగ్య మంత్రి జెపీ నడ్డా కేవలం రెండు కమిటీలలో మాత్రమే ఉన్నారు. ఆర్థిక వ్యవహారాల కమిటీలో వ్యవసాయ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు చోటు దక్కింది. రోడ్డు నిర్మాణ, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీని 5 కమిటీల్లో చేర్చారు. గృహనిర్మాణం, రాజకీయ, ఆర్థిక, నైపుణ్యం, వృద్ధికి సంబంధించిన కమిటీలలో గడ్కరీని చేర్చారు. జేడీయూ కోటా నుంచి మంత్రిగా పనిచేసిన లాలన్ సింగ్‌కు ఆర్థిక వ్యవహారాలు, పార్లమెంటరీ వ్యవహారాల కమిటీలో చోటు కల్పించారు. టీడీపీకి చెందిన కే రామ్మోహన్ నాయుడు రాజకీయ వ్యవహారాలు, పార్లమెంటరీ వ్యవహారాల కమిటీ సభ్యుడిగా ఉన్నారు. ఇక చిరాగ్ పాశ్వాన్‌ను ఇన్వెస్ట్‌మెంట్ అండ్ గ్రోత్ కమిటీలో స్థానం కల్పించారు.

# 141 మంది పరీక్ష రాస్తే ఒక్కడే పాస్..

**విశ్వంభర, సూరత్ :** తరచూ వివాదాల్లో ఉండే సూరత్‌లోని వీర్ నర్మద్ సౌత్ గుజరాత్ యూనివర్సిటీ (వీఎన్ఎస్‌జీయూ) మరోసారి వార్తల్లో నిలిచింది. మాస్టర్ ఆఫ్ ఆర్ట్స్ ఇన్ ఎకనామిక్స్ (ఎకనామిక్స్) ఎక్స్‌టర్నల్ పరీక్ష ఫలితాలే అందుకు కారణం. ఈ పరీక్షకు 141 మంది విద్యార్థులు హాజరు కాగా.. కేవలం ఒక్కవిద్యార్థే పాస్ అయ్యాడు. మిగిలిన 140 మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారు. ఫలితాలు చూసుకున్న తరువాత విద్యార్థులు షాక్ అయ్యారు. ఇంత మంది విద్యార్థులు ఒకేసారి ఫెయిల్ కావడం అనేది అనేక ప్రశ్నలను లేవనెత్తింది. ప్రశ్నాపత్రం చాలా కఠినంగా ఉందా..? మూల్యాంకన ప్రక్రియలో లోపాలు ఉన్నాయా..? ఏదైన అక్రమం జరిగిందా? అనే ప్రశ్నలు ఉదయించాయి. వీటి అన్నింటికి విశ్వవిద్యాలయం సమాధానం ఇవ్వాల్సి ఉంది. అందుతున్న సమాచారం ప్రకారం.. 192 మంది విద్యార్థులు పరీక్షకు నమోదు చేసుకున్నారు. వీరిలో 51 మంది గైర్హాజరయ్యారు. 141 మంది పరీక్ష రాశారు. వీరిలో ఒక్క విద్యార్థి మాత్రమే ఉత్తీర్ణత సాధించాడు. ఈ పరీక్షలో ఉత్తీర్ణత శాతం 0.71గా ఉంది. దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. యూనివర్శిటీ రిజిస్ట్రార్ రమేష్ గాధ్వికి ఫిర్యాదు చేశారు. కాగా.. విద్యార్థుల ఫిర్యాదును స్వీకరించినట్లుగా రిజిస్ట్రార్ తెలిపారు. మిగిలిన బాధిత విద్యార్థులు కూడా ముందుకు రావాలని కోరారు. ఇంత మంది ఒకే సారి ఫెయిల్ కావడానికి గల కారణాలపై యూనివర్సిటీ విచారణ జరుపుతోందన్నారు. ఇదిలా ఉంటే.. డిసెంబర్ 2023లో BA-BCom విద్యార్థుల్లో కొందరు పరీక్షా సమాధాన పత్రాల్లో అసభ్యకరమైన బాషతో సహా అనుచితమైన కంటెంట్‌ను వ్రాశారు. ఇలా రాసిన ఆరుగురు విద్యార్థులను గుర్తించి వారికి జరిమానా వేయడంతో పాటు ఆయా పరీక్షల్లో ఫెయిల్ చేశారు. ప్రస్తుతం ఒక్క విద్యార్థే పాస్ కావడంతో మరోసారి ఈ విశ్వవిద్యాలయం పేరు వార్తల్లోకి వచ్చింది.



# ఉత్తరాదిన బీభత్సం సృష్టిస్తున్న భారీ వర్షాలు..

**అసోంలో 56కు చేరిన మృతుల సంఖ్య**

**విశ్వంభర, అస్సాం :** దేశంలోని పలు రాష్ట్రాల్లో వరదలు బీభత్సం సృష్టిస్తున్నాయి. వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. ఈ విపత్తు ధాటికి చాలా కుటుంబాలు నిరాశ్రయులయ్యాయి. ప్రధాన నదులు నిండిపోవడంతో కన్నీటి వరద పారుతోంది. వరద ప్రభావిత ప్రాంతాల్లో చిక్కుకున్న వారిని సహాయక శిబిరాలకు తరలిస్తున్నారు. అసోంలో వరద బీభత్సం అంతకంతకూ పెరుగుతోంది. 24 గంటల్లో మరో 8మంది మృతి చెందారు. దీంతో మృతుల సంఖ్య 56కు చేరినట్లు అధికారులు తెలిపారు. మొత్తం 27 జిల్లాలోని 16.25 లక్షల మంది నిరాశ్రయులనట్లు వెల్లడించారు. బ్రహ్మపుత్ర, డిగేరు, కొల్లాంగ్ నదులుతోపాటు పెద్ద నదులన్నీ ఉప్పొంగి పొర్లుతుండటంతో వరద ఉధృతిలో ఊళ్లకు ఊళ్లే మునిగిపోయాయి. రోడ్లు తెగిపోయి రవాణాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. జనజీవనం పూర్తిగా స్తంభించింది. ప్రస్తుతం 2,800 గ్రామాలు వరదగుప్పిట్లో చిక్కుకోగా, 42,478 హెక్టార్లలో వివిధరకాల పంటలు నీట మునిగినట్లు అధికారులు తెలిపారు. వరదల కారణంగా పలు జిల్లాల్లో రోడ్లు, వంతెనలు, ఇతర మౌలిక సదు-పాయాలు దెబ్బతినట్లు చెప్పారు. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు అసోంలో సంభవించిన ప్రకృతి విపత్తుల్లో చనిపోయినవారి సంఖ్య 56కు చేరినట్లు అధికారులు తెలిపారు. ఈ వరదల వల్ల కజిరంగా జాతీయ పార్కు, టైగర్ రిజర్వ్ కేంద్రాలు వరద నీటిలో మునిగిపోయాని, ఒక రైనో సహా 8 జంతువులు మృతి చెందాయని అటవీ అధికారులు తెలిపారు. ఇక వరద ప్రభావిత ప్రాంతాల్లో అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ పర్యటించారు. పలు ప్రాంతాలలో దెబ్బతిన్న రోడ్లు, ఆనకట్టల మరమ్మతుల పనులను త్వరగతిన పూర్తి చేస్తామని స్థానికులకు హామీ ఇచ్చారు. అటు దేవభూమిగా పేరొందిన ఉత్తరాఖండ్‌లో వరద బీభత్సం కొనసాగుతోంది. ప్రధాన నదులన్నీ ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తున్నాయి. చంపావత్, అల్మోరా, పిథోర్‌గఢ్, ఉదమ్‌సింగ్ నగర్‌తోపాటు కుమాన్ తదితర ప్రాంతాల్లో మరో వారం రోజుల పాటు భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశముందని ఉత్తరాఖండ్ వాతావరణ శాఖ అధికారులు అలర్ట్ జారీ చేశారు. డెహ్రాడూన్, తేహ్రి, హరిద్వార్ తదితర నదీ పరివాహక ప్రాంతాల్లో ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేశారు. ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలతో గంగా, అలకనంద, భాగీరథీ, శారద, మందాకిని, కోసి నదుల్లో నీరు భారీగా ప్రవహిస్తోంది. ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఈ నదులను ఆనుకొని ఉన్న దాదాపు 100 రహదారులను అధికారులు మూసివేశారు. గత 24 గంటల్లో అల్మోరాలోని చౌకుతియా ప్రాంతంలో 72.5 మి.మీ వర్షపాతం నమోదైంది. అలకనంద నది ఉప్పొంగడంతో రుద్రప్రయాగ్ వద్ద నది ఒడ్డున ఏర్పాటుచేసిన 10 అడుగుల శివుడి విగ్రహం నీట మునిగింది. నైనితాల్, పౌడీ జిల్లాల్లోని అన్ని విద్యా సంస్థలకు సెలవులు ప్రకటించారు. ఎలాంటి విపత్తు తలెత్తినా, ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని అధికారులను జిల్లా మెజిస్ట్రేట్స్ ఆదేశించారు. గంగా, సరయూ నదులు ప్రమాదకర స్థాయికి కొంచెం దిగువన ప్రవహిస్తుండగా, అలకనంద, మందాకిని, భాగీరథి నదులు ఇప్పటికే ఆ స్థాయిని దాటేశాయి.

# జగన్ చేతికి ప్రత్యేక హోదా అస్త్రం

- చంద్రబాబును ఇరకాటంలో పెట్టేందుకు రెడీ
- దారి చూపించిన నితీష్ కుమార్
- ఇక జగన్ రంగంలోకి దూకడమే ఆలస్యమా..?



**విశ్వంభర, అమరావతి :** వైఎస్ జగన్‌కి అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర ఓటమి తర్వాత పరిస్థితులు తలకిందులయ్యాయి. 151 సీట్ల నుంచి ఒక్కసారిగా 11 సీట్లకు పడిపోవడంతో పాటు వైసీపీ అధినేత జగన్ తీవ్ర నిరాశలో మునిగిపోయారు. అసెంబ్లీలో కేవలం 11 సీట్లే రావడంతో ప్రతిపక్ష హోదా కల్పించమని అర్థించవలసి వచ్చింది. అది కూడా తనను ద్వేషిస్తున్నాడు, తన చావునే కోరుకున్నాడని చెప్పుకునే అయ్యన్నపాత్రుడుకి లేఖ రాయడం జగన్‌కు ఇబ్బందికరంగా మారింది. అయినా ప్రతిపక్ష హోదా వస్తుందన్న నమ్మకం లేదు.

### బీజేపీకే మద్దతు ప్రకటనలు

మొన్నటిదాకా సిద్ధం సభల్లో నేను అభిమన్యుణ్ని కాదు అర్జునుడిని అని జగన్ చెప్పుకున్నప్పటికీ ఎన్నికల్లో ఘన విజయం తర్వాత చంద్రబాబు తన వ్యూహాలతో జగన్‌ని పద్మవ్యూహంలోకి నెట్టేశారన్న సైటైర్లు వినిపిస్తున్నారు. ఆ విధంగా నువ్వు అర్జునుడివి కాదు.. అభిమన్యుడివే అని చంద్రబాబు చెప్పకనే చెప్పారు. టీడీపీకి 16 మంది ఎంపీలుంటే, నాక్కూడా రాజ్యసభ 11, లోక్‌సభలో 4 కలిపి 15 మంది ఎంపీలున్నారని జగన్ పైకి చెప్పుకుంటున్నప్పటికీ బీజేపీ నుంచి ఆశించిన మద్దతు మాత్రం లభించడం లేదు. ఎన్డీఏలో టీడీపీ భాగస్వామిగా ఉన్నా, జగన్ మాత్రం స్పీకర్ ఎన్నికల్లో బీజేపీకే తన మద్దతు ప్రకటించారు. ఇన్ని చేసినా జగన్ కోరుకున్న జెడ్ ప్లస్ కేటగిరీ భద్రత కేంద్రం కల్పించలేదు.

### ప్రత్యేకహోదా అస్త్రాన్ని చూపించిన నితీష్ కుమార్

బీహార్ సీఎం నితీశ్ కుమార్ రూపంలో ఆయనకు ఒకదారి దొరికింది. బీహార్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా కావాలని నితీశ్ డిమాండ్ చేయడంతో జగన్‌కి వెయ్యి ఏనుగుల బలం వచ్చినట్టయింది. టీడీపీని ఎదుర్కోవడానికి సరైన సమయంలో సరైన అస్త్రం దొరికినట్టయింది వైసీపీకి. ఏపీకి సంబంధించి పోలవరం, ప్రత్యేక హోదా, విశాఖ స్టీల్ ప్లాంట్ వంటి అంశాల్లో ఎలాంటి ప్రకటన చేయకపోయినా బీజేపీతో జట్టు కట్టిన చంద్రబాబు, భారీ విజయం తర్వాత కన్వినియంట్‌గా డిమాండ్‌లు పక్కనపెట్టేసి అమరావతి మీద పూర్తిగా ఫోకస్ చేస్తాడని అందరూ అనుకున్నారు. కానీ నితీశ్ కుమార్ బీహార్ కు ప్రత్యేక హోదా డిమాండ్ చేయడంతో బాబు కూడా ఇరుకున పడినట్టయింది.

### చంద్రబాబుపై తృణమూల్ ఎంపీ విమర్శలు

తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ కల్యాన్ బెనర్జీ వాషింగ్ పౌడర్ నిర్మా స్కీమ్‌లో భాగంగా ఎన్డీఏలో చేర్చుకుని చంద్రబాబుపై కేసులని మాఫీ చేశారని బీజేపీపై చేసిన ఆరోపణలు సభలో ఉన్న టీడీపీ ఎంపీలను ఇరకాటంలో పడేశాయి. ఎన్డీఏలో భాగస్వామిగా ఉండి కూడా ప్రత్యేక హోదా అడగడం లేదని రాబోయే రోజుల్లో రాష్ట్రంలో చంద్రబాబును దోషిగా నిలబెట్టేందుకు జగన్ వ్యూహ రచన చేసే అవకాశం లేకపోలేదు. నితీశ్ చేసిన పని బాబుని ఇరకాటంలోకి నెట్టేసింది. ప్రస్తుతం ఉన్న ఆర్థిక సంక్షోభంతో పాటు తనపై ఉన్న కేసుల నేపథ్యంలో చంద్రబాబు సైతం గట్టిగా ప్రశ్నించలేదు. ఇది రాజకీయంగా చంద్రబాబుకి గడ్డు పరిస్థితి ఎదురయ్యే అవకాశం ఉంది. చూడబోతుంటే రాబోయే రోజుల్లో ఏపీ రాజకీయం మొత్తం ప్రత్యేక హోదా చుట్టూనే తిరుగుతుందని అన్నుకోవచ్చు.




# ఏపీకి ఆర్థిక సాయం చేయండి

- బడ్జెట్‌లో మేలు జరిగేలా కేటాయింపులుండాలి
- ప్రధాని మోడీని కోరిన సీఎం చంద్రబాబు

**విశ్వంభర, అమరావతి :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఢిల్లీ పర్యటన కొనసాగుతోంది. ఢిల్లీ టూర్‌లో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో సమావేశమయ్యారు. ఏపీకి సంబంధించిన కీలక అంశాలు ప్రధానితో చంద్రబాబు చర్చించినట్లు తెలుస్తోంది. ఏపీకి ఆర్థిక సాయం, ఇతర అంశాలను ప్రధానికి వివరించినట్లుగా సమాచారం. బడ్జెట్‌లో ఏపీకి మేలు జరిగేలా కేటాయింపులు చంద్రబాబు కోరినట్లు తెలుస్తోంది. అంతకుముందు రాష్ట్రానికి చెందిన ఎన్డీయే ఎంపీలతో కలిసి కేంద్రమంత్రి పీయూష్ గోయల్‌ను చంద్రబాబు కలిశారు. ఆయనతో వివిధ అంశాలపై మాట్లాడారు. ఇక మధ్యాహ్నం కేంద్రమంత్రులు అమిత్‌షా, నితిన్ గడ్కరీ, శివరాజ్ సింగ్ చౌహాన్‌తో సీఎం భేటీ అవుతారు. ఏపీలో హైవేల విస్తరణ, ఇతర అంశాలపై గడ్కరీతో చర్చించారు. అనంతపురం అమరావతి రహదారి, హైదరాబాద్-అమరావతి హైవేపై చర్చలు జరిపారు. వాణిజ్య పన్నుల శాఖ మంత్రి పీయూష్ గోయల్‌తోనూ సుధీర్ఘ చర్చలు జరిపారు.

సాయంత్రం కేంద్రమంత్రులు మనోహర్ లాల్ ఖట్టర్, హర్దీప్ సింగ్ పురీతో చంద్రబాబు సమావేశం కానున్నారు. ఇక రేపు నిర్మలా సీతారామన్‌తో భేటీ అవుతారు.

# వైసీపీ ఆఫీసులు కూల్చొద్దు

**ఆఫీసర్లు తొందర పడొద్దంటూ కోర్టు ఆదేశం**
**ఫ్యాన్ పార్టీ వివరణ కూడా వినాలంటూ సూచన**




**విశ్వంభర, అమరావతి :** వైసీపీ కార్యాలయాల కూల్చివేత విషయంలో తొందరపాటు వద్దని ఏపీ హైకోర్టు స్పష్టం చేసింది. స్టేటస్‌కో కొనసాగిస్తూ కీల ఆదేశాలు జారీ చేసింది. వైసీపీ ఇచ్చే వివరణను కూడా పరిగణనలోకి తీసుకోవాలని కోర్టు భావించింది. అధికారులు తొందరపాటు చర్యలు తీసుకోవద్దని సూచించింది. ప్రజా ప్రయోజనాలకు విఘాతం కలిగితే తప్ప.. ఎటువంటి చర్యలు తీసుకోవద్దని కూడా కోర్టు వ్యాఖ్యానించింది. భవనాలకు అనుమతులకు సంబంధించిన డాక్యుమెంట్స్ అన్నీ 2 వారాల్లో సమర్పించాలని వైసీపీ తరఫున పిటిషనర్లకు సూచించింది. సంబంధిత అన్నిశాఖల అధికారులు తప్పనిసరిగా హైకోర్టు నిబంధనలు ఫాలో అవ్వాలని స్పష్టం చేసింది. ఇప్పటి వరకూ ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా 10కిపైగా వైసీపీ ఆఫీస్‌లకు నోటీసులు అందజేసింది ప్రభుత్వం. ఈ నేపథ్యంలో కోర్టును ఆశ్రయించారు వైసీపీ నేతలు. గత తెలుగుదేశం ప్రభుత్వంలో నిబంధనల ప్రకారమే భూకేటాయింపులు జరిగాయని పిటిషనర్లు చెప్పారు. అనుమతుల విషయంలోనూ పొరపాట్లు లేవని వైసీపీ తరఫు న్యాయవాదులు తెలిపారు. ఈ తరుణంలో ప్రస్తుతం ఇచ్చిన స్టేటస్ కో ను కొనసాగిస్తూ కీలక ఆదేశాలు జారీ చేసింది. ఇదిలా ఉంటే టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత మంగళగిరిలోని వైసీపీ కేంద్ర కార్యాలయాన్ని కూల్చివేశారు సీఆర్డీయే అధికారులు. అప్పట్లో కోర్టును ఆశ్రయించినప్పటికీ హైకోర్టు తీర్పు వచ్చే క్రమంలోనే పార్టీ ఆఫీసులను పడగొట్టారు. దీంతో పాటు విశాఖపట్నం, అనకాపల్లి ఇలా అనేక ప్రాంతాల్లోని వైసీపీ కార్యాలయాలకు నోటీసులు అందించారు అధికారులు. దీనిపై ఏపీ హైకోర్టులో పిటిషన్ వేసింది వైసీపీ. పిటిషన్ పై స్పందించిన ఏపీ హైకోర్టు గతంలో రెండు రోజులు స్టేటస్ కో ఆదేశాలు జారీ చేసింది. ఆ గడువు నేటితో ముగియడంతో మరోసారి వాదనలు విన్న ఏపీ హైకోర్టు తదుపరి కోర్టు తీర్పు వెలువరించే వరకు వైసీపీ కార్యాలయాలను పడగొట్టకూడదని స్టేటస్ కో అమలు చేస్తూ కీలక ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఆ పార్టీ నాయకులకు స్వల్ప ఊరట లభించినట్లయింది.

# రావణ కాష్టంటా రాష్ట్రం

- మాజీ సీఎం జగన్ తీవ్ర ఆరోపణలు
- వైసీపీ నేతలపై టీడీపీ దాడులు
- వైఎస్సార్ విగ్రహాలను తగలెడుతున్నారంటూ మండిపాటు
- ప్రజలే బుద్ధి చెబుతారంటూ హితవు



**విశ్వంభర, నెల్లూరు :** పిన్నెల్లి మీద అన్యాయంగా కేసులు పెట్టి నిర్భందించారన్నారు వైసీపీ అధినేత వైఎస్ జగన్. రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీ నాయకులపై దాడులు చేస్తున్నారని ఆరోపించారు. నెల్లూరు సెంట్రల్ జైలులో మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని పరామర్శించారు వైసీపీ అధినేత వైఎస్ జగన్. అనంతరం మీడియాతో సమావేశం ఏర్పాటు చేశారు. ఎన్నిలక సమయంలో పెట్టిన కేసులో జ్యూడీషియల్ కస్టడీలో ఉన్న వైసీపీ మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని పరామర్శించేందుకు నెల్లూరు వచ్చారు వైఎస్ జగన్. అయనతో నెల్లూరు సెంట్రల్ జైలులో ములాఖత్ అయిన తరువాత ప్రస్తుత ప్రభుత్వంపై కొన్ని కీలక వ్యాఖ్యలు చేశారు. టీడీపీ నాయకులే తమ పై దాడి చేసి తిరిగి కేసులు పెడుతున్నారన్నారు. తాము అధికారంలో ఉన్నప్పుడు కులం, మతం, పార్టీ చూడలేదన్నారు వైఎస్ జగన్. రాష్ట్రాన్ని రావణకాష్టం చేస్తున్నారని విమర్శించారు. వైయస్‌ఆర్ విగ్రహాలను తగలబెడుతున్నారని మండిపడ్డారు. ఈ పాపాలన్నీ శిశుపాలుడి పాపాలలా పెరుగుతున్నాయని అభివర్ణించారు. దాడులతో భయపెట్టి చేసే రాజకీయాలు సరికాదని సూచించారు. సీఎం చంద్రబాబు ప్రభుత్వం తమ ధోరణి మార్చుకోవాలని కోరారు. సీఎం చంద్రబాబుకు ప్రజలు త్వరలోనే బుద్ధి చెబుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. మంచి పనులు చేసి ప్రజల్లో మంచి పేరు తెచ్చుకోవాలని హితవు పలికారు. ప్రజల్లో వ్యతిరేకతతో వైసీపీ ఓడిపోలేదని సంచలన వ్యాఖ్యలు చేశారు. కూటమి హామీల వల్లే 10శాతం ఎక్కువ మంది ప్రజలు ఎన్డీయేకు ఓటు వేశారన్నారు. సీఎం చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కారంపూడిలో టీడీపీ అకృత్యాలకు ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన కుటుంబం ఇబ్బంది పడిందన్నారు. డీఎస్పీ అనుమతితో వైసీపీ కార్యకర్తల పరామర్శకు మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణా రెడ్డి వెళ్లారని చెప్పారు. సీఐ నారాయణ స్వామి కనీసం పిన్నెల్లికి ఎదురు పడలేదన్నారు. పిన్నెల్లిపై ఘటన జరిగిన రోజు కేసు పెట్టలేదని తెలిపారు. కారెంపూడి ఘటన తన్వాత వారం రోజులకు పిన్నెల్లిపై 307 సెక్షన్ నమోదు చేశారన్నారు. కారెంపూడి ఘటన జరిగిన 10 రోజుల తర్వాత.. పిన్నెల్లిపై కక్షపూరితంగా హత్యాయత్నం కేసు పెట్టారని చెప్పారు వైఎస్ జగన్. మే17-20 వరకు ఉన్న సిట్ రిపోర్ట్‌లో హత్యాయత్నం కేసు లేదని వివరించారు. పిన్నెల్లి మంచోడు కాబట్టే నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారని పేర్కొన్నారు. పిన్నెల్లి లాంటి వారిని తప్పుడు కేసులతో నిర్భందించడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. రెడ్ బుక్ పేరుతో టార్గెట్ చేసి దాడులు చేస్తున్నారన్నారు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్. రాష్ట్రం వ్యాప్తంగా వైసీపీ ఆఫీసులపై దాడులు చేస్తున్నారన్నారు. అన్నింటినీ న్యాయపరంగా అధిగమిస్తామని ధీమాను వ్యక్తం చేశారు.




# ఏపీ టెట్ ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం

**విశ్వంభర, విశాఖపట్నం :** ఆంధ్రప్రదేశ్ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) జులై 2024కు సంబంధించి ఆన్‌లై న్ దరఖాస్తు ప్రక్రియ నేటి నుంచి ప్రారంభమైంది. నిన్నటి నుంచి ఫీజు చెల్లింపులు ప్రారంభంకాగా నేటి నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరణ మొదలైంది. ఆసక్తి కలిగిన అభ్యర్థులు జులై 4 నుంచి జులై 17, 2024వ తేదీ వరకు టెట్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇదిలా ఉంటే టెట్ పరీక్షకు, డీఎస్సీకి సన్నద్ధం కావ డానికి మరింత సమయం ఇస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం జులై 3న ప్రకటించింది. అభ్యర్థుల విజ్ఞప్తి మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. ఆ ప్రకారంగానే త్వరలోనే టెట్, డీఎస్సీ పరీక్షల తేదీలను ప్రకటించనుంది. ఈ ప్రక్రియ మొత్తం 6 నెలల్లోనే పూర్తి చేసేలా కార్యచరణ రూపొందిస్తున్నారు. కొత్తగా బీఈడీ, డీఎడ్ పూర్తి చేసుకున్న వారికి కూడా మెగా డీఎస్సీలో అవకాశం కల్పించడానికే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఇప్పటికే మంత్రి లోకేష్ వెల్లడించారు. టెట్, మెగా డీఎస్సీ పరీక్షలకు సన్నద్ధమయ్యేందుకు మరింత సమయం కావాలని పలువురు విద్యార్థి, యు వజన సంఘాల నేతలు, ఎమ్మెల్సీలు లోకేశ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. ప్రిపరేషన్‌కు సమయం ఇస్తే బాగుం టుందని కోరడంతో ఆయన విద్యాశాఖ ఉన్నతాధి కారులతో సమీక్షించి ఈ నిర్ణయం తీసుకున్నారు. టెట్‌కు 90 రోజులు, మెగా డీఎస్సీకి 90 రోజుల సమయం ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. మొత్తంగా ఈ ఏడాది డిసెంబర్‌లోగా ఉద్యోగాల భర్తీ ప్రక్రియ పూర్తి చేసి, వచ్చే ఏడాది జనవరి నాటికి ఉద్యోగాలు ఇచ్చేలా కార్యాచరణ రూపొందిస్తున్నారు. దరఖాస్తు రుసుములు చెల్లింపులు జులై 3 నుంచి 16 వరకు స్వీకరించనున్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తుల సమర్పణ జులై 04 నుంచి 17వ తేదీ వరకు కొనసాగుతుంది. ఆన్‌లైన్ మాక్ టెస్ట్‌లు జులై 16 నుంచి నిర్వహిస్తారు. త్వరలో కొత్తగా టెట్ పరీక్షల తేదీలు వెల్లడికానున్నాయి. టెట్ పరీక్ష రోజుకు రెండు సెషన్ల చొప్పున జరుగుతుంది. సెషన్-1 పరీక్ష ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు, సెషన్ 2 పరీక్ష మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 వరకు జరుగుతుంది.

# భీమవరం యువతి మిస్సింగ్ కేసులో ట్విస్ట్

**విశ్వంభర, అమరావతి :** 9 నెలల సుదీర్ఘ విచారణ తర్వాత పశ్చిమగోదావరి జిల్లా భీమవరానికి చెందిన యువతి మిస్సింగ్ కేసు సుఖాంతమైంది. అదృశ్యమైన తేజస్వినిని సేఫ్‌గా తల్లి చెంతకు చేర్చారు పోలీసులు. యువతిని ట్రాప్ చేసి తీసుకెళ్లిన కేటుగాణ్ని.. జైల్లో వేశారు. అంతేకాదు, ఆ అతడి క్రైమ్ హిస్టరీ వ్యవహారాలన్నీ బయటకు తీస్తున్నారు. ఇక,ఈ మిస్సింగ్ కేసులో బిగ్ ట్విస్ట్ ఇస్తూ తనను అంజాద్ బెదిరించి తీసుకెళ్లాడంటూ.. మాచవరం పోలీసులకు కంప్లైంట్ చేసింది తేజస్విని. దీంతో, అంజాద్‌పై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు పోలీసులు. నేడు నిందితుడ్ని కోర్టులో ప్రవేశపెట్టనున్నారు పోలీసులు. గత నెల 22న మంగళగిరిలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రజాదర్బార్ నిర్వహించారు. అక్కడ.. తమ కుమార్తె ఆచూకీ తెలియక 9 నెలలు అవుతోందని ఓ మహిళ పవన్‌ని కలిసి ఆవేదన వ్యక్తం చేశారు. తన చిన్న కుమార్తెను ప్రేమ పేరుతో ఆమె సీనియర్ ట్రాప్ చేసి తీసుకెళ్లాడని కన్నీరు పెట్టారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా లాభం లేకపోయిందని వాపోయారు. వెంటనే స్పందించిన పవన్ కల్యాణ్ మాచవరం సీఐ గుణరాముకు నేరుగా ఫోన్ చేసి మాట్లాడారు. దర్యాప్తు వేగం పెంచి బాలిక ఆచూకీ కనిపెట్టాలని ఆదేశించారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశంతో కదిలిన విజయవాడ పోలీసులు తిరిగి దర్యాప్తు ప్రారంభించారు. యువతి జమ్మూలో ఉన్నట్లుగా కుటుంబ సభ్యుల నుంచి ప్రాథమిక సమాచారం అందుకుని అక్కడకు వెళ్లారు. అక్కడ ఇద్దరినీ తమ ఆధీనంలోకి తీసుకుని జమ్మూ స్టేషన్‌కు తీసుకొచ్చారు. తర్వాత విమానంలో విజయవాడకు తీసుకువచ్చారు. ఏపీ పోలీసులు సమర్థవంతంగా పనిచేసి 9నెలల క్రితం అదృశ్యమయిన యువతిని 9 రోజుల్లో ట్రేస్ చేసి తీసుకువచ్చారని డిప్యూటీ సీఎం పవన్ అన్నారు. ఇకపై.. మిస్సింగ్ కేసులను ట్రేస్ చేయడానికి ప్రత్యేక సెల్ ఏర్పాటు చేస్తామని పవన్ ప్రకటించారు.





# భారత ఆటగాళ్ల ఓపెన్ బస్ పరేడ్

## అభిమానులతో పోటెత్తిన ముంబై తీరం

**విశ్వంభర, స్పోర్ట్స్ :** టీ20 ప్రపంచకప్ 2024 విజేతగా భారత జట్టు నిలిచింది. కరేబియన్ దీవుల నుంచి స్వదేశానికి చేరుకున్న భారత జట్టుకు ఘన స్వాగతం లభించింది. ఉదయం ప్రధాని నరేంద్ర మోదీతో భారత జట్టు ఆటగాళ్లు భేటీ అయ్యారు. అనంతరం ప్రత్యేక విమానంలో ముంబైకి చేరుకున్నారు. ముంబై వీధుల్లో ఓపెన్ టాప్ బస్‌లో ప్రపంచకప్‌తో టీమ్ఇండియా రోడ్ షో చేయనుంది. ఈ క్రమంలో ముంబై తీరం మొత్తం అభిమానులతో పోటెత్తింది. ఆటగాళ్లకు స్వాగతం పలికేందుకు పెద్ద సంఖ్యలో అభిమానులు రోడ్లపైకి వచ్చారు. రోడ్ షో అనంతరం ముంబైలోని వాంఖడే స్టేడియంలో భారత ఆటగాళ్లను బీసీసీఐ సన్మానించనుంది.

## రెండు నెలల ముందు జీరో..
## ఇప్పుడు హీరో..

**విశ్వంభర, స్పోర్ట్స్ :** టీమ్ఇండియా స్టార్ ఆల్‌రౌండర్, ముంబై ఇండియన్స్ కెప్టెన్ అయిన హార్దిక్ పాండ్యాకు రెండు నెలల క్రితం ఎంతో కష్టమైన కాలంగా చెప్పవచ్చు. రోహిత్ శర్మను కాదని ముంబై కెప్టెన్‌గా అతడిని నియమించడాన్ని అభిమానులు జీర్ణించుకోలేకపోయారు. దీంతో ముంబై, రోహిత్ అభిమానుల నుంచి హార్దిక్‌కు తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. మైదానంలో, బయట ఎక్కడ కనిపించినా కూడా అతడికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అదే సమయంలో ముంబై వరుస ఓటములతో ప్లే ఆఫ్స్‌కు చేరుకోవడంలో విఫలం కావడంతో హార్దిక్ మరిన్ని చీత్కారాలను ఎదుర్కోవాల్సి వచ్చింది. కాలం గిర్రున తిరగింది. ఒక నెల గడిచిపోయింది. టీమ్ఇండియా టీ20 ప్రపంచకప్ విజేతగా నిలిచింది. దీంతో పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. భారత విజయాల్లో పాండ్యా కీలక పాత్ర పోషించడంతో మళ్లీ అభిమానుల మనసులను గెలుచుకు న్నాడు. ప్రపంచకప్‌తో భారత జట్టు ఢిల్లీలో అడుగుపెట్టింది. అక్కడి నుంచి ముంబైకి చేరుకుంది. భారత ప్లేయర్లకు ఘన స్వాగతం పలికేందుకు ముంబై అభిమానులు పెద్ద సంఖ్యలో వచ్చారు. టీమ్ఇండియా ప్లేయర్లు ఇంకా రాకముందే.. వాంఖడే స్టేడియం మొత్తం జనసంద్రంగా మారింది. స్టేడియం మొత్తం హార్దిక్ నామస్మరణతో నిండిపోయింది. రెండు నెలల ముందు ఏ గ్రౌండ్‌లోనైతే అవమానాలు ఎదుర్కొన్నాడో అప్పుడు అక్కడే హార్దిక్ రాజాలా తలెత్తుకుని నిలబడ్డాడు. కష్టమైన దశను దాటడానికి హార్దిక్ ఎంతో కష్టపడ్డాడు.



## ప్రధాని మోదీకి టీమ్ఇండియా 'జెర్సీ'..




**విశ్వంభర, స్పోర్ట్స్ :** ఫైనల్ మ్యాచులో దక్షిణాఫ్రికా జట్టును చిత్తు చేసి విశ్వ విజేతగా నిలిచింది టీమ్ఇండియా. చాన్నాళ్ల తరువాత మరోసారి టీమ్ఇండియా టీ20 ప్రపంచ కప్‌ను ముద్దాడింది. ప్రపంచకప్ గెలిచిన నాలుగు రోజుల తరువాత భారత జట్టు స్వదేశానికి వచ్చింది. ఈ క్రమంలో ప్లేయర్లను ప్రధాని నరేంద్ర మోదీ ప్రత్యేకంగా కలిసి అభినందించారు. ముఖ్యంగా కెప్టెన్ రోహిత్ శర్మ, ప్రధాన కోచ్‌గా బాధ్యతలు నిర్వర్తించిన రాహుల్ ద్రవిడ్ పై ప్రశంసలు కురిపించారు. భారత ప్లేయర్లతో పాటు వాళ్ల కుటుంబ సభ్యులతో ప్రధాని కాసేపు ముచ్చటించారు. వాళ్లతో కలిసి అల్పాహారం చేశారు. ఇక బుమ్రా కుమారుడిని మోదీ ఎత్తుకుని ఆడించడం విశేషం. భారత క్రికెటర్లతో పాటు బీసీసీఐ అధ్యక్షుడు రోజర్ బిన్నీ, కార్యదర్శి జై షా లు కూడా ప్రధానిని కలిశారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీకి వీరిద్దరు ప్రత్యేకంగా భారత జెర్సీని అందజేశారు. నరేంద్రలోని మొదటి రెండు లెటర్స్ 'NA'ను, అలాగే మోదీలో తొలి రెండు అక్షరాలను 'MO'ని తీసుకుని నమో (NAMO) పేరు జెర్సీ వెనుక రాసి ఉంది. అలాగే 1వ నంబర్‌ను కేటాయించింది. ఇందుకు సంబంధించిన ఫోటోలను బీసీసీఐ సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. 'ప్రపంచకప్ విజేతలను ప్రధాని మోదీ కలిశారు. మీ (ప్రధాని) స్ఫూర్తిదాయకమైన మాటలు, భారత జట్టుకు మీరు అందించిన అమూల్యమైన మద్దతుకు హృదయపూర్వక ధన్యవాదాలు.' అంటూ బీసీసీఐ రాసుకొచ్చింది.

## టీ20 ప్రపంచకప్‌లో ఓటమి..
### మరో స్టార్ ఆల్‌రౌండర్ క్రికెట్‌కు వీడ్కోలు..

**విశ్వంభర, స్పోర్ట్స్ :** వెస్టిండీస్, అమెరికా దేశాలు సంయుక్తంగా ఆతిథ్యం ఇచ్చిన టీ20 ప్రపంచకప్ 2024 విజేతగా భారత జట్టు నిలిచింది. దక్షిణాఫ్రికాతో ఫైనల్ మ్యాచ్ ముగిసిన వెంటనే టీమ్ఇండియా స్టార్ ఆటగాళ్లు విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ, రవీంద్ర జడేజాలు టీ20 క్రికెట్‌కు గుడ్ బై చెప్పేశారు. న్యూజిలాండ్ స్టార్ పేసర్ ట్రెంట్ బౌల్ట్ కూడా టీ20లకు వీడ్కోలు పలికాడు. ఈ జాబితాలో మరో ఆటగాడు చేరిపోయాడు. బంగ్లాదేశ్ స్టార్ ఆల్‌రౌండర్ మహ్మదుల్లా రియాద్ అంతర్జాతీయ క్రికెట్‌కు గుడ్ బై చెప్పేశాడు. టీ20 ప్రపంచకప్‌లో బంగ్లాదేశ్ ఓటమి అనంతరం క్రికెట్ నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించాడు. పొట్టి ప్రపంచకప్‌లో బంగ్లాదేశ్ సూపర్ 8 దశ నుంచి నిష్క్రమించింది. సూపర్ 8లో ఆడిన మూడు మ్యాచుల్లో ఓడిపోయి ఇంటిదారి పట్టింది. ఈ క్రమంలో మహ్మదుల్లా రిటైర్మెంట్ నిర్ణయాన్ని తీసుకున్నట్లుగా తెలుస్తోంది. 2007లో శ్రీలంక పై మ్యాచ్ ద్వారా మహ్మదుల్లా అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగ్రేటం చేశాడు. తన 17 ఏళ్ల సుదీర్ఘ కెరీర్‌లో బంగ్లాదేశ్ తరుపున 50 టెస్టులు, 232 వన్డేలు, 138 టీ20 మ్యాచులు ఆడాడు. 50 టెస్టుల్లో 2914 పరుగులు చేశాడు. ఇందులో 5 సెంచరీలు 16 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. 232 వన్డేల్లో 5386 పరుగులు చేశాడు. ఇందులో నాలుగు శతకాలు 28 అర్ధశతకాలు ఉన్నాయి. ఇక 138 టీ20ల్లో 2394 పరుగులు చేశాడు. ఇందులో 8 అర్ధశతకాలు ఉన్నాయి. ఇక బౌలింగ్‌లోనూ మూడు ఫార్మాట్లలో కలిపి 150 పైగా వికెట్లు పడగొట్టాడు. 2018లో జరిగిన నిదాహాస్ ట్రోఫీలో మహ్మదుల్లా సారథ్యంలోనే బంగ్లాదేశ్ ఫైనల్‌కు చేరుకుంది. అయితే.. ఫైనల్ మ్యాచ్‌లో భారత్ చేతిలో ఓడిపోయింది. ఈ మ్యాచ్‌లో టీమ్ఇండియా ఆటగాడు దినేశ్ కార్తీక్ సంచలన బ్యాటింగ్‌తో భారత్ కు విజయాన్ని అందించాడు.



## చెల్లింపుల కోసం యూపీఐ సేవలు ప్రారంభించిన స్విగ్గీ..!

**విశ్వంభర, బిజినెస్ :** జొమాటో తర్వాత ఆన్‌లైన్ ఫుడ్, గ్రోసరీ డెలివరీ ప్లాట్‌ఫారమ్ స్విగ్గీ తన సొంత యూపీఐ (యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్)సేవలను ప్రారంభించంది. దీంతో బయట యాప్‌లపై ఆధారపడటాన్ని తగ్గనుంది. చెల్లింపు వైఫల్యాలను తగ్గించడానికి, చెక్అవుట్ అనుభవాన్ని సులభతరం చేయడానికి యూపీఐ సేవలు ప్రారంభించిట్లు పేర్కొంది. కొత్త యాప్‌లో చెల్లింపు సేవ యెస్ బ్యాంక్, జుస్పే భాగస్వామ్యంతో UPI-ప్లగ్ఇన్ ద్వారా ప్రారంభించబడుతోంది. స్విగ్గీ ప్రస్తుతం తన ఉద్యోగులకు క్లోజ్డ్ యూజర్ గ్రూప్ లో దీన్ని ప్రారంభించింది. త్వరలో కస్టమర్‌లకు దశలవారీగా దీన్ని తెరవడం ప్రారంభిస్తుంది" అని అభివృద్ధికి సన్నిహిత వ్యక్తి తెలిపారు. స్విగ్గీ ప్రధాన ప్రత్యర్థి జొమాటో తన ఫిన్‌టెక్ ప్లేని తగ్గించి, పేమెంట్ అగ్రిగేటర్ లైసెన్స్‌ను సరెండర్ చేసి, నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీ కోసం తన దరఖాస్తును ఉపసంహరించుకుంది. చాలా కొత్త ప్రత్యామ్నాయం యూపీఐ ప్లగిన్ అనేది 2022లో నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ద్వారా ప్రారంభించబడిన ఉత్పత్తి. ఇది వ్యాపారులు తమ యాప్‌లో UPI చెల్లింపుల సేవను ప్రారంభించడానికి TPAP లైసెన్స్‌ని పొందవలసిన అవసరాన్ని తగ్గిస్తోంది.చెల్లింపు చేయడానికి కస్టమర్‌లు వేరే యాప్‌ను ఉపయోగించాల్సి వచ్చినప్పుడు, ముఖ్యంగా నెట్‌వర్క్ కనెక్టివిటీ బాగా లేనప్పుడు చెల్లింపు వైఫల్యాల ప్రమాదం పెరుగుతుంది. గూగుల్ పే, ఫోన్ పే, పేటీఎం వంటి ప్రముఖ చెల్లింపు యాప్‌లతో పాటు జొమాటో, ఫ్లిప్ కార్ట్, గోబిబో, మేక్ మై ట్రిప్, టాటా న్యూ వంటి నాన్-పేమెంట్ ప్లాట్‌ఫారమ్‌లు కూడా చెల్లింపు సేవను అంతర్గతంగా అందించడానికి లైసెన్సింగ్ మార్గాన్ని అనుసరించాయి. గత ఏడాది మేలో Zomato ప్రవేశపెట్టిన మాదిరిగానే ఆహారం లేదా కిరాణా సామాగ్రిని ఆర్డర్ చేసేటప్పుడు Google Pay, Paytm లేదా PhonePe వంటి ఇతర యాప్‌లకు దారి మళ్లించాల్సిన అవసరాన్ని తగ్గించడమనేది కస్టమర్‌లకు అంతర్గత UPI చెల్లింపుల ఎంపికను అందించే ఆలోచన. దీంతో కస్టమర్‌లు వారి స్విగ్గీ UPI ఖాతాను ఉపయోగించి నేరుగా వారి ఆహార బిల్లులను చెల్లించే అవకాశం పొందుతారు.

# మొబైల్ టారిఫ్‌ల పెంపుపై
# ప్రభుత్వ జోక్యం ఉండదు..!

**విశ్వంభర, బిజినెస్ :** దేశంలోని మూడు ప్రధాన టెలికామ్ కంపెనీలు టారిఫ్ ప్లాన్లను భారీగా పెంచాయి. దీంతో సామాన్యులపై భారం పడనుంది. ఈ నేపథ్యంలో టారిఫ్ ల పెంపుపై కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవచ్చని ఊహాగానాలు వచ్చాయి. అయితే ఇందులో ప్రభుత్వం జోక్యం చేసుకునే ప్రసక్తే లేదని ఇప్పుడు తేలిపోయింది. టారిఫ్‌ల పెంపు విషయంలో జోక్యం చేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం లేదా టెలికాం నియంత్రణ సంస్థ సిద్ధంగా లేవని ప్రభుత్వ అధికారులను ఉటంకిస్తూ నివేదిక పేర్కొంది. చాలా దేశాల కంటే భారత్‌లో మొబైల్ టారిఫ్ లు ఇప్పటికీ తక్కువగానే ఉన్నాయని అధికారులు భావిస్తున్నారు. టెలికాం కంపెనీలు సేవల నాణ్యతను మెరుగుపరుచుకోవాలన్నదే అధికారులు ఉద్ఘాటించారు. ఈ వారం నుంచి మూడు ప్రధాన టెలికాం కంపెనీలు రిలయన్స్ జియో, భారతీ ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా ప్లాన్‌లు ఖరీదైనవిగా మారాయి. కంపెనీలు మొబైల్ టారిఫ్‌లను 11 నుంచి 25 శాతం పెంచాయి. ముందుగా రిలయన్స్ జియో టారిఫ్‌ను పెంచుతున్నట్లు ప్రకటించింది. ఆ తర్వాత భారతీ ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా కూడా టారిఫ్‌ను పెంచుతున్నట్లు ప్రకటించాయి. టెలికాం కంపెనీలు టారిఫ్‌లు పెంచిన తర్వాత వినియోగదారుల జేబులకు చెల్లు పడే అవకాశం ఉంది. టారిఫ్‌ల పెంపుతో పట్టణ, గ్రామీణ వినియోగదారుల వ్యయం పెరుగుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. పట్టణ వినియోగదారుల విషయానికొస్తే, టెలికాం సేవలపై ప్రజల వ్యయం గత ఆర్థిక సంవత్సరంలో వారి మొత్తం వ్యయంలో 2.7 శాతానికి సమానం. ఇది ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 2.8 శాతానికి పెరగవచ్చు. అదే సమయంలో గ్రామీణ వినియోగదారుల మొత్తం వ్యయంలో టెలికాం సేవలపై చేసే వ్యయం వాటా 4.5 శాతం నుంచి 4.7 శాతానికి పెరగవచ్చు. వినియోగదారు లపై అదనపు ఒత్తిడి కారణంగా, మొబైల్ కంపెనీలపై ప్రభుత్వం కొన్ని ఆంక్షలు విధిస్తుందని భావించారు. అయితే, ఇప్పుడు ఆ ఆశకు తెరపడింది. భారతదేశ టెలికాం రంగంలో ఇప్పటికీ విస్తారమైన పోటీ ఉంది.




## దశాబ్దం తర్వాత ప్రావిడెంట్ ఫండ్‌కు కీలక మార్పులు..

**విశ్వంభర, బిజినెస్ :** కేంద్రంలోని నరేంద్ర మోదీ సర్కార్ అతి త్వరలో ఈ ఆర్థిక ఏడాదికిగాను పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టేందుకు రెడీ అవుతోంది. ఈ సందర్భంగా ఉద్యోగులకు సంబంధించిన పలు నిబంధనలు మారుస్తూ ఇప్పటికే నిర్ణయం తీసుకుంది. ప్రావిడెంట్ ఫండ్ నుంచి NPS వరకు కీలక రూల్స్ ఛేంజ్ చేసింది. కాగా ఎప్పటి నుంచో ఉన్న డిమాండ్‌పై తాజాగా దృష్టి పెడుతున్నట్లు ఆర్థిక శాఖ వర్గాలు చెబుతున్నాయి. దశాబ్దం పాటు స్తబ్దుగా ఉన్న ప్రావిడెంట్ ఫండ్ పరిమితిని పెంచేందుకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం 15 వేలుగా ఉన్న ఈ లిమిట్‌ను 25 వేలకు పెంచవచ్చని ప్రముఖ మీడియా సంస్థ నివేదించింది. ఇందుకు అనుగుణంగా కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ ప్రభుత్వానికి ప్రతిపాదనలు రెడీ చేస్తున్నట్లు పేర్కొంది. ఈ సవరణతో సామాజిక భద్రత పథకం పరిధిని విస్తరించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. కేంద్రం చివరిగా 2014లో ఉద్యోగుల భవిష్య నిధి కింద విరాళాల పరిమితిని సవరించింది. 1 సెప్టెంబర్, 2015 నుంచి PF మొత్తాన్ని 6 వేల 500 నుంచి 15 వేలకి పెంచింది. కాగా ఇప్పటివరకు దాదాపు 9 సార్లు ఈ విధంగా లిమిట్‌కి మార్పులు చేసింది. సామాజిక భద్రత కోడ్ 2020 ప్రకారం లక్షలాది మంది అసంఘటిత, గిగ్, ప్లాట్‌ఫారమ్ మరియు వ్యవసాయ కార్మికులను ప్రావిడెంట్ ఫండ్ కిందకు చేర్చాలని కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. ఈ ప్రయత్నంలో భాగంగా రాబోయే బడ్జెట్‌లో సామాజిక భద్రతా నిధిని ఏర్పాటు చేయాలని కోరుతున్నాయి. ఈ మేరకు ఆర్థిక మంత్రి నిర్మలమ్మను గతనెలలో కలిసిన తర్వాత 10 కేంద్ర కార్మిక సంఘాలు ప్రకటన విడుదల చేశాయి.



# అందాల పొలిమేర తెంచేసిందిగా!

కామాక్షి భాస్కర్ల. ఈ పేరు విన్న వాళ్లు చాలా తక్కువ మంది మాత్రమే ఉంటారు. మా ఊరి పొలిమేర హీరోయిన్ అంటే బాగా గుర్తు పడతారు కామాక్షిని. నిజానికి ఈమె డాక్టర్.. ఆ తర్వాత యాక్టర్ అయింది. ప్రియురాలు సినిమాతో తెలుగు ఇండస్ట్రీకి పరిచయం అయింది కామాక్షి. అయితే ఆ సినిమా వచ్చినట్లు కూడా ఎవరికి తెలియదు. కామాక్షి భాస్కర్ల చైనాలో ఎంబీబీఎస్ చేసి అపోలో హాస్పిటల్‌లో కొంతకాలం డాక్టర్‌గా పని చేసింది. ఆ తర్వాత మోడల్ రంగంలో అడుగుపెట్టి 2018 ఏడాదికి గాను మిస్ తెలంగాణగా ఎంపికైంది. 2018 మిస్ ఇండియా పోటీల్లో పాల్గొని ఫైనల్స్ వరకు చేరుకుంది. వృత్తి రీత్యా డాక్టర్ అయిన కామాక్షి భాస్కర్ల.. హీరోయిన్‌గా మారి వచ్చిన ప్రతీ ఛాన్సును యూజ్ చేసుకుంటుంది. ఈ క్రమంలోనే ఈమె నటించిన విరూపాక్ష, పొలిమేర 2, మంగళవారం లాంటి చిత్రాలు విజయాన్ని అందుకున్నాయి.ఇప్పటి వరకు చాలా పద్దతిగా కనిపించిన కామాక్షి.. ఫస్ట్ టైమ్ ఓ రేంజ్‌లో రెచ్చిపోయింది. ఈమె ఫోజులు చూసి సోషల్ మీడియా షేక్ అయిపోతుంది. కామాక్షి ఇచ్చిన ఫోజులు చూసి వామ్మో ఈ భామ ఏంటి అంతగా రెచ్చిపోయింది అనుకుంటున్నారు. కామాక్షి భాస్కర్ల ఫోజులు చూసి కుర్రాళ్ళకి కంటిమీద కునుకు కూడా రావట్లేదు. తాజాగా బికినీకి తక్కువ కాని డ్రెస్‌లో రెచ్చిపోయింది కామాక్షి. ఈమె ఫోటోలు బాగా ట్రెండ్ అవుతున్నాయి. పొలిమేరలో పక్కా పల్లెటూరి అమ్మాయిగా కనిపించిన ఈ బ్యూటీ.. ఇప్పుడు ఇచ్చిన పోజులు చూసి గ్లామర్ ఛాన్సులు కూడా వస్తాయనడంలో సందేహం లేదు. చూడాలిక.. !



## బిగ్‌బాస్–8 కంటెస్టెంట్‌గా
# వేణుస్వామి?

ప్రముఖ జ్యోతిష్యుడు వేణు స్వామి గురించి ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన అవసరం లేదు. సినీ ప్రముఖులు,రాజకీయ నాయకులు, వ్యాపార వేత్తల జీవితాల్లో చోటుచేసుకునే కీలక పరిణామాలను ముందుగానే చెబుతూ ఆయన సోషల్ మీడియాలో సంచలనం సృష్టిస్తుంటారు.ఇప్పటివరకు ఇయన చెప్పిన జ్యోతిష్యాల్లో 80 శాతానికి పైగా నిజమయ్యాయని ఆయన ఫ్యాన్స్ చెబుతుంటారు. అయితే, సినిమా స్టార్స్, రాజకీయ నాయకుల జాతకాలు చెబుతూ సోషల్ మీడియాలో పాపులర్ అయిన ఆస్ట్రాలజర్ వేణుస్వామి కు క్రేజీ ఆఫర్ వచ్చిందట. ఆయనకు ఉన్న క్రేజ్‌ను దృష్టిలో పెట్టుకుని బిగ్‌బాస్ టీమ్.. వేణుస్వామిని సంప్రదించినట్లు సమాచారం. దీంతో ఆయన బిగ్‌బాస్ తెలుగు సీజన్ 8లోకి కంటెస్టెంట్‌గా ఎంట్రీ ఇవ్వబోతున్నట్లు తెలుస్తోంది. దీనికోసం వేణుస్వామి భారీగా రెమ్యునరేషన్ డిమాండ్ చేసినట్లు ప్రచారం జరుగుతోంది.



## విజయ్ సేతుపతి సరసన
# నిత్యామీనన్!

గత కొంతకాలంగా తెలుగు సినిమాలకు దూరమైన నిత్యామీనన్ ప్రస్తుతం తమిళ్,మలయాళ భాషల్లో సెలెక్టివ్ గా సినిమాలు చేస్తోంది. 2022 లో ధనుష్ తో కలిసి 'తిరు' సినిమాలో తన నటనతో ఆకట్టుకున్న ఈ మలయాళీ ముద్దుగుమ్మ తాజాగా కోలీవుడ్ లో మరో అదిరిపోయే ఆఫర్ అందుకున్నట్లు తెలుస్తోంది.విజయ్ సేతుపతి రీసెంట్ గా 'మహారాజ' చిత్రంతో అద్భుతమైన విజయాన్ని సొంతం చేసుకున్నాడు. సేతుపతి కెరీర్ లో 50 వ సినిమాగా వచ్చిన ఈ మూవీ ఆడియన్స్ ను ఎంతగానో ఆకట్టుకుంది.ఈ సినిమాలో విజయ్ సేతుపతి నటనకు ప్రశంసలు సైతం లభించాయి. ఈ నేపథ్యంలో తన తదుపరి సినిమాను పాండిరాజ్ దర్శకత్వంలో చేసేందుకు సేతుపతి సన్నద్ధమవుతున్నారు. ఈ ప్రాజెక్ట్ లో నిత్యామీనన్ హీరోయిన్ గా నటించనుందని సమాచారం. అంతేకాదు సినిమాలో నిత్యామీనన్ పాత్ర ఎంతో కీలకంగా ఉంటుందని అంటున్నారు. త్వరలోనే ఈ ప్రాజెక్ట్ సెట్స్ పైకి వెళ్లనున్నట్లు తెలుస్తోంది.

## నిర్మాతలూ నన్ను క్షమించండి!
# పవన్ కళ్యాణ్ రిక్వెస్ట్

పవర్ స్టార్ పవన్ కల్యాణ్ ఇప్పుడు పొలిటికల్ స్టార్ గా మారారు. ఆయనిప్పుడు డిప్యూటీ సీఎంగా ఉన్నారు. పలు కీలక శాఖలకు మంత్రిగా ఉన్నారు. తనకు కేటాయించిన శాఖలపై వరుసగా రివ్యూలు చేస్తూ చాలా బిజీగా ఉన్నారు పవన్ కల్యాణ్. ప్రజలకు సేవ చేసే పనిలో నిమగ్నమయ్యారు. ఈ పరిస్థితుల్లో పవన్ కల్యాణ్ ఇక ముందు సినిమాలు చేస్తారా? లేదా? అన్నది అభిమానులను వేధిస్తున్న ప్రశ్న. తమ అభిమాన నాయకుడిని ఇక ముందు సిల్వర్ స్క్రీన్ పై చూడలేమా? అని వారు వర్రీ అవుతున్నారు. ఇదే సమయంలో కాకినాడ జిల్లా ఉప్పాడ సెంటర్ లో జరిగిన వారాహి సభలో పవన్ కల్యాణ్ మాట్లాడుతుండగా.. ఫ్యాన్స్.. OG, OG అని అరిచారు. దీనిపై పవన్ కల్యాణ్ స్పందించారు. "సినిమాలు చేసే టైమ్ ఉందంటారా? నిన్ను ఎన్నుకుంటే రోడ్లపై గుంతలు కూడా పూడ్చ లేదని ప్రజలు మనల్ని తిట్టకూడదు కదా? మనం OG అంటే వాళ్లు క్యాజీ అంటారు. నిర్మాతలు నన్ను క్షమించాలి. ముందు 3 నెలలు ఆంధ్ర ప్రజలకు కనీసం సేవ చేసుకుంటా. కుదిరినప్పుడల్లా రెండు, మూడు రోజులు సినిమా షూటింగ్ చేస్తాను, ఎక్కడా పనికి అంతరాయం రాకుండా అని నిర్మాతలకు చెప్పాను. OG చూద్దురు గానీ, బాగుంటుంది" అని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు.



# విశ్వంభర కోసం చిరు భలే ప్లాన్ చేశారే!

మెగాస్టార్ చిరంజీవి ప్రస్తుతం వశిష్ఠ దర్శకత్వంలో విశ్వంభర సినిమాను చేస్తున్న విషయం తెల్సిందే. వచ్చే ఏడాది సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు రాబోతున్న ఈ సినిమాకు సంబంధించిన మ్యూజిక్ సిట్టింగ్స్ జరుగుతున్నాయి. అందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్ అవుతోంది. ఒకప్పుడు మ్యూజిక్ సిట్టింగ్స్ ను చిత్ర యూనిట్ సభ్యులు అంతా కలిసి కూర్చుని నిర్వహించేవారు. కానీ ఇప్పుడు మాత్రం విదేశాల్లో, ఎక్కడో హాలీడే స్పాట్స్ లో దర్శకుడు మరియు సంగీత దర్శకులు మాత్రమే పాల్గొంటున్నారు. ఆ పద్ధతికి స్వస్థి చెప్పి మెగాస్టార్ ఇలా ప్లాన్ చేశారు. దర్శకుడు, సంగీత దర్శకుడితో పాటు హీరో చిరంజీవి మరియు ఇతర సాంకేతిక వర్గం కూడా ఈ మ్యూజిక్ సిట్టింగ్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిరంజీవి పాత సినిమాలకు చెందిన కొన్ని పాటలను కీరవాణి తన టీం తో పాడటంతో పాటు సంగీత కచేరి నిర్వహించారు. సంగీత దర్శకుడు కీరవాణి సంగీత కచేరికి సంబంధించిన వీడియోలు వైరల్ అవుతున్నాయి. ఆ రోజులను గుర్తు చేస్తూ చిరంజీవి ఈ వీడియోను షేర్ చేయడంతో పాటు కీరవాణికి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేశాడు. అందరు హీరోలు దర్శకులు ఇలాగే ప్లాన్ చేస్తే బాగుంటుందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. బింబిసార చిత్రం తర్వాత దర్శకుడు వశిష్ఠ ఈ సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. చిరంజీవికి జోడీగా ఈ సినిమాలో త్రిష నటిస్తున్న విషయం తెల్సిందే. ఇక చిరంజీవి చెల్లెల్ల పాత్రల్లో పలువురు ముద్దుగుమ్మలు కనిపించబోతున్నారు.




# ఉత్తరం వైపు తలపెట్టి ఎందుకు నిద్రించకూడదు?

**విశ్వంభర, ఫీచర్:** ఉత్తరం వైపు తల పెట్టి నిద్రించకూడదని పెద్దోళ్లు చెప్తుంటారు. అలా ఎందుకు అని అడిగితే.. అది అంతే.. అలా పెట్టుకోని పడుకుంటే నిద్రపట్టదు, ఆరోగ్యానికి మంచిది కాదు అంటారు. దీనికి వినాయకుడి కథకు లింక్ చేస్తారు. మన సనాతన ధర్మంలో ప్రతి ఇంట్లో చెప్పే మాటల వల్ల దాదాపు ఎవరూ ఉత్తరం వైపు తల పెట్టి నిద్రించరు. అయితే, తాము సైంటిఫిక్ మైండెడ్ అని, సైన్స్ చెబితేనే నమ్ముతామని, సైంటిఫిక్ గా అర్థం చేసుకుంటేనే వింటామని నమ్మేవారూ ఉన్నారు. శాస్త్రోక్తంగా ఉత్తరం వైపు తల పెట్టి నిద్రించకూడదనే దానికి కారణాలు ఇవే..

**ఆరోగ్య సమస్యలు ఎలా వస్తాయి**

మన శరీరం యొక్క మెకానిజం మనం నిద్రపోయేటప్పుడు సహజంగా రక్త ప్రసరణ తగ్గిపోతుంది. మనం నిలబడి లేదా నడుస్తున్నప్పుడు మన రక్తపోటు ఎక్కువగా ఉంటుంది. అలాగే భూమి అయస్కాంతం లాంటిది. ఇందులో దక్షిణ ధృవం ప్రతికూల శక్తిని కలిగి ఉంటుంది మరియు ఉత్తర ధ్రువంలో సానుకూల శక్తి ఉంటుంది. సహజంగా శక్తి తరంగాలు ఒక నిర్దిష్ట వేగంతో దక్షిణం నుండి ఉత్తరానికి ప్రయాణిస్తాయి. మనం ఉత్తరం వైపు తల పెట్టి పడుకున్నప్పుడు సహజంగానే తల భాగానికి అంటే మెదడు భాగానికి రక్త సరఫరా తగ్గి శరీర యంత్రాంగానికి అనుబంధంగా ఉండాలి. అయితే, ఈ అయస్కాంత శక్తి దక్షిణం నుండి ఉత్తరం వైపుకు వెళుతుంది కాబట్టి, తలకు అంటే మెదడుకు రక్త సరఫరా పెరుగుతుంది. అప్పుడు అధిక రక్తపోటు లేదా రక్తనాళాల వ్యాధి ఉన్నవారిలో, రక్త పరిమాణం, అంటే ఒత్తిడి పెరుగుతుంది మరియు రక్తనాళం పగిలి రక్తస్రావం కావచ్చు. రెండవ సమస్య చెదిరిన నిద్ర. అంటే నిద్ర సరిగా ఉండదు. సరైన నిద్రకు అవసరమైన దానికంటే రక్తప్రసరణ ఎక్కువగా ఉండడం వల్ల నిద్రకు అంతరాయం కలుగుతుంది. లేదా, నిద్ర పరిమాణం మరియు నాణ్యత చెదిరిపోతుంది. మూడవ కారణం చెడు కలలు. ఎందుకంటే, మంచి నిద్ర ఉన్నప్పుడు, అంటే మంచి నాణ్యమైన నిద్ర, కలలు రావు. ఉత్తరాభిముఖంగా తల పెట్టి నిద్రించకూడదని శాస్త్రోక్తంగా నిర్ధారించారు. ఉత్తరం వైపు తల పెట్టి పడుకోవడం వల్ల స్ట్రోక్స్, నిద్రకు ఇబ్బంది మరియు చెడు కలలు వస్తాయి.



**ఉత్తరం తప్ప ఏ దిక్కున నిద్రించాలి?**

దక్షిణం. అవును, దక్షిణం వైపు తల పెట్టి పడుకోవడం పైన పేర్కొన్న కారణాలన్నింటికీ వ్యతిరేకం మరియు అన్ని సమస్యల నుండి మిమ్మల్ని కాపాడుతుంది. అయితే పడుకునేటప్పుడు తూర్పు ముఖంగా తల పెట్టుకుంటే చాలా మంచిదని చెబుతారు. ఎందుకంటే తూర్పున ఉదయించే సూర్యుడు మనకు ఉదయాన్నే సానుకూల శక్తిని లేదా మేల్కొలపడానికి ప్రేరణనిస్తుంది. కాబట్టి తూర్పు ముఖంగా తల పెట్టి నిద్రించడం ఉత్తమం.

# ఇన్ఫినిటీ వాకింగ్ వల్ల వేగంగా బరువు తగ్గొచ్చు తెలుసా?



**విశ్వంభర, ఫీచర్ :** నడక వల్ల చాలా ప్రయోజనాలు ఉంటాయని అందరికీ తెలుసు. అయితే నడక కూడా కరెక్టుగా సరైన పద్ధతిలో చేయడం వల్లనే ఆ ప్రయోజనాలను పొందవచ్చు.. ఇదో జాలీగా వాకింగ్ చేస్తే.. టైమ్ పాస్ తప్ప ఏం లాభం ఉండదు.. 8 ఆకారపు నడక వల్ల మీరు రెట్టింపు ప్రయోజనాలను పొందవ్చు. దీనిని ఇన్ఫినిటీ వాక్ అని కూడా అంటారు. ఇలా చేయడం వల్ల ఎలాంటి లాభాలు కలుగుతాయో ఇప్పుడు తెలుసుకుందాం.

**ఇన్ఫినిటీ వాక్ – బరువు తగ్గడం**

ఈ సంఖ్య 8 ఆకారంలో ఉండటం వల్ల వేగంగా బరువు తగ్గే అవకాశం ఉంది. ఈ ఆకృతిలో నడవడం వల్ల శరీర భాగాలు, కండరాలన్నీ కదులుతాయి. కొవ్వు సులభంగా కరిగిపోతుంది. కాబట్టి తక్కువ సమయంలో వేగంగా బరువు తగ్గే అవకాశం ఉంది.

**8 ఆకార నడక – BP నియంత్రణ**

అధిక రక్తపోటు ఉన్నవారు ఈ ఆకారంలో నడవడం ద్వారా రక్తపోటును అదుపులో ఉంచుకోవచ్చని ఓ అధ్యయనం చెబుతోంది. ఇది గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. ఈ ఆకృతిలో నడవడం వల్ల గుండెపై భారం తగ్గుతుంది. ఒత్తిడి కూడా తగ్గుతుంది. కాబట్టి బీపీ కూడా అదుపులో ఉంటుంది.

**కండరాలు ఎక్కువగా కదులుతాయి**

8 ఆకారంలో నడవడం వల్ల కండరాలు ఎక్కువగా పనిచేస్తాయి. వెనుకకు, ముందుకు వంగడం వల్ల పొట్ట దగ్గర కండరాలు, తొడల కండరాలు బలపడతాయి. ఎలాంటి దెబ్బలైనా తట్టుకోగలవు. ఫిట్‌నెస్‌ను పెంచుతుంది. కొవ్వు కరుగుతుంది.

**శరీర సమతుల్యతను మెరుగుపరుస్తుంది**

ఫిగర్ ఎనిమిది ఆకారంలో నడవడం ఒక వ్యక్తి యొక్క ఆనందాన్ని పెంచుతుంది. అంతే కాకుండా టర్న్ తీసుకునేటప్పుడు బాడీ బ్యాలెన్స్ తప్పి కిందపడే అవకాశం ఉంది. కాబట్టి ఇలా చేయడం వల్ల శరీర సమన్వయం పెరుగుతుంది. ఒత్తిడి, ఆందోళన కూడా తగ్గుతాయి. మీరు ఎలాగూ రోజు వాకింగ్ చేస్తుంటే.. కొన్ని రోజులు ఇలా నడిచి చూడండి.. ఏమో ఏమైనా ప్రయోజనం ఉండొచ్చు కదా.! ముఖ్యంగా బరువు తగ్గాలి అనుకునేవాళ్లు ట్రై చేయండి.. మనకు ఎలా నడిచినా వెయిట్ లాస్ అవ్వడం ముఖ్యం కాబట్టి ఆ లక్ష్యాన్ని చేధించడానికి కొత్త కొత్త ప్రయత్నాలు చేయడంలో తప్పు లేదు..!

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com